1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 4
సంచిక : 1
పుటలు : 52
రు. 20/-లు
తెనాలి

ఉగాది శుభాకాంక్షలు

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

మార్చి 2018



మలేసియా తెలుగుజన హృదయనేత డా. అచ్యయ్యకుమార్‌రావు



## అమ్మనుడితోనే ముందడుగు
## మలేసియా తెలుగు జనుల బాట ఇదే

త్వరలో ప్రారంభోత్సవం జరుపుకోబోతున్న మలేసియా తెలుగు అకాడమీ



బలమైన తెలుగు పునాదులను నిర్మిస్తున్న వెలగ అప్పలనాయుడు



అమ్మభాషే మా ప్రాణం



తెలుగుతో విద్యారంగంలో దూసుకుపోతున్న మలేసియా తెలుగు తేజాలు





బాగన్‌డత్తోలో వెంకటేశ్వరస్వామి దేవాలయంలో తెలుగువారి సంస్కృతీ వైభవం

## తెలుగు రాష్ట్రాల్లో భాషాసాధికారత కోసం ఏదీ ప్రణాళిక?

మాతృభాషాదినోత్సవం సందర్భంగా తెలుగు భాషోద్యమ సమాఖ్య- బెజవాడ బార్ అసోసియేషన్,
ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ)ల సహకారంతో విజయవాడలో ఫిబ్రవరి 18న నిర్వహించిన సదస్సు దృశ్యాలు



ప్రసంగిస్తున్న సభాధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు, అతిథులు


ముఖ్య అతిథి: రెండు రాష్ట్రాల ఉమ్మడి న్యాయస్థాన
న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు


విశిష్ట అతిథి : జిల్లా న్యాయాధికారి, కవి
శ్రీమంగారి రాజేందర్






కృష్ణాజిల్లా న్యాయమూర్తి వై. లక్ష్మణరావు, కీలకపత్ర సమర్పకులు-న్యాయవాది బి. హనుమారెడ్డి,
బెజవాడబార్‌అసోసియేషన్ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, ఐలూఆం.ప్ర. అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




**మార్చి 2018**

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు. 3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము. 4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము. **అమ్మనుడి** లో ప్రచురణ ఐన తరువాత ఇతర పత్రికలలోగాని, సోషల్ మీడియాలో గాని ప్రచురించేట్లయితే – **అమ్మనుడి** నుంచి తీసుకున్నట్లు తప్పక పేర్కొనాలి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదకహృదయం :** | తెలుగు రాష్ట్రాల్లో భాషాసాధికారత కోసం ఏదీ ప్రణాళిక? | | **7** |
| **ఉద్యమం :** | న్యాయస్థానాల్లో తెలుగు వినియోగం కోసం... | **ప్రత్యేక ప్రతినిధి** | **8** |
| | కీలకపత్రం | **బి.హనుమారెడ్డి** | **10** |
| **స్పందన :** | తెలుగులో చదువెందుకు పాలనెందుకు... | **గొట్టిపాటి మురళీమోహన్** | **12** |
| **ఆధునిక భాష :** | తెలుగు భాషకి ఆధునిక హోదా కోసం .... | **వీవెన్** | **13** |
| **అట్టమీది బొమ్మలు:** | మలేసియాలోని తెలుగువారి నడుస్తున్న చరిత్ర | | **15** |
| **సాహిత్య విమర్శ:** | కన్యాశుల్కం – ఒక తులనాత్మక అధ్యయనం | **డా॥ కా.వెంకటేశ్వర్లు** | **29** |
| **పల్లెపదాలు :** | తెన్నాటి తెలుగు పాటలు 4 | **సామల మురళి** | **31** |
| **మాండలికాలు :** | తెలంగాణ తెలుగు సంస్కృతాల అవినాభావ ... | **డా॥ నలిమెల భాస్కర్** | **32** |
| **ఉత్సవం :** | తెలుగు భాషా బ్రహ్మోత్సవాలు | **అమ్మనుడి ప్రతినిధి** | **35** |
| **లేఖా సాహిత్యం :** | నిగమశర్మకు అక్కరాసిన లేఖావళి–4 | **గజానన్ తామన్** | **37** |
| **పిట్ట చూపు :** | బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలిపోవడానికి... | **చలసాని నరేంద్ర** | **43** |
| **పుస్తక సమీక్షలు:** | | | **46** |
| **వార్తలు** | | | **49** |

**ధారావాహికలు :**

| | | | |
|---|---|---|---|
| **1. మౌనంలోని మాటలు5 :** | సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ – | **ఆర్.బి.కుమార్,రం.రామచంద్రరావు** | **23** |
| **2. బౌద్ధం–వైజ్ఞానిక మార్గం – 11** | ..... | **బొర్రా గోవర్ధన్** | **39** |

**భాషోద్యమ కథానికలు :**

| | | |
|---|---|---|
| 1. మనోల్లే | **భువన చంద్ర** | **26** |

**కవితలు :**

| | | |
|---|---|---|
| 1. ఆదిపునాది ఉగాది | **గుర్రాల రమణయ్య** | **34** |
| 2. పాలకులు ప్రకృతి విధ్వంసకులౌతున్నారు | **కత్తి పద్మారావు** | **45** |



రేఖా చిత్రాలు : **చిదంబరం**

కార్టూన్లు : **సరసి, శేఖర్**

కంప్యూటరీకరణ : **లంకె జనార్దన్**



రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* e-mail : editorammanudi@gmail.com

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
**అమ్మనుడి**
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
**AMMA NUDI - AXIS BANK, TENALI**
అక్కౌంట్ నెం. **915020010550189**
**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంప గలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

# కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురించాలని సంకల్పించాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల్లో ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికంగా 500రూ. ఇవ్వబడుతుంది.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- తరువాత ఈ కథానికలతో ఒక సంకలనాన్ని తెస్తాం.
- ప్రముఖ కథానికారచయిత **డా.వేదగిరి రాంబాబు** ఈ శీర్షికను **అమ్మనుడి** కోసం నిర్వహిస్తున్నారు.
- మన భావాలకు శాశ్వత రూపాన్నిచ్చే మన మాతృభాష కేంద్రంగా మీరు పంపే కథానికల కోసం ఎదురు చూస్తుంటాం. అమ్మభాష కోసం నిర్వహిస్తున్న ఈ వినూత్న శీర్షికకు విలువైన మీ కథానికలను పంపాల్సిన చిరునామా:

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. కార్యాలయం ఫోన్ : 0866-2439466. సంపాదకుడు : 9848016136. e-mail : editorammanudi@gmail.com

<u>గమనిక :</u> కథలను అనుఫాంట్స్‌లో గాని, యూనికోడ్‌లో గాని టైప్ చేసి, పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి.ఫైల్సులోపంపించాలి. చేతివ్రాతలో పంపేట్లయితే వ్రాసిన దానిని స్కాన్ చేయించిపంపాలి. లేదా వ్రాతప్రతిని పోస్టులో గాని, కొరియర్‌లో గాని పంపించాలి.

# శ్రద్ధాంజలి



మునిపల్లె రాజుగారు

'తెనాలి' పేరు ప్రతిష్ఠలకు సాహితీరంగంలో కారణమైన అనేకమంది రచయితల్లో ఒక మేటి – మునిపల్లె రాజుగారు. ఇంకా ఏడేళ్ళు ఓపిక పడితే వందేళ్ల పండుగ చేసుకొనే సందర్భం వచ్చి వుండేది. 1925 మార్చి 16న పుట్టి, 2018 ఫిబ్రవరి 24న జీవితాన్ని చాలించారు. ఎన్నో గొప్ప కథల్ని వ్రాసిన ఈ రచయితగా అందరికీ తెలిసిన రాజుగారు ఒక వ్యక్తిగా, మానవత్వం మూర్తీభవించిన మంచి స్నేహితుడిగా కొద్దిమందికి తెలుసు. 'నడుస్తున్న చరిత్ర' పత్రికను తొలి నుంచీ అభిమానించి, తెలుగు భాషోద్యమాన్ని సన్నిహితంగా గమనించేవారు. ఆయన్నూ, మధురాంతకం రాజారాంగార్నీ ఒకే సందర్భంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో దాదాపొక ఇరవై ఏళ్లక్రితం నాకు పరిచయం చేసినవారు మరో గొప్ప రచయితా, నాకు సన్నిహిత మిత్రుడూ కీ.శే. వాకాటి పాండురంగారావుగారు. తర్వాత కీ.శే. సి.ధర్మారావుగారితో కలిసి నేను రాజుగారితో ఐదారు సందర్భాల్లో మాటామంతీ కలిపిన సందర్భాలు జ్ఞాపకం వస్తున్నాయి. 2003 లో తెలుగుభాషోద్యమ సమాఖ్య ఆవిర్భావ సభకు ఆయన వచ్చినట్లు గుర్తు. పత్రికను గౌరవంగా పంపిస్తే, సున్నితంగా మందలించి, అక్కడ నుండి ప్రతీ ఏటా చందాను మని ఆర్డరుగా పంపేవారు. రక్షణ రంగంలో పనిచేసిన జీవితం ఆయనది. జీవితంలో కూడా అంతే నిబద్ధత. మునిపల్లె రాజుగారు తన కథలను, కవితలను, వ్యాసాలను సంపుటాలుగా ప్రచురించారు. 'పుష్పాలు – ప్రేమికులు', 'దివా స్వప్నాలతో ముఖాముఖి', 'అస్తిత్వనాదం ఆవలితీరాన', 'మునిపల్లె రాజు' కథలు అనే నాలుగు కథా సంపుటాల్ని, రెండు కవితా సంపుటాల్నీ, ఒక వ్యాస సంపుటాన్నీఆయన ప్రచురించారు. చాలా ఆరోగ్యంగా ఉండేవారు. 93 ఏళ్ళ నిండువయసులో పండులా రాలిపోయారు. ఆయనకు మా శ్రద్ధాంజలి. – సంపాదకుడు

STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF
**"AMMANUDI",** MONTHLY MAGAZINE, **Tenali**
as required under Rule 3 of the Registration of News Papers (Central) Rules 1956.

## FORM IV (See Rule 3)

| | | |
|---|---|---|
| 1. Place of Publcation | : | Angalakuduru |
| 2. Periodicity | : | Monthly |
| 3. Printer's Name | : | SAMALA LAKSHMANA BABU |
| 4. Whether Citizen of India | : | Yes |
| 5. Address | : | D.No.8-386, Angalakuduru Post, Tenali Mandal - 522 211 Guntur Dist., A.P. |
| 6. Publishers Name | : | SAMALA LAKSHMANA BABU |
| Address | : | As above |
| 7. Editor's Name | : | SAMALA RAMESH BABU |
| Address | : | As above |
| 8. Names & Addresses of individuals who own the News Paper | : | SAMALA LAKSHMANA BABU As above |

I, Samala Lakshmana Babu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Tenali
28-02-2018

sd/- S. Lakshmana Babu
Publisher

# మీరు 'అమ్మనుడి' చందాదారులేనా...

'అమ్మనుడి పత్రికకు చందాదారులు పంపే చందా సొమ్మే ఆధారం. కనుక –

1. తాము చందాదారులైతే మీకు పంపే పత్రిక కవరుపై చందా ఏ నెల వరకు ఉన్నదీ పేర్కొని వుంటుంది. దయచేసి దానిని గమనించి, సకాలంలో మీ చందా సొమ్మును పంపించి పత్రికను ఎల్లప్పుడూ అందుకోండి.

2. తాము చందాదారులు కాకపోయినా, తమకు గౌరవ ప్రతిగా (కాంప్లిమెంటరీగా) ఉచితంగా అందుతూ వుండవచ్చు. అటువంటి మిత్రులకు పత్రిక నచ్చితే, దయచేసి చందాను పంపించి తోడ్పడగలరు. పత్రిక నచ్చకపోయినా, మీకు ఆసక్తి లేకపోయినా 'పత్రికను పంపవద్దు' అని దయచేసి ఒక కార్డుపైగాని, ఎస్.ఎం.ఎస్ / మెయిల్‌గాని పంపించి సహకరించగోరుతున్నాము.

3. పత్రికకు చందాను చెల్లించేవారు తమ ఇష్టాన్ని బట్టి శాశ్వత చందా (రు. 5000/–)గాని, 5 సం॥ల చందా (రు.1000/–లు)గాని, 3 సం॥ల చందా (రు. 700/–లు)గాని పంపి పత్రికను ఆర్థికంగా తోడ్పడగలరు. వీలుగాకపోతే సం॥ చందా రు. 240/–లు పంపించి ఏటా పునరుద్ధరించుకోవచ్చు. – ప్రచురణకర్త, అమ్మనుడి.

2018 ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రపంచంలోని భాషాజాతులకు

# యునెస్కో డైరెక్టర్ జనరల్ సందేశం



ఆడ్రే అజౌలే

"19వ అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవ సందర్భంగా, ప్రపంచ వ్యాప్తంగా భాషా పరిరక్షణ మరియు భాషాభివృద్ధి కార్యక్రమాలకు యునెస్కో కట్టుబడి ఉందని తెలియజేస్తున్నాను.

భాష కేవలం భావాలను పంచుకోవడానికి మాత్రమే కాకుండా, మానవ జీవనంలోని విలువలను, విశ్వాసాలను, మానవజాతి ఉనికిని చాటిచెప్పే అపురూపమైన సాధనం. మన అనుభవాలను, సంప్రదాయాలను, మన జ్ఞానాన్ని ఒక తరం నుండి మరో తరానికి భాష ద్వారానే ప్రవహింప జేస్తున్నాం. భాషా వైవిధ్యం అనేది మానవ ఆకాంక్ష రూపకల్పనలో తరిగిపోని అద్వితీయమైన సంపద.

మానవజాతి సంస్కృతిని పరిరక్షించడంలో భాగంగా ఈ భాషా వైవిధ్యాన్ని కాపాడటానికి, బహుభాషా విద్యావిధానాన్ని కాపాడటానికి, ప్రోత్సహించడానికి యునెస్కో ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తూనే ఉన్నది. ఈ కృషిలో భాగంగా, వికసిస్తున్న, చైతన్యవంతమైన కోట్లాది యువతను ప్రపంచ మానవులుగా తీర్చిదిద్ది వారిని మానవ సమాజపు విలువైన సంపదగా తీర్చిదిద్దే క్రమంలో మాతృ భాషలో విద్యాబోధనను ప్రోత్సహించి, స్థానికంగానూ ప్రపంచస్థాయిలోనూ మానవ సమాజాన్ని పటిష్టం చేయటం యునెస్కో చేపట్టిన ప్రధాన కార్యక్రమం.

ఈ లక్ష్యంతోనే యునెస్కో ప్రపంచవ్యాప్తంగా భాషా విధానాలకు మద్దతునిస్తుంది. అందునా, భిన్న భాషలతో అలరారే దేశాలలో మాతృభాషా వికాసానికి, మరీ ముఖ్యంగా ఆయా ప్రాంతాల భాషా వికాసానికి సంపూర్ణ మద్దత్తును అందిస్తున్నది. బాలబాలికల విద్యలో మొట్టమొదటి దశలో మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని యునెస్కో ఆశిస్తున్నది. ఎందుకంటే పిల్లలు వారి స్వభాషలోనే మొదటి దశలో జ్ఞాన సముపార్జన సహజంగా చేయగలుగుతారు. అదేవిధంగా నిత్యజీవితంలో, అందునా ఇంటర్నెట్ వంటి వాటి వినియోగంలో బహుభాషా వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నది. ప్రతివారికీ సైబర్ స్పేస్‌లోనూ ఆన్‌లైన్ సమాచార వ్యవహారాలనూ సమర్థవంతంగా వినియోగించుకునే స్థితి భాషా పరిమితులను దాటి ఉండాలని యునెస్కో ఆశిస్తున్నది. సుస్థిర అభివృద్ధిని సాధించే క్రమంలో మానవ సమాజం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాళ్ళలో ఇది ఒకటి. అందుకనే ఈ అంశం ఐక్యరాజ్యసమితి 2030 ఎజెండాలో చోటుచేసుకున్నది.

ప్రతి రెండు వారాలకు ప్రపంచంలో ఒక భాష కనుమరుగవుతున్నది. అంటే మానవ సమాజంలోని ఒక భాగం యొక్క చరిత్ర, సంస్కృతి కనబడకుండా పోతున్నది. ఈ భారీ నష్టాన్ని మానవజాతి నిరోధించాలంటే భాషా వైవిధ్యాన్ని ప్రోత్సహించడం అనేది అతి కీలకమైన నష్ట నివారణ చర్య.

నెల్సన్ మండేలా యొక్క చిరస్మరణీయమైన మాటలలో చెప్పాలంటే *"మీరు ఒకరితో వారు అర్థం చేసుకోగల భాషలో మాట్లాడితే అది వారి మెదడుకు చేరుతుంది. అదే వారి మాతృభాషలో మాట్లాడితే అది తప్పనిసరిగా వారి హృదయాన్ని చేరి తీరుతుంది".*

ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా యునెస్కో సభ్య దేశాలకు వైవిధ్య భరితమైన విజ్ఞానదాయకమైన కార్యక్రమాలను నిర్వహించుమని, ప్రపంచపు భాషా వైవిధ్యాన్ని - బహుభాషా లక్షణాన్ని కాపాడుమని విజ్ఞప్తి చేస్తూ ఉన్నది.


## తెలుగువారంతా చదవవలసిన పుస్తకాలు

స.వెం.రమేశ్ రచన




**ఎల్లలు లేని తెలుగు**

వెల : రు.200/-లు

శ్రీగారపాటి ఉమామహేశ్వరరావు రచచలు



**తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం**

వెల :రు. 100/-



**ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం**

వెల : రు.350।-

రచయితలు, భాషోద్యమకారులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, ఆసక్తిగల వారంతా ఈ రచనలను చదివి ప్రయోజనం పొందగోరుతున్నాము

పుస్తకాల వెలను ఎం.ఒ చేస్తే వాటిని కొరియర్ / రిజిస్టర్ బుక్ పోస్ట్‌లో పంపిస్తాము.

**తెలుగుజాతి (ట్రస్టు)** - జీవక భవనం, 8-346, అంగలకుదురు పోస్టు తెనాలి - 522211ఫోన్ : 9440448244

సంపుటి : 4 సంచిక : 1
**అమ్మనుడి**
మార్చి 2018

సంపాదక హృదయం

# తెలుగు రాష్ట్రాల్లో భాషాసాధికారత కోసం ఏదీ ప్రణాళిక?

తెలుగు ప్రజలకోసం తెలుగు రాష్ట్రాలేర్పడ్డాయి. కనుక ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రజల భాషలోనే అన్ని పనులూ జరగాలి. అంటే – చట్టనిర్మాణవ్యవస్థ కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయపాలనా వ్యవస్థ – ఇవన్నీ ప్రజలభాషలో నడవాలి. అప్పుడే తెలుగుకు సాధికారత కలుగుతుంది; ప్రజలభాష తెలుగుకు పట్టం కట్టినట్లవుతుంది.

ప్రజలభాషలో విద్యాబోధన జరగాలి. కనీసం పాఠశాల స్థాయిలో – మరింత కనీసంగా ప్రాథమిక విద్యాస్థాయివరకైనా మాతృభాషలో బోధనంతా జరగాలి. కొన్ని అంశాలను ఏ మాధ్యమంలో బోధించినా, మాతృభాషను తప్పనిసరిగా ఒక భాషగా కొనసాగించాలి. ఒకటి రెండు అంశాలు – సాంఘిక, చరిత్ర, సంస్కృతి, పర్యావరణం వంటి వాటిని మాతృభాషలో బోధించాలి. హేతుబద్ధత, వాస్తవికతలతో, విద్యారంగంలో సంస్కరణలకు పూనుకోవాలి. అదే సమయంలో ప్రజలభాష తెలుగును అన్ని విధాలా ఆధునిక భాషగా పూర్తిగా వినియోగించేందుకు ప్రభుత్వాలు పూనిక వహించాలి. తెలుగుభాష ఏ ఇతర భాషకూ తీసిపోదనే శాస్త్రీయ దృష్టితో తెలుగు ప్రభుత్వాలు పనిచెయ్యాలి.

ఈ విధమైన లక్ష్యం, పట్టుదల కలిగి ప్రజలభాషకు సాధికారత చేకూర్చుదామనే ఆలోచనే నేటి రెండు ప్రభుత్వాల నేతలకు లేదు. అందుకనే తెలుగుపట్ల ఇద్దరూ ఎప్పటికప్పుడు భావోద్వేగాలను ఉపశమింపజేసే చర్యల్ని గైకొంటున్నారు తప్ప, చిత్తశుద్ధితో సరియైన చర్యలను చేపట్టడం లేదు.

చట్ట నిర్మాణంలోగాని, వాటి అమలులోగాని, న్యాయపాలనలోగాని ప్రజలభాషకు పూర్తి సాధికారత కలిగించకుండా చెల్లని మాటలెందుకు? జి.ఒ.లను కూడా తెలుగులో ఇవ్వలేని ప్రభుత్వాలు మనకు ఎందుకున్నట్లు? న్యాయపాలనతో సహా అన్ని రంగాల్లోను ప్రజల నోటిని మూసిపెట్టేందుకు స్వతంత్రదేశంలో స్వరాష్ట్రంలో మన సొంత ప్రభుత్వాలే ప్రజల్ని ఎందుకు మోసపుచ్చుతున్నాయి?

ఇంగ్లీషునుగానీ, మరొకభాషనుగానీ నేర్చుకోవద్దు అని బుద్ధివున్నవారెవరూ చెప్పరు. సాక్షాత్తూ 'యునెస్కో'వారు తాజాగా ఏం చెప్పారో గమనించండి.

"బహుభాషల, సంస్కృతులతో కూడిన సమాజాల్లో బహుభాషీయ పౌరుల మధ్య మనం నివసిస్తున్నాం. మన ఉనికి మన భాషల ద్వారానే; మన భాష ద్వారానే మనల్ని మనం వ్యక్త పరచుకొంటాం, తెలియజేసుకొంటాం, సామాజిక, ప్రజాజీవనంలో పాల్గొంటాం. అంతేకాదు, మన వారసత్వ సంప్రదాయ విజ్ఞానాన్ని అందజేస్తాం. మన విజ్ఞానాన్నీ సాంస్కృతికతలనూ స్థిరంగా నిలిచిపోయే విధంగా పెంపొందిస్తాం".

బహుభాషా విధానంతోనే నిలకడగల అభివృద్ధి సాధ్యం అవుతుందనీ ఇందుకు మాతృభాషల్ని కాపాడుకోవాలనీ, మాతృభాషలోనే ప్రాథమిక విద్యను తప్పనిసరిగా బోధించాలని, బహుభాషా విధానానికి ఇది పునాది అనీ యునెస్కో చెప్పింది. ఇదంతా మన పాలకవర్గాల చెవులకెక్కుతోందా?

చైనాతో జనాభాలో, అభివృద్ధిలో మనం పోటీపడుతున్నాం. జర్మనీ, జపాన్, ఇజ్రాయిల్ వంటి అనేక పెద్దా చిన్నా దేశాల ఎదుగుదలను చూసి ఆశ్చర్యపోతున్నాం. మరి, భాష విషయంలో, భాషా సాధికారత విషయంలో వారనుసరిస్తున్న విధానాలను చూసి మనం ఏం నేర్చుకొంటున్నాం?

ప్రజలభాషకు సాధికారత లేనప్పుడు అది ప్రజాస్వామ్యపాలన కాదు.

ఇంతకూ – తెలుగుకు సాధికారతలేని తెలుగు రాష్ట్రాలెందుకు?

సామల రమేష్‌బాబు

తేదీ : 28-2-2018

# న్యాయస్థానాలలో తెలుగు వినియోగం కోసం ఉద్యమ సమాలోచన




అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం (ఫిబ్రవరి 21)ను పురస్కరించుకుని తెలుగు భాషోద్యమ సమాఖ్య ఈ ఏడాది చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమం ఇది. అటు తెలంగాణ రాష్ట్రం ప్రపంచ తెలుగు మహాసభల్ని జరిపిన నేపథ్యంలో తెలుగు కోసం విద్యారంగంలోను, పాలనారంగంలోను అర–కొర చర్యలు చేపడుతున్నది. ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి 2018 సంవత్సరాన్ని తెలుగు భాషావికాస సంవత్సరంగా పేర్కొని, తాము కూడా తెలుగు కోసం అంకితమై పనిచేస్తున్నామనే ప్రచారాన్ని చేస్తూ – అసలైన పాలన, విద్యారంగాన్ని విస్మరిస్తున్నారు. న్యాయస్థానాల్లో తెలుగు వినియోగం విషయాన్ని అందరూ విస్మరించారు.

అధికార భాషా సంఘానికి అధ్యక్షులుగా ఎబికె ప్రసాద్, మండలి బుద్ధప్రసాద్ గార్లు అధ్యక్షులుగా వున్నపుడు ఇందుకు సంబంధించిన కృషి కొంత జరిగింది. తర్వాత మళ్ళీ ఎక్కడి గొంగళి అక్కడే. ఇటీవల మూడు నెలల క్రితం ప్రకాశం జిల్లాలో న్యాయాధికారుల చొరవతో, న్యాయవాది బి.హనుమారెడ్డి గారి ప్రోత్సాహంతో కొంత కృషి జరిగింది. 'అమ్మనుడి' పత్రిక గత కొన్ని నెలలుగా యీ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. తెలుగు భాషోద్యమ సమాఖ్య రంగంలోకి దిగి, ముందుగా విజయవాడలో ఒక ఉద్యమ సమాలోచన సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఇందుకు బెజవాడ బార్ అసోసియేషన్, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలూ) సహకరించాయి. ఫిబ్రవరి 21 కి రెండు రోజులు ముందుగా ఆదివారం ఫిబ్రవరి 18న బెజవాడ బార్ అసోసియేషన్ హాలులోనే అనుకున్నదానికంటే బాగా సమాలోచన సదస్సు జరిగింది.

ముఖ్య అతిథిగా జస్టిస్ ఎ. రామలింగేశ్వరరావు (ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి), విశిష్ట అతిథిగా శ్రీ మంగారి రాజేందర్ (విశ్రాంత జిల్లా న్యాయాధికారి, తెలంగాణ సర్వీస్ కమిషన్ సభ్యులు విచ్చేశారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీ వై.లక్ష్మణరావు, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సోముకృష్ణమూర్తి, రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ వక్తలుగా పాల్గొన్నారు. సభకు తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షుడు శ్రీ బి.హనుమారెడ్డి కీలకపత్రాన్ని సమర్పించారు. (కీలకపత్రం పూర్తి పాఠాన్ని తర్వాతి పుటల్లో చదవండి). తొలుత – ఐలూ జాతీయ సెక్రటేరియట్ సభ్యుడు సప్పా రమేష్‌బాబు సభకు స్వాగతం పలికారు. రాజేష్ బృందం

తెలుగు భాషోద్యమ గీతాలను పాడి అందరినీ ఉత్సాహపరిచారు. రెండు గంటలకు పైగా జరిగిన సభలో స్థానికులేగాక, రెండు రాష్ట్రాల నుంచీ వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా న్యాయాధికారులు శ్రీ బి.దుర్గయ్య (14వ అదనపు జిల్లా జడ్జి), శ్రీ ఎ.పార్థసారథి (4వ అదనపు జిల్లా జడ్జి – వీరు తెలుగులో తీర్పులిచ్చారు.) శ్రీ టి.వేణుగోపాలరావు (12 వ అదనపు జిల్లా జడ్జి), శ్రీ ఎ.వి.వి. ప్రసాద్ (అడిషనల్ రిజిస్ట్రారు, ఎ.పి. కో–ఆపరేటివ్ ట్రిబ్యునల్, విజయవాడ) సభలో ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయవాది సంపర దుర్గాప్రసాద్ అందరకూ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమ మొత్తాన్ని తమపై వేసుకొని బెజవాడ బార్ అసోసియేషన్, 'ఐలూ' బాధ్యులు ఉత్సాహంగా నిర్వహించారు. ఐలూ నగర అధ్యక్షుడు సి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షురాలు కె.పద్మజ, కార్యదర్శి వి.రాజరత్నం మొత్తం బాధ్యతలను నిర్వహించారు. సమాఖ్య ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి డా॥ వి. సింగారావు, తెలంగాణ కార్యదర్శి టి.ప్రభాకర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రెండు రాష్ట్రాల్లోనూ ఈ కార్యక్రమాన్ని చేపట్టడానికి పలువురు ఉత్సాహంగా తమ సంసిద్ధతను తెలియజేశారు.

## పిలుపు

రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అన్ని రంగాలలో పాలనలో తెలుగు అమలు పట్ల పూనిక వహించాలని ఈ సదస్సు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది.

న్యాయవాద వృత్తిలో ఉన్నవారంతా చొరవ తీసుకొని తెలుగు సాధికారత కోసం తమ స్థాయిలో కృషిచెయ్యాలని కూడా ఈ సదస్సు విజ్ఞప్తి చేసింది.

ఈ సందర్భంగా ఈ క్రింది తీర్మానాలను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత కీలకపత్రం సమర్పించిన బి. హనుమారెడ్డి గారే సభలో తీర్మానాలను ప్రతిపాదించారు.

## తీర్మానాలు

1 అవిభక్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1974 లో జారీ చేసిన 485 జి.ఒ.ను పూర్తిగా రద్దు చేసి దిగువస్థాయి క్రిమినల్ న్యాయస్థానాల భాషగా తెలుగును ప్రకటిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఉత్తర్వులు వెలువరించాలని కోరుతూ తీర్మానించడమైనది.

2. దిగువస్థాయి సివిల్ న్యాయస్థానాలలో తెలుగులో కార్యకలాపాలు జరిగే విధంగా సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 137 ను సవరించవలసినదిగా రెండు తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలను కోరుతూ తీర్మానించడమైనది.

3. న్యాయశాస్త్ర విద్యాబోధన తెలుగుభాషలో జరిగేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాల్సిందిగా బార్ కౌన్సిల్ మరియు రెండు రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ తీర్మానించడమైనది.

## జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు

*"ప్రజాస్వామ్యంలో ఉండే శాసన, న్యాయ, పరిపాలన వ్యవస్థలు మూడింటిలోనూ తెలుగు భాష అమలు జరగాలి. మిగతా రెండింటిలో మార్పు రాకుండా కేవలం న్యాయవ్యవస్థలో రావాలను కోవడం సరికాదు.*

*న్యాయస్థానాల్లో ప్రజలకు అర్థమయ్యేలా తెలుగులోనే తీర్పులను, వాటి ప్రతులను ఇవ్వాలంటే ఉద్యమాలు చేస్తే కాదు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చూపు సారిస్తేనే ఇది సాధ్యమవుతుంది. న్యాయవ్యవస్థ తీర్పుల విషయంలో మాత్రమే స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. న్యాయపరిపాలనకు అవసరమైన నిధులను మొత్తం ప్రభుత్వమే ఇస్తుంది.*

*తర్జుమా, డిటిపి, న్యాయపరిపాలనా పదకోశం వంటివి ఉండాలి. అవి లేకుండా తీర్పులను తెలుగులో చెప్పడం కష్టం.*

*న్యాయవిద్య చదివే విద్యార్థులు, కిందస్థాయి న్యాయవాదులు, ఉద్యోగులకు సైతం తెలుగుపై పూర్తి అవగాహన ఉండాలి. ఉద్యోగ నియామకాల్లో తెలుగులో చదివినవారికి ప్రాధాన్యం ఇవ్వాలి".*

## శ్రీ మంగారి రాజేందర్

*"చట్టాలు వ్యక్తుల వెంట వున్నా అవి ఆంగ్లభాషలో ఉండడంతో ప్రజలకు దూరంగా ఉంటున్నాయి.*

*న్యాయస్థానాల్లో తీర్పులను మాతృభాషలో ఇవ్వాల్సిన అవసరం వుంది.*

*పరిపాలన మాతృభాష తెలుగులో జరిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇందుకోసం కొన్ని చర్యలు తీసుకొన్నారు. అధికార భాషా సంఘాలు ఉన్నా అవి నామమాత్రంగానే వ్యవహరిస్తున్నాయి.*

*తెలుగు బోధన తప్పనిసరి చెయ్యాలి. న్యాయస్థానాల్లో తెలుగు అమలుకు అడ్డంకు వున్నా వాటిని మార్పు చేసుకొంటూ సాధ్యమైనంతవరకు కక్షిదారుకు అర్థమయ్యేలా తీర్పులుండాలి. న్యాయవాదులు అందుకై కృషిచెయ్యాలి."*

## శ్రీ వై.లక్ష్మణరావు

*"అమ్మను మరచిపోతే జన్మకు సార్థకం లేదు. అదేవిధంగా అమ్మభాషను కూడా మరచిపోకూడదు. తమిళనాడులో న్యాయస్థానాల్లో న్యాయమూర్తులు కొన్ని తీర్పులను వారి మాతృభాషలో ఇస్తున్నారు. ఇక్కడ అలా జరగడం లేదు. తమిళనాడులో ప్రభుత్వాలు కూడా అందుకు ప్రోత్సహిస్తున్నాయి. ఇక్కడ కూడా ఆ పరిస్థితి రావాలి. జిల్లాలో కొందరు న్యాయమూర్తులు తెలుగులో తీర్పు ఇస్తున్నారు.*

*తెలుగులో మాట్లాడేవారిని చిన్నచూపు చూచే ధోరణి మనలో పోవాలి."*

బి.హనుమారెడ్డి, న్యాయవాది
94402 88080

# న్యాయస్థానాల్లో తెలుగు వినియోగం కోసం ఉద్యమ సమాలోచన - సదస్సు

(విజయవాడ 2018 ఫిబ్రవరి 18)

## కీలకపత్రం : న్యాయస్థానాలు - తెలుగు భాషావినియోగం

ప్రపంచంలోని అన్ని భాషాజాతుల ప్రజలు తమ మాతృ భాషలను కాపాడుకోవాలని 2000 సం॥లో యునెస్కో పిలుపిచ్చిన సంగతి మనందరికీ తెలిసిందే. 'యునెస్కో' ఫిబ్రవరి 21 ని అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవంగా జరుపుకోవాలని కూడా నిర్ణయించింది. ఆ పిలుపునసనుసరించే 2003లో ఆ రోజుననే 'తెలుగు భాషోద్యమ సమాఖ్య' ప్రారంభమై, నిరంతరం పనిచేస్తున్నది. మనం ఈ ఏడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగానే - ఈ సదస్సును జరుపుకొంటున్నాం.

ప్రజలభాషలోనే పరిపాలన సాగించడం, విద్యారంగాన్నీ, న్యాయరంగాన్నీ అన్ని స్థాయిల్లో తెలుగులో నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత; ప్రజల హక్కు. భాషా రాష్ట్రాలను ఏర్పాటు చేయడంలో ఉన్న కీలకాంశమూ అదే.

కాని, భాషారాష్ట్రాలు ఏర్పాటై 60 ఏళ్ళు దాటినా, మనకు - తెలుగు వాళ్లకు సంబంధించినంత వరకు - పై అంశాల్లో మనం చాలా వెనుకబడి వున్నాం. న్యాయరంగానికి సంబంధించి - న్యాయస్థానాల్లో తెలుగు వినియోగాన్ని అవసరమైన పూర్తి స్థాయికి తీసుకు వెళ్ళేందుకు - ఇప్పుడు ఉద్యమించి మనమంతా పనిచేయవలసి వుంది. ఇది మనందరి బాధ్యత. ఇందుకోసం మనం ఏం చెయ్యాలో ఎలా ముందుకు సాగాలో సమాలోచించేందుకే ఈ సదస్సులో మనం పాల్గొంటున్నాం.

)0(

చట్టాలు వ్యక్తుల వెంటేవున్నా అవి ఇంగ్లీషు భాషలో వున్న కారణాన సామాన్యుణ్ణి దూరంచేశాయి. చట్టాన్ని సామాన్యుడికి దగ్గర చేసేదీ భాషే, దూరం చేసేదీ భాషే.

ప్రజలకు చట్టాలకు వారధి ప్రజల భాష. ప్రజల భాషలో చట్టాలుండాలి. ప్రజల భాషలో చట్టాలు వాడాలి. ప్రజల భాషలో న్యాయస్థానాలు పనిచేయాలి. అది ప్రజల హక్కు. రాజ్యాంగంలో 29వ అధికరణంలో ప్రాంతీయ ప్రజల భాషలకు ఇచ్చిన హక్కులకు ఎట్టి భంగం కలుగరాదు. అదే అధికరణం భాషా హక్కును రక్షించుకొనుటకు ఉద్యమం చేసే హక్కును కూడ ఇచ్చింది. ఇపుడు మనందరి తక్షణ అవసరం అదే.

రాజ్యాంగాన్ని 299 మంది రాజ్యాంగ పరిషత్తు సభ్యులు చర్చించి, రాసి, ప్రాథమిక హక్కులతోపాటు రాజ్యాంగంలో భాషా హక్కును కూడ చేర్చారు. 8వ షెడ్యూలులోని 22 భాషల్లో తెలుగును ఒకటిగా చేర్చారు. దిగ్గంతులైన బాబూ రాజేంద్రప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్, డా.అంబేద్కర్ వంటి పెద్దలు దీర్ఘాలోచన చేశారు. భాషకు ప్రాధాన్యం ఇచ్చారు. అప్పటికే తెలుగు మాట్లాడే ప్రజలు సంఖ్యాపరంగా దేశంలో రెండవస్థానంలో వున్నందున తెలుగు భాషకు గుర్తింపు, స్థానం లభించింది. దరిమిలా భాషా ప్రయుక్త రాష్ట్రాలేర్పడినప్పుడు ఆంధ్రప్రదేశ్ అతి పెద్ద రాష్ట్రంగా ఏర్పడింది. 1965 సం.లో భాషను, భాషా పరిరక్షణను హక్కుగా సుప్రీం కోర్టు ధృవీకరించింది.

న్యాయస్థానాలలో భాషా వాడకాన్ని గూర్చిరాసిన 348వ అధికరణం ప్రకారం దిగువ న్యాయస్థానాలలో రాష్ట్రాల ప్రాంతీయ మాతృభాషలను వాడుకోవచ్చు. హైకోర్టు జడ్జిమెంట్లు, డిక్రీలకు మరియు మిగతా ప్రొసీడింగ్స్‌కు ప్రాంతీయ మాతృభాషలను వాడుటకు రాష్ట్ర గవర్నరు రాష్ట్రపతి ఆమోదంతో అనుమతి నివ్వవచ్చు.

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 272, సె.374ల ప్రకారం మరియు సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 137, ఆ.18 రూ.9 ప్రకారం ప్రాంతీయ భాషలను న్యాయస్థానాలలో వాడుకోవచ్చు. ఆప్రకారం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం జి.ఒ.ఎం.ఎస్485/29-3- 1974 ను ఇచ్చింది. ఇందుపై మన హైకోర్టువారు, తెలుగును న్యాయస్థానాలలో వాడుకోవటం చట్టబద్ధమేనని తీర్పునిచ్చారు.

### న్యాయవాదుల పాత్ర

ఇందుకు ప్రథమంగా న్యాయవాదుల పాత్ర ముఖ్యం. మన రాష్ట్రంలోని కక్షిదారులలో తెలుగురాని వారు 5 శాతం కూడ వుండరు. వారికోసం మాత్రమే ఇంగ్లీషు వాడుతూ తెలుగును వాడకపోవటం దురదృష్టం. న్యాయవాదులు తెలుగువారి నుండి ప్రతిఫలం పొందుతూ తెలుగు గాలి పీలుస్తూ, తెలుగు నీరు తాగుతూ వారి వ్యాజ్యాలకు న్యాయస్థానాలలో తెలుగు భాషలో కాకుండా, ఆంగ్లంలో పత్రాలు దాఖలు చేయటం రాజ్యాంగంలో ప్రజలకిచ్చిన హక్కులకు భంగం కలుగజేయటమే కాగలదు. న్యాయస్థానాల్లో దాఖలు చేయు పత్రాలు, ప్రోనోట్లు, అగ్రిమెంట్లు, విక్రయ పత్రాలు, వీలునామాలు, పారీకత్తులు వగైరాలు అన్నీ తెలుగులో వుంటై. వ్యాజ్యాలు, జవాబులు, సాక్ష్యాలు తెలుగులో రాయటానికి న్యాయవాదులకు ఆటంకం ఏమున్నది? క్రిమినల్ న్యాయస్థానాల్లో, యఫ్.ఐ.ఆర్‌లు, శవపంచాయతీ రిపోర్టులు, స్టేట్మెంట్లు, మధ్యవర్తినామాలు వగైరా తెలుగులోనే వుంటై. అందువలన ఆ న్యాయస్థానాల్లో తెలుగు వాడకానికి ఆటంకం ఏమున్నది? కక్షిదారుల హక్కులను గౌరవించటం న్యాయవాదుల ధర్మం.

### న్యాయస్థానాల పాత్ర

న్యాయస్థానాల్లో సాక్షులిచ్చిన సాక్ష్యాలు సాక్షుల భాషలో నమోదు కావటంలేదు. ఇంగ్లీషులో డిక్టేషన్, టైపింగ్ జరుగుతున్నవి. అందులో ఏమి నమోదైందో సాక్షికి తెలుపకుండానే సాక్షిచే గుడ్డిగా సంతకాలు పెట్టించుకుంటుంది. న్యాయస్థానం. తెలుగు భాషలో అనువదించి చెప్పే




వ్యవస్థలేదు. ఆ మాత్రం న్యాయస్థానాన్ని నమ్మరా! అని ప్రశ్నించటం న్యాయంకాదు. ఆ సమయంలో న్యాయమూర్తికి తెలిసిన దానికంటె సాక్షికి తన వ్యాజ్యం సంగతి బాగా తెలుసు. ఇది న్యాయస్థానాలు రాజ్యాంగంను, చట్టాలను జి.వొ. లను తెలిసే చేస్తున్న హక్కుల ఉల్లంఘన అవుతుంది. తీర్పులు తెలుగులో రాయటం న్యాయమూర్తులకు చిన్నతనంగా వుంది. చింతించవలసిన విషయం. తెలుగులో దావాలు, సాక్ష్యాలు, తీర్పులు రాయండని కక్షిదారులు న్యాయవాదులను, న్యాయస్థానాలను అడగాల్సిన అవసరం లేదు. అది వారి విధి. సామాన్యుని భాషలో కక్షిదారుని భాషలో న్యాయవ్యవస్థ నడవనందున అదే కక్షిదారునికి అన్యాయం జరుగుతుంది. కక్షిదారుడు తన వ్యాజ్యంలోని సమాచారాన్ని తాను తెలుసుకోవటానికి ఇతరులపై ఆధారపడి, ఖర్చును, కాలాన్ని పోగొట్టుకొనే అవసరం కలుగుతుంది. తెలుగులో తెలుసుకొనుటకు ఇతరులవద్ద చేతులుకట్టుకొని దేబిరించవలసిన పరిస్థితి నుండి కక్షిదారులను న్యాయస్థానమే ఆదుకోవాలి.

ప్రభుత్వాలకు మాతృభాష తెలుగుపై ఏమాత్రం సంకల్పం, పట్టుదల లేకపోవటాన్ని గర్హించవలసి వస్తుంది. ఇక్కడే తెలుగు ప్రాధికార సంస్థ అవసరం ఎంతోవుంది. ప్రభుత్వంతో, సుప్రీంకోర్టు, హైకోర్టులతో చర్చించు అనుసంధాన సంస్థగా తెలుగు ప్రాధికారసంస్థ ఉపయోగపడే అవకాశ మున్నది. అట్టి సంస్థ రాష్ట్రంలో ఏర్పాటు కాలేదు. మనది పేరుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. సుదీర్ఘ చరిత్రగల జాతి. మన భాషకు ప్రాచీనభాష హోదాను పోరాడి తెచ్చుకున్నాం. ఫలితం శూన్యం. ప్రపంచంలోని ఏ దేశానికైనా ఒక భాష వుంటుంది. మనకు అది అసాధ్యమైనందున పలు భాషలున్నై. పూర్వం నిజాం రాష్ట్రంలో మెడికల్ కోర్సు గ్రంథాలు, న్యాయశాస్త్రగ్రంథాలు ఉర్దూలో వున్నై. కాని, నేడు తెలుగు రాష్ట్రంలో తెలుగుభాషలో న్యాయశాస్త్ర గ్రంథాలు లేవు. ప్రభుత్వాలు భాషాసంబంధ పరిపాలనలో చిత్తశుద్ధి చూపటం అత్యవసరం.

## ముఖ్య అవసరాలు

– అన్ని జి.వొ.లను, చట్టాలను తెలుగులో తప్పనిసరిగా ప్రచురించాలి.

– హైకోర్టు మరియు హైకోర్టుకంటె క్రిందిస్థాయి న్యాయస్థానాలలో ప్రాంతీయ భాష తెలుగు వాడకం దాదాపు అన్నివిభాగాలలో తప్పని సరిచేస్తూ న్యాయపరిపాలనా వ్యవస్థ నిర్ణయం చేసి ప్రకటించాలి. ప్రత్యేకంగా అవసరమున్న చోట్ల ప్రత్యేక కారణాలపై ఇతరభాషలు వాడుకొను అవకాశం కలిగించవచ్చు.

– జి.ఒ నెం. 485/1974లో ఆయా జిల్లాలను బట్టి ఏఏ భాషలను వినియోగించవచ్చునో ఇచ్చారు తప్ప, తెలుగును తప్పనిసరి చేయలేదు. ఆ లోపాన్ని తొలగించి న్యాయస్థానాల్లో తెలుగును తప్పనిసరి చేస్తూ తగిన జి.ఒ.ను కూడా ఇవ్వాలి.

– న్యాయపదకోశం ప్రభుత్వంద్వారా చట్టసంబంధ నిపుణులచే నిర్మించబడాలి.

– చట్టాలను ప్రామాణిక పదాలతో తెలుగులోకి అనువదించి ప్రచురించుటకు ప్రత్యేకంగా న్యాయ నిపుణుల విభాగం అవసరం. ఎవరంటే వారు వారి భాషలో రాయటం వలన ఖచ్చితమైన చట్టనిర్మాణ ఉద్దేశం, పదాల అర్థం తలపెట్టిన ప్రయోజనం రాకపోవచ్చు.

– శాశ్వత అనువాద వ్యవస్థ వుండాలి.

– తెలుగు మాధ్యమంలో లా కోర్సుండాలి. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి న్యాయమూర్తుల ఉద్యోగ నియామకాలలో కొంత శాతం కేటాయింపు వుండాలి.

– తెలుగురాని వారికి, తెలుగులో పరీక్షలు రాయనివారికి ఆంధ్రప్రదేశ్‌లో దిగువ న్యాయస్థానాలలో ఉద్యోగార్హత లేకుండా నిర్ణయం తీసుకోవాలి.

– తెలుగులోకి ఆధునిక టెక్నాలజీ ఉపకరణాల వినియోగం విరివిగా రావాలి. సిబ్బందికి ఆ విభాగ శిక్షణ ఇవ్వటం ప్రత్యేక కార్యక్రమంగా పెట్టుకోవాలి.

న్యాయవ్యవస్థ, పరిపాలనా వ్యవస్థ ప్రజలకు చేరువ కావాలంటే సామాన్య ప్రజల భాష తెలుగులోనే తమ కార్యకలాపాలను జరుపుటకు కృతనిశ్చయం ప్రకటించి అనుసరించాలని తెలుగు ప్రజ ఆకాంక్షిస్తున్నది.

గొట్టిపాటి మురళీ మోహన్
న్యాయవాది, 9652085806

# తెలుగులోచదువెందుకు? పాలనెందుకు? న్యాయస్థానాలలో తెలుగెందుకు?

మన భాషా సంస్కృతులకు మనలను దూరం చేస్తే తప్ప బ్రిటిష్ పాలన కొనసాగదని మెకాలే ఇంగ్లీషు నూతన విద్యావిధానాన్ని సూచించాడు. స్వతంత్రం వచ్చిన తర్వాత ముఖ్యంగా హిందీ వ్యతిరేకాందోళన పిమ్మట ఆంధ్రప్రదేశ్ లో ఇంగ్లీషు మీడియమ్ పై మోజు పెంచుకొన్నారు. ఇంగ్లీషు మీడియం కోరుకున్న వాళ్లందరూ విదేశాల్లో లేదా బహుళజాతి కంపెనీల్లో మంచి ఉద్యోగాల్లో తమ పిల్లలు చేరి బాగా సంపాదించుకోవాలనే తహతహ తప్ప మమ్మీ డాడీలని పిలిపించుకోవడమిష్టమై కాదు.

తెలియని క్రొత్త విషయాన్ని చెప్పాలంటే తెలిసిన విషయంతో మొదలు పెడతారు ఎవరైనా. మాతృభాషలో విద్యాబోధన జరిగితేనే చదువుకొన్నదాన్ని అవగాహన చేసుకోవడం వ్యక్తీకరించడం చివరకు పరిశోధించడానికి గూడా ఉపకరిస్తుందని కమిటీలెన్నో పెద్దలెందరో చెప్పారు. అది నిజం కాదని నిరూపించే సాహసం – ప్రభుత్వం ప్రాథమిక స్థాయి నుండీ ఇంగ్లీషు మీడియంలో జరపడానికి కారకులయిన వాళ్ళుగూడా చేయలేరు. అందుకే జవాబు చెప్పే ప్రయత్నం చేయలేదింత వరకూ!

మన దేశాన్ని బ్రిటీష్‌వారే కాక విదేశీయులెవరు పాలించినా వారి భాషలు రాజభాషలైనా చట్టాలు ఉత్తర్వులూ రాజభాషలో ఉన్నా అనువాదకుల నేర్పరచి తర్జుమా చేసి ప్రజల భాషలో అందించితేనే ఖాతరు చేయబడతాయని అమలవుతాయని ఆ పద్ధతి అవలంబించారు. గ్రామ స్థాయిలోనే (నగరాలు గ్రామాలను మింగితే ఏర్పడినవే) వ్యవసాయం వగైరా రికార్డులనీ ప్రాంతీయ భాషల్లోనే నమోదయ్యాయి. గెజిట్ నోటిఫికేషన్ ఇంగ్లీషులో ఉండవచ్చుగాక! సర్వే ఆఫ్ ఇండియా రికార్డు ప్రాంతీయ భాషల్లో అనువదించబడినాయి. రెవెన్యూ ఉన్నతాధికార్ల జమాబందీలు జరిగినా ప్రాంతీయ భాషల్లో అనువాదకుల సాయంతో జరిగేవి. అది పాలనా సౌలభ్యం.

ప్రజాస్వామ్యం అంటేనే ప్రజలు యజమానులని, వారెన్నుకోగా. పాలకులైనవారు సేవకులని ప్రజల కొరకు ఏర్పడిన ప్రభుత్వమనీ అర్థం. ప్రభుత్వం కొరకు ప్రజలని కాదు. పాశ్చాత్య దేశాల వారి పాలన పరోక్ష పాలనే, అంతకు ముందున్న పాదుషాలు నవాబులూ విదేశీయుల వారసులైనా ఇక్కడ స్థిరపడ్డారు.

బ్రిటీష్‌వారు నాటి ఇండియన్ ఆకరెన్సీలో రాజభాషేగాకుండా ఎక్కువమంది మాట్లాడే తెలుగు భాషను కూడా కరెన్సీపై ముద్రించారు!. లోక్‌సభ రాజ్యాంగ సభలతో మొదలుపెట్టి చట్టసభలన్నిటా బిల్లు ప్రతిపాదన మొదలుకొని అన్ని కార్యక్రమాలు జాతీయ భాషల్లో అంటే మాతృభాషల్లో జరగడం గౌరవ ప్రదం. భారత శాసనాలన్నీ ఏ భాషలో ప్రతిపాదించి ఆమోదించినా ప్రాంతీయ భాషలన్నింటిలో అనువాదం చేయించి ఆయా ప్రాంతాల్లో వినియోగించడం భారత ప్రభుత్వం విధిగా భావించాలి. తెలుగు రాష్ట్రాలలో శాసన సభ, శాసన మండలి మొదలుకొని జిల్లా, గ్రామ స్థాయి వరకూ కార్యక్రమాలన్నీ అంటే పాలన మొత్తము తెలుగులో జరిగితేనే ఆనాడు ఆంధ్రరాష్ట్రం కొరకు రాష్ట్ర పునర్విభజన ద్వారా భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పరచుకొన్న లక్ష్యం నెరవేరినట్లు అవుతుంది.

ఆంధ్రప్రదేశ్ తెలంగాణా రాష్ట్రాల్లో న్యాయవాద వృత్తిలో ఉన్న వేలాది మంది అడ్వకేట్లలో నూరుశాతం ఇంగ్లీషులో 'లా' చదివిన వారైనా ఇంగ్లీషులో ఓ చిన్న విన్నపం (ప్లెయింట్)ను సివిల్ కోర్టులో దాఖలు చేయడానికి, ఆరోపణ (కంప్లెయింట్)ను క్రిమినల్ కోర్టులో దాఖలు చేయడానికి తప్పులు లేకుండా వ్రాయగలరా? లేదా లేఖరికో (జూనియర్) టైపిస్టుకో నోటితో తప్పులు లేకుండా చెప్పగలరా. గుండెపై చెయ్యి వేసుకొని చెప్పగలరా అంటే నూటికొకరు కూడా ఉండరు. జడ్జీలు వారి నుండి వచ్చిన వారే గనుక మినహాయింపు లేదు. తప్పులు విన్పిస్తే మరల కొత్త తప్పులు చేస్తున్నారు. టైపింగ్‌కు కంప్యూటర్ టైపింగ్‌కూ కోర్టు ఫీజుకన్నా ఎన్నిరెట్లెక్కువ కర్చవుతున్నదో లెక్క చెప్పలేం.!

తెలుగులో, ఎవరి మాతృభాషలో వారు వ్రాసినా చెప్పినా వాక్య నిర్మాణం కుదురుతుంది. ఇంగ్లీషులో ఉన్నప్పుడు వారి భావమిదై ఉండవచ్చని ఊహించినట్లూహించనక్కరలేదు! సంతకం చేసే వారికి చదివి వినిపిస్తే సరిపోతుంది. అర్థం చెప్పక్కరలేదు. విన్నపం చేసినవాడో అర్జీదారో ఆరోపణ చేసినవారో సాక్షియైనా గుండె మీద చెయ్యివేసుకొని జరిగింది జరిగినట్లు ప్రత్యేక శిక్షణ నీయాలని ఆదుర్దా పడనక్కరలేదు. తెలుగులో సాక్ష్యాన్ని ఇంగ్లీషు అనువాదంలో టైపు చేయించి అనువాదంలో చెప్పినదానికి విరుద్ధార్థం వస్తే ఆ జడ్జీయే తీర్పు చెప్పినా న్యాయం జరిగే అవకాశం లేదు. మరో జడ్జి చెప్పే తీర్పు ప్రసక్తి అక్కర లేదు. అన్యాయం న్యాయంగా పరిగణిస్తారు అప్పీలు కోర్టుల్లో!.

ఇంత విపులంగా వ్రాసింది చదివిన తర్వాత తెలుగులో చదువెందుకో పాలనెందుకో న్యాయస్థానాల్లో తెలుగెందుకో ఎవరైనా అడిగితే "రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుంది" అని అడగినట్టే!"

**తెలుగువారు తెలుగులో చదువుకోవడమే సహజము. తెలుగు దేశంలో పాలన తెలుగులో జరగడమే ధర్మము. తెలుగు దేశ న్యాయస్థానంలో తెలుగే వాడటం న్యాయం.**

## జాతి సంస్కృతికి ప్రాణం మాతృభాషే

వీవెన్
9963029061

## తెలుగు భాషకి ఆధునిక హోదా కోసం-2

# జీవం - భాష



**జీవ** పరిణామ సిద్ధాంతం ప్రకారం జీవరాశులు తమ మనుగడ కోసం భౌతిక, పర్యావరణ పరిస్థితులకు అణుగుణంగా తమనుతాము మలచుకుంటాయి లేదా అందుకు తగ్గ మార్పులు వాటికి సహజంగానే సిద్ధిస్తాయి. జీవరాశులు మనుగడలో "ప్రకృతి/సహజసిద్ధమైన ఎంపిక" అనేది ఒకటుందని డార్విన్ ప్రతిపాదించాడు కదా. ఇలా ఎంచుకోబడటానికి జీవజాతుల్లో వైవిధ్యం ఒక వ్యూహం. అలా మార(లే)ని జీవరాశులు అంతరించిపోతాయి.

ఇదే సూత్రం భాషల విషయంలో ఎలా వర్తిస్తూందో ఈ వ్యాసంలో చూద్దాం. తననుతాను నిత్యనూతనంగా (కాలానుగుణంగా, అవసరాలకు తగ్గట్టు) మలచుకునే భాష నిలుస్తుంది.

### జీవేచ్ఛ

ప్రతీ జీవిలో అంతర్లీనంగా అవ్యక్తంగా జీవించాలనే సహజిసిద్ధమైన కోరిక ఉంటుంది. బతుకు తీపి అనుకోవచ్చేమో. మనుగడకి పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉంటే ఈ కోరిక అంత బలంగా వ్యక్తమవుతూం టుంది. నేలని చీల్చుకువచ్చే మొక్క, మట్టినీ, తడినీ చేరుకోడానికి రాళ్ళ సందుల్లోంచీ చొచ్చుకుపోయే వేర్లూ, కొదమసింహాన్ని సైతం తరిమికొట్టే అడివి దున్నలు వంటివి ఈ జీవేచ్ఛకి మచ్చు ఉదాహరణలు.

భాషకి సంబంధించినంత వరకూ ఈ జీవేచ్ఛ మన తెలుగు వారిలో అంతగా ఉన్నట్టు కనబడదు. మన చుట్టూ జరిగేవన్నీ (పాలన, బోధన, వ్యాపార వ్యవహారాల వంటివి అన్నీ) ఆంగ్లం లోనికి మారిపోతున్నా పట్టనితనం, ఉదాసీనతలు భాష విషయంలో బతుకు తీపి లేమికి మంచి ఉదాహరణలు. నాలుగ్గోడల మధ్య బంధిస్తే పిల్లి అయినా తిరగబడుతుంది అంటారు కదా. ఫ్లైట్ ఆర్ ఫైట్ అన్న సహజ ప్రతిస్పందన సూత్రంలో తెలుగు వాడు పలాయనమే చిత్తగిస్తున్నాడనిపిస్తూంది.

జీవులన్నిటికీ ఈ జీవేచ్ఛ లేదా బతుకు తీపి సహజం, దానిలో మార్పు ఉండదు, భాష కూడా అంతే. తతిమా జీవులు భాష లోనూ (కూత, అరుపు), ప్రవర్తన లోనూ మార్పులు ఏమీ లేకుండానే తరాలు గడిచిపోతాయి. కానీ మనుషుల దగ్గరికి వచ్చేసరికి మన వేషభాషలు దశాబ్దానికి ఒకమారు స్థూలంగా మారిపోతున్నాయి. భాష విషయంలో "మన భాష మన బాధ్యత, మన భాష మన హక్కు" అని జనాలందరూ (సహజంగా, అనుకోకుండానే%లల% అంటే బతకాలి అనుకోకుండా ఎలా బతికేస్తున్నామో అలా) అనుకోగలిగితే ఈ జీవేచ్ఛ లేదా బతుకు తీపి లక్షణం మన భాషకి అబ్బినట్టే.

తెలుగులో బోధన, పాలన, వ్యాపార వ్యవహారాలు కావాలని ఉద్యమాలు జరుగుతున్నప్పుడు వాటికి వస్తూన్న స్పందన (తెలుగు జనసంఖ్యతో పోలిస్తే) అతి తక్కువ. చాలా మంది ఇదేదో మనకు సంబంధం లేని విషయంగా మిన్నకుండి పోవడం, ఆc ఇవి అయ్యే పనులేనా వంటి నిరాశా నిట్టూర్పులూ ఈ విషయంలో మన ఉదాసీనతనీ, బతుకుతీపి లేమినీ సూచిస్తున్నాయి. నా బ్రతుకు తెరువు నాకుంది, నా కడవలో చల్ల ఒలికిపోవడం లేదుకదా అన్న గుడ్డి స్వార్థం భాషాంతకం.

### మార్పుచెందడం

బతుకు తీపి జీవరాశిలోని ప్రతీ జీవి విషయంలో విడిగా ఊంటే, మార్పుచెందడం అనే లక్షణం సంఘటితంగా జాతి మొత్తంలో కూడబలుక్కున్నట్టు ఉంటుంది. ఇది జీవజాతి మనుగడకి దిశని నిర్ధేశించేట్టు ఉంటుంది. ఒక ప్రత్యేకమైన మార్పుని (ఉదాహరణకి తోకని వదిలించుకోవడం లేదా ఏర్పరచుకోవడం) జన్యురూపంలో ముందు తరాలకు అందించడం ఇది. కాలమాన పరిస్థితులకు తగ్గట్టు తమ సహజమైన, స్వభావసిద్ధమైన లక్షణాలను కూడా కొన్ని తరాలపాటు మార్చేసుకోవడం చాలా సహజంగానే జరిగిపోతుంటుంది. ఒక జాతి మొత్తం భవిష్యతరాలతో పాటు ప్రత్యేకమైన రోగనిరోధక శక్తిని సమకూర్చుకోవడం కూడా దీనిలో భాగమే. దీనివల్ల ఆయా జీవజాతుల మనుగడ సుదీర్ఘకాలం కొనసాగడం వీలవుతుంది.

భాష విషయంలోనూ భాషని (దాని భవిష్యత్తు పరిణామంతో సహా) ముందు తరాలకు అందించగలిగితేనే ఆ భాష సుదీర్ఘ కాలం మన గలుగుతుంది.

తెలుగు భాషకు సంబంధించినంత వరకూ ఈ మార్పు చెందడం, కోరుకున్న మార్పును భావి తరాలకు దిశా నిర్దేశంగా అందించే ప్రక్రియ చురుకుగా జరుగుతున్నట్టు కనబడదు. భాషా సంస్కరణలు గానీ, ఆధునికావసరాలకు సరిపడా తెలుగు మాటల కాయింపు కానీ, తెలుగుకి సాంకేతికాభివృద్ధికి మౌలిక అంశాలు గానీ అవసరమన్న అవగాహన కనబడదు. అవో దిశగా వెళ్తున్నట్టూ కనబడవు. ఈ రంగంలో పరిశోధనలు, చర్చోపచర్చలూ ముమ్మరం కావాలి.

పై రెండు అంశాలూ జీవుల మనుగడకు కీలక ఆధారాలుగా, మౌలిక సూత్రాలుగా ఉంటే మరో రెండు అంశాలు సమర్థమైన,

ప్రభావవంతమైన వ్యూహాలుగా పనిచేస్తాయి.

### వైవిధ్యం

జీవ వైవిధ్యం (రకరకాల జీవరాశుల పరస్పరాధారిత సామూహిక మనుగడ) ఒక రకమైతే, ఒక జీవరాశి లోనే అనేక వైవిధ్యాలు (అనేక రకాలైన చేపలు, అనేక మామిడి రకాలు) మరో రకం. ప్రతికూల పరిస్థితులకు, వాతావరణానికి తట్టుకునే వైవిధ్యాలే నిలబడతాయి. ప్రకృతి ఎంపికలో ఎంపికవడానికి జీవం సహజంగానే తగినన్ని వైవిధ్యరూపాల్ని సృష్టించుకుంటూందనుకుంట.

భాష విషయంలోనూ భాషా వైవిధ్యం (అనేక భాషలు), భాషలో వైవిధ్యం (మాండలికాలు, యాసలు గట్రా) అని రెండు రకాలు. ఇవి సహజం, అవసరం కూడా. ఆంగ్లం (మరియు ఇతర అధికారిక భాషల) రూపంలో భాషా వైవిధ్యానికి ముప్పు పొంచివుంది. ఇక తెలుగు భాషలో తగినంత వైవిధ్యం ఉండనే ఉంది. మాండలికాల్నీ, జానపదాల్నీ కాపాడుకోవాలి. అంతర్జాలం, లేదా ఇతర ప్రత్యేక రంగాల్లో తెలుగులోనే వాటి ప్రత్యేకిత కొత్త పరిభాషలతో వైవిధ్యం పరిఢవిల్లాలి. వైవిధ్యాలన్నీ నిలుస్తాయని కాదు కానీ, నిలవాల్సినవి నిలవగలిగినవి నిలుస్తాయి. ట్విట్టరు ఉదాహరణగా తీసుకుంటే: ట్విజ్జనులు (ట్వీపుల్), ట్విజ్జగం (ట్విట్టర్వర్స్), ట్విగ్గజం, కూతలు (ట్వీట్లు), తిరుగుకూతలు/ప్రతికూతలు (రీట్వీట్లు), బదులుకూతలు (రిప్లయిలు) వంటి కొత్త మాటలు పుడుతున్నాయి. ఇలా ప్రతీ రంగలోనూ ఉదాహరణలు ఉన్నాయి.

### వ్యాప్తి, బలగం

జీవం బతికి ఉండటానికి మరో ముఖ్యమైన వ్యూహం ఇది. ఎక్కువగా వ్యాపించి ఉన్న, విస్తృతి ఉన్న, ఎక్కువ జనాభా ఉన్న జీవజాతులు సుదీర్ఘకాలం మనగలిగే అవకాశం ఎక్కువ. ప్రకృతి వైపరీత్యాల వంటి హఠాత్పరిణామాలను తట్టుకొని నిలబడటానికి వ్యాప్తీ, బలగం ఉండటం మంచి వ్యూహం. (వ్యాప్తి కోసమే మనుషులు నివాసయోగ్యమైన ఇతర గ్రహాల కోసం వెతుకుతున్నారు కదా.)

భాష విషయం లోనూ వ్యాప్తి, బలగం అనే వ్యూహం బాగా పనిచేస్తుంది. ఇప్పుడు తెలుగువాళ్ళు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు. వారందరూ తమ తెలుగు అస్తిత్వాన్ని చాటిచెప్పుకోవడం లేదు కానీ, అలా చెప్పుకున్ననాడు వ్యాప్తి అనే వ్యూహం తెలుగు భాషకు ఫలితాలనిస్తుంది. ఇక మన బలగం అనేక భాషలవారి జనాభా కంటే ఎక్కువ.

### నాశకాలు

వేలాది సంవత్సరాల స్కేలులో చూసినప్పుడు జీవులు అంతరించిపోవడం కూడా ప్రకృతిలో చాలా సహజం. జీవులకు ఉన్న ప్రత్యేక స్వభావాలు లక్షణాలు జీవుల మనుగడకి తోడ్పటినట్టే, వాటి మనుగడని ప్రమాదం లోకి నెట్టే నాశకాలు కూడా ఉన్నాయి. జీవులు అంతరించిపోవడానికి ఇవీ ప్రధానమైన కారణాలు:

పరిస్థితులు, పర్యావరణంలో హఠాత్తు మార్పులు

ఆవాసయోగ్యమైన పరిసరాలు నాశనమవడం

పర్యావరణం మారినంత వేగంగా జీవరాశులు మార(లే)క పోవడం

ఈ జీవిని ఆహారంగా తినే ప్రాణి లేదా ఈ జీవి ఆహారానికి మరో బలవంతమైన ప్రాణి పెద్దస్థాయిలో పోటీగా రావడం

వీటినే భాషకి అన్వయిస్తే పరాయి పాలన, ప్రపంచీకరణ, కార్పొరేటుచదువులు/ఉద్యోగాలు, భాష వాడుక తగ్గిపోవడం వల్ల భాషని నవీకరించుకునే, మార్చుకునే శక్తి కోల్పోవడం అన్నవి నాశకాలుగా కనిపిస్తున్నాయి.

అంతరించే దారివైపు పయనిస్తున్న తెలుగు భాషలో జీవసత్వాల్ని నింపాలంటే (పైన చెప్పిన అంశాల ప్రకారం చూస్తే) సిద్ధాంతరీత్యా ఇవీ జరగాల్సినవి: తెలుగు వారిలో భాషకు సంబంధించిన తీపిని (తమ భాషలోనే వ్యవహరించాలన్న తపనను) పెంచడం, భాషకు పరిణామ క్రమాలను ఏర్పరచి, ఆ మార్పులు దీర్ఘకాలం పాటు కొనసాగేలా చూడడం, తెలుగు భాషలోని వైవిధ్యాన్ని కాపాడటం / ప్రోత్సహించడం, తెలుగువారి బలగాన్నీ వ్యాప్తినీ పెంచడం (ముఖ్యంగా తెలుగు వాడుకను పెంచడం), వివిధ నాశకాల నుండి భాషను కాపాడటానికి సరైన వ్యూహాలు రూపొందించుకోవడం ఆపై వాటిని సమర్థవంతంగా, ప్రభావవంతంగా అమలుచేయడం. ఇవన్నీ జోరుగా జరుగుతుంటేనే మన భాష కలకాలం నిలుస్తుంది.

## 'ఆపిల్' సంస్థ అజ్ఞానం : వాడుకరులకు హెచ్చరిక

ఆపిల్ సంస్థ అందిస్తున్న అన్ని ఉపకరణాలు -ఐఫోన్, ఐపాడ్, మాకింటోష్ ఉత్పత్తులలో ఒక కొత్త లోపం ఫిబ్రవరిలో వెలుగు చూసింది. తెలుగు "జ్ఞా" అనే అక్షరం ఉన్న పాఠ్యం కనిపించిన వెంటనే ఐఫోన్, ఐప్యాడ్, ఐపోడ్ మొ॥ పరికరాలు మూగబోయాయి. సర్వీస్ సెంటర్‌కు తీసుకెళ్ళి బాగు చేయించుకున్నాకనే సరిగ్గా పని చేయగలిగాయి. తెలుగు అక్షరమాలలో జ్ఞా అక్షరం జ్+ఞ్+ఆ లతో రూపొందుతుంది. ఐతే ఆ మూడు అక్షరాల మధ్యలో లంకె అక్షరం (జీరో విడ్త్ నాన్ జాయినర్ - ZWNJ) ను చేర్చడం వలన, ఆ సంయుక్తాక్షరాన్ని ఆపిల్ పరికరాలు, వాటిలోని సంబంధిత సాఫ్టవేర్ గుర్తించకపోవడం వలన ఈ సమస్య ఎదురయింది.

ఈ విషయం తెలుసుకున్న ఆపిల్ పరికరాల వాడుకర్లు మన తెలుగు అక్షరాన్ని రాత్రికి రాత్రి 'రోగ్' (దుర్మార్గ) అక్షరంగా పిలవడం మొదలు పెట్టారు. గమ్మత్తయిన విషయమేమిటంటే, జ్ఞా అక్షరాన్ని గుర్తించలేని ఆపిల్ సంస్థ -ఆ సంస్థ పరికరాలు వాడేవారు, తమ తప్పు సరిదిద్దకోకుండా మన భాష అక్షరాన్ని నిందించారు. ఫేస్‌బుక్ సామాజిక మాధ్యమం ఏకంగా జ్ఞ గుణింతంలో ఏ అక్షరం మన సందేశంలో ఉన్నా, ఆ సందేశాన్ని స్పాం(దుష్ట సందేశం)గా గుర్తించి, ఆ టపాను వేయనీయకుండా నిలిపివేసింది. అయితే ట్విట్టర్ అనే సామాజిక మాధ్యమం ఆపిల్ కు సరైన సమాధానం చెప్పింది. జ్ఞ అక్షరాన్ని గుర్తించే వరకు ఆపిల్ పరికరాల్లో ట్విట్టర్ పని చేయదని బహిరంగంగా ప్రకటించింది. ఆపిల్‌లోని ఈ లోపం వలన ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాష ఒక చర్చనీయాంశమయింది.

– రెహమానుద్దీన్ షేక్

# మలేసియాలోని తెలుగువారి నడుస్తున్న చరిత్ర...



హైదరాబాదులో డిసెంబరు నెలలో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినప్పుడు, 'అమ్మనుడి' సంపాదకులు డా॥ సామల రమేష్‌బాబు, 'తెలుగువాణి' ట్రస్టీ స.వెం.రమేశ్ మలేసియా నుండి వచ్చిన తెలుగువారిని కలిశారు. వారి నడుమ మాటామంతీ జరిగింది. మలేసియా తెలుగు సంఘం అధ్యక్షులు డా॥ అచ్చయ్య కుమార్‌రావు, గొర్లి ఆనందరావు, సరగం సూర్యనారాయణ, డా॥ బడబళ్ల వెంకటప్రతాప్, బుద్ధా శ్రీరాములు, పొలమరసెట్టి గణేశ్, విల్లూరి వెంకటరమణ, ఆడారి వెంకటరమణగార్లు ఈ మాటామంతిని పంచుకొన్నారు.

అదంతా మలేసియాలో తెలుగువారు ఉనికికోసం, గుర్తింపుకోసం, ముందడుగుకోసం, అభివృద్ధికోసం చేస్తున్న పోరాటం. అదొక నడుస్తున్న చరిత్ర. అందులోని ప్రస్తుతాంశాలను మాత్రమే అమ్మనుడి చదువరులకోసం, ఇక్కడి తెలుగుభాషోద్యమకారులకోసం – క్లుప్లంగా ఇస్తున్నాం – సంపాదకుడు

– **మొ**త్తం మలేసియా దేశ జనాభా 3 కోట్లు. అందులో తెలుగువారు 4 లక్షలు. మలేసియా తెలుగువారిలో 80% మంది కళింగాంధ్ర నుండి, 20% మంది నెల్లూరు, చిత్తూరు, మద్రాసుల నుండి వచ్చినవారు. మలేసియాలోని భారతీయ సంతతి ప్రజలలో తమిళుల తరువాత తెలుగువారే ఎక్కువ మంది ఉన్నారు.

– **మాకు తెలుగంటే మా ప్రాణంకన్నా ఎక్కువ**. తెలుగు కోసం కత్తులు పట్టి పోరాడిన వాళ్ళు ఉన్నారు మా దేశంలో. ఎప్పుడో సుమారు 200 సంవత్సరాల క్రితం ఆంధ్రదేశం నుండి వలస పోయిన మా పెద్దలకు, తెలుగు చదువు తెలియదు. అయినా మాటగా పాటగా పండుగగా పేరంటంగా తెలుగును నిలబెట్టి మాకు అందించారు వారు. రామ తారకం, దాటు భజన, సువ్విపాటలు, పెళ్లిపాటలు, ఆరతి పాటలు, పిల్లల పాటలు, చక్రందార్లు, పాగుర్తులు, కుడిపైట చీరకట్లు, ఉగాది, పెద్ద పండుగ (సంక్రాంతి), బూరెలు, గారెలు, పొంగడాలు, పాల ముంజెలు, చిన్న పాకులు, పిడి కుచ్చులు, తీపి గారెలు, ఆమవడలు, బొబ్బట్లు, చక్కిడాలు, తోప, అంబలి, ఆయి రొట్టెలు, చిరతలు, గొబ్బిళ్ళు, సేవగరుడి, అప్పల నరసయ్యలు, అప్పల నాయుళ్ళు, అప్పలమ్మలు, ఆంధ్ర రావులు, ఆంధ్రజ్యోతులు... ఇలా ఎన్నో ఎన్నెన్నో మా పెద్దలు మాకు అందించిన తెలుగు ఆనవాళ్ళను పదిలంగా కాపాడుకొంటున్నాము.

– ఇదంతా ఊరికే సులభంగా కొనసాగడం లేదు. తెలుగు కళాచారాన్ని నిలుపుకోవడం కోసం మేము పోరాడుతున్నాము. మా పోరాటం మలాయివారితో కాదు, చైనీయులతో కాదు, మాతోపాటు కడుపు కట్టుకొని మలేసియాకు వచ్చిన తోటి తమిళులతో పోరాడుతున్నాము మేము. మా తాతలకాలం నుండే తెలుగుపట్ల చాలా చిన్నచూపు తమిళులకు. 'ముత్తాలు' అనే పేరున్న తెలుగువాడిని 'ముట్టాళు' అని ఎగతాళి చేసేవారు తమిళులు. తమిళంలో అదొక తిట్టుమాట. వారితో కలిసిమెలిసి ఉండడం మాకు శాపం అయింది.

– మలేసియాలో ఒకప్పుడు, తమిళానికి లాగానే తెలుగుకూ చాలా బడులు ఉండేవి. మలేసియాకు స్వతంత్రం వచ్చిన తరువాత మలేసియా ఇండియన్స్ కౌన్సిల్ (ఎం.ఐ.సి.) అని ఏర్పాటు చేశారు. భారతీయులకు ఏ సమస్య వచ్చినా నేరుగా ప్రభుత్వం దగ్గర ఎప్పుకొనే వీలులేదు. ఎం.ఐ.సి. దగ్గరే చెప్పుకోవాలి. ఆ కౌన్సిల్ సభ్యులు అందరూ తమిళులే. కొత్త తెలుగుబడి కోసం, పాత తెలుగుబడి అభివృద్ధికోసం కౌన్సిల్ దగ్గర మొరపెట్టుకొనే వాళ్ళం. తెలుగును తమిళంగా మార్చి, ప్రభుత్వ నిధులను పొంది, ఆ నిధులతో తమిళ బడులను పెంచుకొన్నారు. అలా అలా 1990 ల నాటికి తెలుగు బడులన్నీ తమిళబడులు అయిపోయాయి. తమిళమే చదవమని, తమిళం చదివితేనే ఉపాధి దొరుకుతుందనీ ప్రచారం చేశారు. తెలుగుబడుల్లో ఖాళీ అయిన ఉపాధ్యాయ ఉద్యోగాలను నింపేవారు కాదు. పిల్లలనందరినీ తమిళులుగానే నమోదు చేసేవారు. అలా 25 సంవత్సరాల క్రితమే తెలుగుబడులు లేకుండా పోయాయి.

– ఒక్క బడి విషయమే కాదు. సాంస్కృతికంగా అణచివేశారు. ఇప్పటికీ మీడియాలో తెలుగుకు చోటు లేదు. రేడియోలో ఇది వరకు ఒక గంట తెలుగు కార్యక్రమం ఉండేది. ఇప్పుడు అదీ లేదు. గుడి కమిటీల్లో, తోటల కంపెనీల ఉద్యోగాలలో తెలుగువారిని దూరం పెట్టేశారు. చివరకు తెలుగు చలనచిత్ర ప్రదర్శన కోసం కూడా పెద్ద పోరాటాలు చేయవలసి వచ్చింది. తమిళ పత్రికలో తెలుగువారిని, తెలుగుతనాన్ని కించపరుస్తూ వార్తలూ వ్యాసాలు వచ్చేవి. ఉగాది పండుగనాడు గుడిలో కూడా తెలుగులో మాట్లాడనివ్వలేదు, తెలుగును రాయనివ్వలేదు.

వాడనిభాష వాడిపోతుంది

– మొన్ననే మా అధ్యక్షులు ఒక టీవీ ఛానల్‌లో మాట్లాడుతూ సంక్రాంతి పండుగను, తెలుగువాళ్ళు తమిళులు కలిసి చేసుకొంటారు, అందరికీ శుభాకాంక్షలు అన్నారు. ఆ మాటకు తమిళులు పెద్ద ఎత్తున గొడవ చేశారు. సంక్రాంతికీ తెలుగువారికీ సంబంధం లేదనీ, అది కేవలం తమిళుల పండగనీ బెదిరింపుకు దిగారు. అలాగుంటుంది వాళ్ళ తెగబాటు.

– తెలుగు బడులు లేకపోవడంతో తెలుగు అక్షరాలకు దూరం అయ్యాము. విధిలేని పరిస్థితుల్లో తమిళమే చదవాల్సి వచ్చింది. మలేసియా తెలుగువారిలో, ఇప్పుడు 50 ఏళ్ళకు పైనున్న వారికి తెలుగు రాయడం చదవడం వచ్చు. 25 – 50 నడుమనున్న తరానికి మాట్లాడడం మాత్రమే తెలుసు. అయినా ఈ తరానికి తెలుగుమీద ఆశ, పోతుందనే వేదన ఎక్కువగా ఉంది. నిలబెట్టుకోవాలనే తాపత్రయమూ ఉంది. అందుకే కొత్త తరానికి తెలుగు నేర్పడం కోసం నడుం కట్టుకొన్నాం.

– డా॥ అచ్చయ్యకుమార్‌గారు అధ్యక్షులు అయ్యాక, కొంత మార్పు వచ్చింది. అయితే ఆ మార్పు అంత తేలికగా రాలేదు. ముందుగా వారి నేతృత్వంలో తెలుగు అభిమానులం సమావేశమయ్యాం. మలేసియా తెలుగు సంఘానికి, దేశమంతా కలిసి 30 శాఖలు ఉన్నాయి. ఈ 30 శాఖలలో ప్రచారానికి దిగాము. పిల్లలకు తెలుగుబడులు లేవు కాబట్టి, శాఖల దగ్గర వారాంతపు తెలుగు తరగతులను మొదలు పెట్టాం. పిల్లలను తమిళబడులకు కాకుండా మలాయి బడులకు పంపించసాగాము. మాగోడు ఎం.ఐ.సి. ముందు 'చెవిటి వాని ముందు శంఖు ఊదినట్లు' అయ్యింది. కాబట్టి, నేరుగా ప్రభుత్వానికే తెలియచేయాలని అనుకొన్నాము.

– తెలుగువాళ్లు మొదటి నుండీ కష్టజీవులు. తొలితరం తెలుగువాళ్ళే తినీ తినక, చాలీచాలని బతుకులతో కూడా తమ పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పించారు. మలేసియా తెలుగువారిలో ఒక్క అడుక్కొనేవాడు కూడా లేడు. చక్కగా చదువుకొని రెండు, మూడు తరాలవాళ్ళే ఆర్థికంగా బాగా స్థిరపడ్డారు. దాంతో అన్నీ ఉండి కూడా మన భాష పోతున్నదే అనే ఆందోళన మాలో బయలుదేరింది.

– 2010లో మా దేశ ప్రధాని శ్రీ నజీబ్ తునర్‌జాగారిని కలిశాము. తెలుగువారి సభకు ఆహ్వానించాము. ఆయన ఒప్పుకొన్నారు. అక్కడి నుండి 50 మంది కార్యకర్తలు, 5 నెలలపాటు శ్రమించి, తెలుగువారి ఇంటింటికీ వెళ్ళి సభకు రమ్మని పిలిచారు. మా రాజధాని 'పుత్రజయ' లో అక్టోబరు 8వ తేదీన సభ జరపాలని నిర్ణయమైంది. రెండంతస్తుల సభాభవనం అది. పై అంతస్తులో సభను ఏర్పాటు చేశాము. ఐదువేలమంది వస్తారని ఆశించాము. అందరన్నా రాకపోతే సభ వెలవెలపోతుంది. ప్రధానిగారి ముందు తెలుగు సంఘానికి అవమానం జరుగుతుంది. ఈ సాకుతో ఎం.ఐ.సి. లోని తమిళ నాయకులు ఇంకా రెచ్చిపోవచ్చు.

మెల్లమెల్లగా జనం రాక మొదలైంది. ఎనిమిదివేల మంది కూర్చునే పై అంతస్తు నిండిపోయింది. ఇంకా వస్తూనే ఉన్నారు. నాలుగువేల మంది పట్టే కింద అంతస్తూ నిండిపోయింది. జనం నిలబడి పోయారు. పదమూడు వేలమందికి పైగా తెలుగువాళ్ళు, తెలుగుకోసం, తెలుగు సభకు తరలి వచ్చారు.

ప్రధానిగారు వచ్చారు. కింది అంతస్తులోని జనాన్ని చూశారు. కిక్కిరిసిపోయి ఉన్నారు. అదే అసలు సభ అనుకొని తమ ఉపన్యాసాన్ని మొదలుపెట్టి ముగించారు. తెలుగువాళ్ళంతా చిన్నసద్దుకూడా లేకుండా అంతా విన్నారు. మా అధ్యక్షులు అప్పుడు చెప్పారు. అసలు సభ పై అంతస్తులో అని. ప్రధానిగారు ఆశ్చర్యపోయి పైకి వచ్చారు. కిందకంటే రెట్టింపు జనం. తెలుగువాళ్ళు ఇంత క్రమశిక్షణతో ఉంటారా, తమిళులతో పోల్చినప్పుడు తెలుగువారిలో ప్రశాంతత ఎక్కువగా ఉంది' అన్నారు ప్రధానిగారు. అప్పుడు డా॥ అచ్చయ్యకుమార్‌గారు మాట్లాడారు. 'ప్రధానిగారూ, మీరు మా కోసం కెంటకీ ఫ్రైడ్ చికెన్ ఇచ్చారు. అయితే అది మా వరకూ రాలేదు. మధ్యలోనే మాయమైంది' అంటూ ఎం.ఐ.సి. చేసిన, చేస్తున్న అన్యాయాలను విప్పి చెప్పారు. అదే వేదికమీద ఎం.ఐ.సి. సభ్యుడైన తమిళ నాయకుడు కూడా ఉన్నారు. 'మాకు మా భాష కావాలి, మా పిల్లలకు మా తల్లిభాషను నేర్పాలి'అని ఎలుగెత్తారు అధ్యక్షులు. 'అందుకు మీకు ఏం కావాలి' అని అడిగారు ప్రధానిగారు. మా కోరికను విన్నారు. రెండు వారాల్లో 3 మిలియన్ల రింగిట్లు (4.5 కోట్లు) ఇచ్చేశారు. ఇప్పటికి దాదాపు 17 మిలియన్ల రింగిట్లు ప్రభుత్వ సాయం అందింది.

– మా పనులు వేగం అందుకొన్నాయి. 30 శాఖలలోనూ వారాంతపు తెలుగు తరగతులు బలం పుంజుకొన్నాయి. సంవత్సరానికి ఒకసారి సుమారు 300 మంది విద్యార్థులతో తెలుగు నీతి శిబిరాలు మొదలైనాయి. 25 సంవత్సరాల లోపలున్న తరంవారికి తెలుగు అక్షరాలు దగ్గరయ్యాయి. ఇప్పుడు మేము తెలుగు అకాడెమీ భవనాన్ని కట్టుకొని 2018 ఉగాదినాటికి, అందులో ప్రవేశించబోతున్నాము. ఆ భవనానికి ప్రభుత్వం వారిచ్చిన సాయం చాలనప్పుడు, తెలుగువాళ్ళంతా తలా ఒక చేయి వేశారు. ముఖ్యంగా మా పిల్లలు, ఇటుకరాళ్ళ మీద 'శ్రీరామజయం' అని రాసి, వాటిని అమ్మి 35,000 రింగిట్లు పోగుచేసి ఇచ్చారు. ఈ భవన నిర్మాణ సమయంలో ఎన్నో ఉద్వేగభరితమైన సంఘటనలు జరిగాయి. ఈ తెలుగు ఆలయం **ఒక్క మలేసియా తెలుగువారి కోసం మాత్రమే కాదు. మారిషస్, బర్మా, సింగపూరు, బంగ్లాదేశ్ వంటి పలు దేశాల తెలుగువారి సేవకోసం ఏర్పాటు కాబోతున్నది. ఎందుకంటే మాతోపాటు పై దేశాల తెలుగువారు అందరూ కూడా, ఒక్కచోటు నుండి బయలుదేరిన వాళ్ళమే కదా.**

**– తెలుగు అకాడెమీ లక్ష్యాలు ఏమిటంటే – మలేసియా తెలుగువారిలో, కనీసం ఇంటి కొకరు తెలుగు పత్రికలను చదవగలగాలి. ఉనికికోసం తెలుగు కళాచారాన్ని పదిలపరచుకొని కొనసాగించాలి. మాలాంటి ఇంకా కొన్ని దేశాలవారికి అండదండగా నిలవాలి. మలేసియా తెలుగువారు భాషా పరంగా కూడా తీసే చెయ్యిగా కాకుండా ఇచ్చే చెయ్యిగా ఎదగాలి. తరతరాలకూ తెలుగు గర్వంగా తలెత్తుకొని నిలబడాలి.**

– హైదరాబాదులో జరుగుతున్న ఈ ప్రపంచ తెలుగు మహాసభలకు, మేము వందమందిమి వచ్చాము. అందులో మా పిల్లలు కూడా ఉన్నారు. ఈ సభల్లో మా పిల్లలు, దాటు భజన, చిరతలు వంటి మా తెలుగు కళారూపాలను మీకు చూపబోతున్నారు. మొదట మాకు కళింగాంధ్రతోనే సంబంధాలు ఉండేవి. ఇప్పుడు అన్నిచోట్ల తెలుగువారితోనూ కలుస్తున్నాము. తెలంగాణ బతుకమ్మలని మేము కూడా నేర్చుకొంటున్నాము. మా దేశంలో ఉగాదిని పెద్ద ఎత్తున జరుపుతున్నాము. కోలాలంపూరులో సభ జరిపి చిరతలూ దాటు భజనలూ పిండివంటలతో అందరికీ తెలుగుదనాన్ని చూపుతున్నాము. మా ప్రభుత్వం కూడా తెలుగు ఉగాదిని గుర్తించింది. ఆ రోజు మలేసియాలో సైన్‌బోర్డుల మీద TAHUN BARU TELUGU UGADI అని కనిపిస్తుంది. అంటే మలాయి భాషలో 'తెలుగు ఉగాది శుభాకాంక్షలు' అని.

# మలేసియా తెలుగు పిల్లలు తమ ఊళ్లను మనకు పరిచయం చేస్తున్నారు - ఈ చిన్న కతల్లో....



మలేసియాలో 2010 నుంచీ తెలుగు నేర్పడం గురించి 'నీతి శిబిరాలు' (moral camps) అని ప్రభుత్వ సహకారంతో - సంవత్సరానికి 2 సార్లు 15 నుండి 20 రోజుల వరకూ జరుగుతాయి. మలేసియా సంఘం వీటిని నిర్వహిస్తున్నది. ఆ తెలుగు సంఘానికి దేశమంతటా 30 శాఖలున్నాయి. వీటిలో పాతతరం తెలుగువారు పిల్లలకు తెలుగు రాయడం, చదవడం నేర్పిస్తుంటారు. వారిలో కొంతమందిని ఎంపికచేసి ఈ నీతి శిబిరానికి పంపిస్తారు. ఈ ఏడు 300 మంది పిల్లలు ఒక నీతి శిబిరంలో పాల్గొన్నారు. వీరిని కొన్ని తరగతులుగా విభజించారు. అందులో 21 మంది పాల్గొన్న ఒక తరగతిని మన 'తెలుగువాణి' ట్రస్టీ సం.వె.రమేశ్‌కు అప్పగించారు. ఆ పిల్లలంతా 10 నుంచి 16 ఏండ్ల ఈడువారు. వారంతా ఎంతో కొంత బాగానే తెలుగును చదువగలిగిన,

---

- మలేసియా తెలుగువారి అందరిలో ఒక బాధ ఉంది. అది మా తల్లిచోటు మీద తెలుగు పరిస్థితి గురించి ఇక్కడ తెలుగును చదవడం, రాయడం, చివరకు మాట్లాడడం కూడా తక్కువతనం అనే పరిస్థితి వచ్చేసింది. తెలంగాణ, ఆంధ్ర రెండు ప్రభుత్వాలూ పట్టించుకొని తెలుగును నిలబెట్టాలి. అప్పుడే మేమూ నిలబెట్టుకోగలం. తల్లివేరు బలంగా ఉంటే, తీగ ఎంత దూరం సాగినా కళకళలాడుతూ కాపును ఇవ్వగలదు.

- ఇదీ మా మాటామంతీ సారాంశం. ఈ వ్యాసాన్ని చదివే వారిని కోరేది ఒక్కటే. ఈ అంశాలను ప్రచారంలో పెట్టండి. ప్రచారానికి ఉన్న అన్ని అరకొరలనూ - పత్రికలు, ప్రసార సాధనాలు (టీవీ చానెళ్ళు), సోషల్ మీడియా, అన్నిటి ద్వారా ప్రచారం చేయండి. తెలుగు కోసం, తెలుగు ఆత్మగౌరవం కోసం తెలుగుజాతి జనుల అభివృద్ధికోసం అక్కడి మన జాతీయుల ఆరాటాన్ని, పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని మన తెలుగు గడ్డపై - రెండు రాష్ట్రాల్లోనూ - తెలుగును అభివృద్ధి పరచుకోవడానికి, తెలుగు సాధికారత కోసం ఉద్యమాలు చెయ్యండి. అప్పుడు స్వదేశం బయటి మన సోదరులకు మనం నైతిక మద్దతును, తోడ్పాటును ఇవ్వగల శక్తి మనకు ఏర్పడుతుంది - సంపాదకుడు

---

తాజావార్త : 2016 ఫిబ్రవరి 12న భూమిపూజ జరుపుకొని, 2018 ఫిబ్రవరి 22, 23, 24 తేదీలలో మూడు రోజుల పూజాది కార్యక్రమాలు జరిపి, లాంఛనంగా గృహప్రవేశం చేశారు. 1000 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో మలేసియా తెలుగు సంఘ అధ్యక్షులు డా॥అచ్చయ్యకుమార్‌రావు దంపతులు, సహాయ అధ్యక్షులు శ్రీ శ్రీరాములు దంపతులు, ప్రధానోపాధ్యాయులు శ్రీ అప్పలనాయుడు దంపతులు పూజలో పాల్గొన్నారు. మూడవరోజున భారతదేశపు హై కమీషనర్ శ్రీ రాజీవ్ అహిర్, మలేసియా హిందూ సంఘం ప్రతినిధి డతోషాన్, స్వామిరామ్‌జీ తదితర ముఖ్యులు పాల్గొన్నారు. మలేసియా ప్రధానిచేత త్వరలో అకాడమీని లాంఛనంగా ప్రారంభోత్సవం జరుపనున్నారు. అప్పటినుండి మలేసియా తెలుగు కార్యక్రమాలు, తెలుగుభాషా సాంస్కృతిక శిబిరాలన్నీ ఈ అకాడమీలోనే నిర్వహిస్తారు.

రాయగలిగిన పిల్లలే. కొన్నాళ్ల తరగతుల తర్వాత, వారి ఊర్ల గురించి వర్ణిస్తూ చిన్న పరిచయకతగా రాయమని ప్రోత్సహించాడు స.వెం.రమేశ్. అందుకోసం తమిళనాడులో తెలుగు పిల్లలు వాళ్ల ఊళ్ల గురించి ఇదే విధంగా రాసిన సందర్భాన్ని వివరించాడు. ఆ ప్రోత్సాహంతో – ఆ 21 మందిలో 16 మంది వెంటవెంటనే కతల్ని వ్రాశారు. వాటిలోంచి మచ్చుకు కొన్నిటిని మాత్రం ఇక్కడ ప్రచురిస్తున్నాం. పిల్లలను చిన్నచిన్న రచయితలుగా తమ తల్లిభాషలో తీర్చిదిద్దడం ఎంత బాగా ఉందో గమనించండి – సంపాదకుడు.

## 1

మీరందరూ పొద్దున లేచి ఆకాశంలో సూర్యుడును చూస్తారు. చీకటి పడేవేళకు ఆకాశంలో నక్షత్రాలను చూస్తారు. కాని మేము వాటిమీద కూర్చుని ఆకాశంకు వెళ్తాం. మీ ఊరిలో పక్షులు ఎగురుతాయి, కాని ఇక్కడ స్వర్గంలో మేము ఎగురుతాం. అదే మా ఊరు. మా ఊరిలో చంద్రుడులో దేవుడు కనిపిస్తాడు. అంత గొప్పది మా ఊరు.

మా ఊరు అంటే నాకు ఎంతో ఇష్టం. మాది ఒక పల్లెటూరు. చాలా అందంగా, పచ్చని పొలాలతో, కోటికోటి పచ్చపచ్చ రంగుల మధ్య మా ఊరు ఉంది. పొద్దున వేళలో ఆ కొండలని చూసిన వాళ్లు 'ఎంతో అందంగా ఉన్నాయి' అని అంటారు.

మా ఊరికి వస్తే, మీరు అద్భుతమైన చోటులు చూడవచ్చు. జలపాతాలు, ఆట మైదానాలు, సంతలు, సంతమేడలు, ఈత కొలను, నది, సముద్రం... ఇలా ఎన్నో ఉన్నాయి. మా అవసరాలకు బస్టాండు, పోస్టాఫీసు, రైలు నిలయం, ఆసుపత్రి, బడులు, వెంకటేశ్వరుల ఆలయం, హనుమంతు ఆలయం, రాములవారి ఆలయం, ఇవన్నీ ఉన్నాయి.

అయ్యయ్యో ఇంత చెప్పి మా ఊరిపేరు ఇంకా చెప్పలేదు. మా ఊరిపేరు 'ర'తో ప్రారంభం అవుతుంది. కనిపెట్టండి చూస్తాం.

మా ఊరిపేరు **రవాంగ్.**

**మద్దాల బైదేహి**

అమ్మ: గంగాదేవి నాన్న: సురేశ

## 2

ఊరు అంటే ప్రజలు ఉండే ఒక చోటు మాత్రమే కాదు. ప్రజలు అందరూ ఆనందాన్నీ దుక్కాన్నీ కలిసి పంచుకొనేదే ఊరు. అలాగ ఉన్న ఊర్లలో మా ఊరు ఒకటి. 'ఊరు అంటే మట్టికాదు, ఊరు అంటే మనుషులు' అని అన్నారు గురజాడ అప్పారావు. అందుకే మా ఊరిలో మేము అందరం, మతమూ జాతీ చూడకుండా కలిసిమెలిసి ఉంటాం. మలేసియాదేశంలో ఆగ్నేయంలో ఉండే మా ఊరిపేరు **కులిం.**

మా ఊరిలో ఆరునెలలు ఎండ కాస్తుంది. ఆరునెలలు వర్షం కురుస్తుంది. అందువల్ల మా ఊరు అందంగా, పచ్చని పొలాలతో కళకళలాడుతూ ఉంటుంది. మా ఊరి పక్కన ఒక పెద్ద సరస్సు ఉంది. దీనివల్ల మా ఊరి పొలాలకు సాగునీరు పుష్కలంగా దొరుకుతుంది. మా ఊరిలో వంగతోటలను పెద్ద ఎత్తున సాగు చేస్తారు. మా ఊరిలో పండిన వంకాయలని దేశం మొత్తానికీ పంపిస్తారు.

మా ఊరిలో ప్రభుత్వ ఆసుపత్రి, బస్టాండు, తపాలా కార్యాలయం ఉన్నాయి. ప్రతి ఆదివారం మా ఊరిలో సంత జరుగుతుంది. అక్కడ అన్ని రకాల కాయకూరలు దొరుకుతాయి. ఏ ఊరిలోనూ చూడలేని ఒక అద్భుతం మా ఊరిలో ఉంది. అది ఒక అందమైన జలపాతం. ప్రతిరోజూ పిల్లలం అక్కడికి వెళ్ళి ఆటలు ఆడుకొంటాం.

ఉన్న ఊరు కన్నతల్లి లాంటిది. అందుకే మా ఊరు అంటే నాకు చాలా ఇష్టం.

**అల్లు దేవ్‌నరసింహరావు**

అమ్మ: భువనేశ్వరి నాన్న: శ్రీనివాసరావు

## 3

సాయంత్రం అయిన తర్వాత సిగ్గుపడి వెళ్ళిపోయిన సూర్యుడు, ధైర్యంతో మళ్ళీ రెండుకొండల మధ్యనుంచి ఉదయిస్తాడు. ఆ వేళలో సూర్యుడు చూడడానికి చాలా అందంగా ఉంటాడు.

**క్లువాంగ్** అంటే మలేసియాలో తెలియనివారే ఉండరు. ఎందుకు అంటే అంత అందమైనది కాబట్టి. అదే మా ఊరు అని ఎంతో గొప్పగా చెప్పుకొంటాను నేను. మా ఊరు జొహోర్ రాష్ట్రంలో మధ్యన ఉంది. సూర్యుడు వచ్చి, మా ఊరిలోని పక్షులను నిద్రలేపుతాడు. అవి లేచి చురుకుగా ఆకాశంలో ఎగురుతూ తమ పనులు చెయ్యడానికి బయలు దేరుతాయి. అప్పుడు పక్షులు అన్నీ చేరి, మా ఊరిలో ఉన్న ప్రతి మనిషి పేరును చెప్పుకొంటూ వెళ్తాయి. ఆ పిలుపును విని మేము అందరమూ నిద్రనుంచి లేచి, మా పను చెయ్యడానికి చురుకుగా వెళ్తాం.

మలాయివారు, చీనావారు, భారతీయులు అందరూ కలిసిమెలిసి జీవిస్తుంటారు మా ఊరిలో. పొద్దున పనులకు వెళ్ళిన అందరూ సాయంత్రం, చీమల్లాగా ఊరికి చేరుకొంటారు. మా ఊరి పక్కన ఉన్న సరస్సు దగ్గర ఒక ఆటలమైదానం ఉంది. పిల్లలము పెద్దలతో చేరి, సాయంత్రం వేళ అక్కడ జాగింగ్ చేస్తాం. మా వెనకనే సూర్యుడు కూడా జాగింగ్ చేస్తుంటాడు. క్షణాలు నిమిషాలుగా మారుతాయి. నిమిషాలు గంటలుగా మారుతాయి. మాతో జాగింగ్ చేయలేని సూర్యుడు సిగ్గుపడి అస్తమిస్తాడు. తర్వాతనే మేము ఇంటికి వెళ్తాం.

మేము ఇంటికి వెళ్ళేటప్పుడు, అప్పుడప్పుడూ చంద్రుడు వచ్చి మాకు హాయ్ చెప్తాడు. పౌర్ణమి వెన్నెలలో మా ఊరు చాలా బాగుంటుంది.

**గణేశ్‌రావు**

అమ్మ: కృష్ణమ్మ నాన్న: మునియాండి

## 4

పక్షులు కీచ్‌కీచ్ అని అరుస్తాయి. ఉడతలు పండులను దొంగిలించుకొని పారిపోతాయి. కోళ్ళు కొక్కరకో అని కూస్తూ మా ఊరిని నిద్రలేపుతాయి. సూర్యుడు కూడా అదే వేళకు వచ్చేస్తాడు. పెద్దలు, పిల్లలు నిద్రలేచి కాకృత్యాలు ముగిస్తారు. పచ్చనిపొలాలు కళకళలాడుతూ బడికి వెళ్తున్న పిల్లలకు టాటా చెబుతాయి.

స్వచ్ఛమైన గాలి, తియ్యని నీరు, మంచి వాతావరణం కలిగిన మా ఊరు చాలా అందంగా ఎంతో బాగుంటుంది. నూనెతాటి, కొబ్బరి, అరటి పంటలతో ఎప్పుడూ పచ్చగా ఉంటుంది. మా ఊళ్ళో ప్రజలు కలిసిమెలిసి ఉంటారు. కష్టసుఖాలను ఒకరితో ఒకరు పంచుకొంటారు. మా ఊళ్ళో ఒక ప్రాథమిక పాఠశాల, ఒక ఉన్నత పాఠశాల ఉన్నాయి. బాలబాలికలు అందరూ బడికి పోయి చక్కగా చదువుకొంటున్నారు.

మా ఊళ్ళో వెంకటేశ్వర స్వామి వారి ఆలయం, భూలోకమ్మ అమ్మవారి ఆలయం ఉన్నాయి. మా ఊరి దగ్గర పెద్దసముద్రం ఉంది. చాలామంది విదేశీయులు వస్తూ పోతూ ఉంటారు. ఇది మా ఊరి ప్రత్యేకత. అందుకే మా ఊరు అంటే నాకు చాలా ఇష్టం.

ఊరిపేరు చెప్పడం మరచిపోయానే! మా ఊరిపేరు **బాగన్‌డతో**.

**గొర్లి హరీశ**

అమ్మ: ఉదయభాను నాన్న: ప్రకాశ

## 5

అన్ని ఊర్లల్లో పొద్దున్న కోడిపుంజు కూస్తాది. అయితే మా ఊరిలో మాత్రం బాతు అరుస్తాది. బాతు అరుపును విని, ఆ సూర్యుడు నిద్రలేచి వచ్చి వెలుతురు ఇస్తాడు. మా ఊరిలాగా ఎక్కడా ఉండదు. మాది వ్యత్యాసమైన ఊరు. మా ఊరిపేరు **సుంగై పటాని**.

మా ఊరిలో 63 నాయన్మార్ల శిలలు ఉన్నాయి. అందుకే మా ఊరు చాలా గొప్పది అంటారు. మా ఊరిలో అందరూ తెలుగువాళ్లే. అందరమూ తేట తెలుగులో మాట్లాడుకుంటాం. అందరమూ కలసిమెలసి ఉంటాం, కలసిమెలసి తింటాం.

మీకు తెలుసా? మా ఊరిలో ఒక అద్భుతం ఉంది. అదే తెలుగు విద్యాలయం. మలేసియాలోని తెలుగువాళ్ళం అందరూ కలిసి కట్టుకున్నాం. ఆ తెలుగు విద్యాలయాన్ని వచ్చే ఉగాది పండుగ (2018) రోజు ఆరంభం చేస్తారు. ప్రతి సంవత్సరం మాకు తెలుగు నేర్పించే నీతి శిబిరం 'కువాల కుబార్ బారు' అనే ఊర్లో నడుస్తాది. అయితే వచ్చేసారి నుంచి మా ఊర్లో కట్టుకున్న తెలుగు విద్యాలయంలో నడుస్తాది.

మా ఊరిలో దుర్రి ఆనందరావుగారు అనే పెద్దాయన ఉన్నారు. ఆయన ప్రతి సాయంత్రం, మా ఊరిలోని పిల్లందరికీ తెలుగు సంప్రదాయ ఆటలు పాటలు చెప్పిస్తారు. దీనివల్ల మా తెలుగు పెరుగుతుంది. మేము ఆడే తెలుగు ఆటను, పాడే తెలుగు పాటను చూసి, సూర్యుడు నవ్వి వర్షాన్ని రప్పిస్తాడు. తర్వాత వెళ్ళి చందమామతో చెప్తాడు. చందమామ కూడా మమ్మల్ని చూడడానికి వస్తాడు. ఒక్కొక్కసారి లేకపోతే, మినుమిను నక్షత్రాలను పంపిస్తాడు. అప్పుడు మా ఊరు అందంగా ఉంటాది.

మా ఊరంటే నాకు చాలా ఇష్టం.

**రుద్రోళ్ల చంద్ర**

అమ్మ: తిలకవతి నాన్న: దొరరాజు

## 6

మా ఊరిలో ఒక ముసలి కోడిపుంజు ఉంది. అది ప్రతిరోజు మమ్మల్ని అందరినీ నిద్ర లేపుతుంది. మమ్మల్నే కాకుండా సూర్యుడిని కూడా లేపుతుంది. దాని కూతని వినిన తరువాత కొండ మధ్యనుంచి సూర్యుడు లేస్తాడు. చల్లని గాలిలో సూర్యుడు చాలా అందంగా కనిపిస్తాడు. పచ్చనిపొలాలతో, ఇంద్రధనసు లాంటి రంగురంగు పువ్వుతో, చల్లని ప్రకృతితో నిండి ఉండడమే మా ఊరి ప్రత్యేకత.

మా ఊరిలో ఒక సరస్సు ఉంది. అందులో పిల్లలు సంతోషంగా ఈత కొడతారు. సాయంత్రం పూట, మా ఊరిలోని ముసలివారంతా ఒక చెట్టుకింద చేరి మాట్లాడుకుంటారు. వాళ్ళ ఐకమత్యాన్ని చూడడం చాలా సంతోషంగా ఉంటుంది.

వారానికి ఒకసారి మేము అందరం కలిసి ఊరు చుట్టుపక్కల శుభ్రం చేస్తాం. పెద్దలూ పిన్నలూ కలిసి పనిచేస్తూ మాట్లాడు కుంటాం. పిల్లలము అందరం కలిసి ఎన్నో ఆటలు ఆడుకుంటాం. మా ఊరిలో ఆసుపత్రి, బస్టాండు, వేంకటేశ్వరస్వామి వారి ఆలయం ఉన్నాయి.

సాయంత్రం వచ్చిన చంద్రుడు, మా ఆటను చూసి ఆనంద పడతాడు. తర్వాత మమ్మల్ని చల్లగా నిద్రపుచ్చుతాడు. చూశారా, మా ఊరిపేరు చెప్పడం మరిచిపోయాను. మా ఊరిపేరు **బాగన్‌డతో**.

**పెంటకోట హాశ్విత**

అమ్మ:ఉషానందిని నాన్న: హరినాథరావు

## 7

మా ఊరిపేరు **బుకిట్ మెర్తజం.** మా ఊరిని పగలు చూసినా రాత్రి చూసినా చాలా బాగుంటుంది. చల్లని ఊరు మాది. మా ఊరిలో మలేవారు, చీనావారు, ఇండియావారు కలసిమెలసి ఉంటారు.

మా ఊరిలో ఒక చిన్న బడి ఉంది. అందులో ఇంచుమించు మూడువంద మంది విద్యార్థు చదువుకుంటున్నారు. ఆ బడిలో ఒక పెద్ద మైదానం ఉంది. ఆ మైదానంలో పిల్లలందరం చేరి, కాలిబంతి, బాడ్మింటన్, బేస్బాల్ ఆటలు ఆడుకుంటాము.

మా ఊరిలో ఒక అమ్మవారి గుడి ఉంది. ప్రతిరోజు ఆ గుడిలో పూజలు చేస్తారు. గుడికి ఎదురుగా ఒక మసీదు ఉంది. ప్రతి శుక్రవారం ముస్లింవారు మసీదుకు వెళ్ళి మొక్కుతారు. మసీదుకు పక్కన బుద్ధుడి గుడి ఉంది. చీనావారు ఆ గుడికి వెళ్ళి ప్రార్థన చేస్తారు. దాని దగ్గరలోనే ఒక చర్చి కూడా ఉంది.

మా ఊరిలో నూనెతాటి తోటలు ఎక్కువ. ఆ తోటల్లో చాలామంది పనిచేస్తుంటారు. పిల్లలం ఆ తోటల్లో ఆడుకుంటా ఉంటాం. మా ఊరిలో ఒక సంతమేడ ఉంది. అందులో అన్ని వస్తువులు దొరుకుతాయి.

మా ఊరు అంటే నాకు ప్రాణం.

**కల్లా డివేశ్వరరావు**

అమ్మ: తిరుపతమ్మ నాన్న: రామారావు

## 8

బాబోయ్... ఎంత అందం, ఎన్ని పొలాలు, ఎన్ని నదులు మాట్లాడాల అంటే, ఒక్కరోజు చాలదు. ఇదే మా ఊరు, అందమైన ఊరు.

పొద్దున్నే లేచి రెండుకొండల మధ్యన ఉన్న మెట్లు ఎక్కి, తన కిరణాలను చూపిస్తాడు సూర్యుడు. ఆ కిరణాల వెలుగు వచ్చి నీటిమీద పడి, అక్కడా ఇక్కడా ఇంద్రధనసులు పుడుతాయి.

ఊరి గురించి మాట్లాడితే అందరికీ పంటలు, పొలాలు, కొండలు తలపు వస్తాయి. కానీ మా ఊరు కొంచెం వేరుగా ఉంటాది. మా ఊరు కొంచెం చూపు పల్లెలాగా, మరి కొంచెం చూపు పట్టణంలాగా ఉంటాది.

మా ఊరికి, మలేసియాలోని అన్ని చోట్ల నుంచి పిల్లలూ పెద్దలూ ఎందరో వస్తూ పోతూ ఉంటారు. పిల్లలకి మా ఊరు అంటే చాలా ఆనందం. దీనికి కారణం, మా ఊరిలో రెండు సరదా ఆటల చోట్లు ఉన్నాయి. ఆ చోటుల్లో పిల్లలు కళకళలాడుతూ ఆడుతుంటే, చుట్టూ ఉండే చెట్లు చూస్తూ ఉంటాయి. భయపడకండి, పెద్దవారికి కూడా చూడవలసిన చోట్లు ఉన్నాయి మా ఊరిలో. మారియమ్మ అద్దాలగుడి చాలా ప్రముఖమైనది. ఆ గుడినిండా అద్దాలే, రంగురంగు అద్దాలు. మా ఊరిలో ఉన్న పెద్దపెద్ద సంతమేడల్లో వస్తువులు కొనడానికి, తిరిగి చూడడానికి యువకులు కూడా వస్తుంటారు.

మా ఊరు ఒక పట్టణమైనా, అందులో పల్లెచూపు కూడా ఉంది. అందమైన నదులు, పచ్చని పొలాలు ఉంటాయి. మా ఊరిలో మంచి దురియాన్ పండ్లు దొరుకుతాయి. ఇది మలేసియాకు దేశీయపండు. ఎంతో రుచిగా ఉంటాది. ఇందులో రెండు రకాలు ఉన్నాయి. చాలా రుచిగా ఉండే రకంపేరు ముసంకింగ్. మా ఊరిలో రబ్బరుతోటలు కూడా ఉన్నాయి. అచ్చచ్చో ఇంతసేపు మాట్లాడి, మా ఊరిపేరు చెప్పలేదు చూడండి. మా ఊరు **కోలాలుంపూర్.**

**సూరిసెట్టి కరిష్త**

అమ్మ: వరలక్ష్మి నాన్న: మలేసియా అప్పన్న

## 9

మా ఊరిపేరు **బాగన్డతో**. మలేసియా దేశంలో, బాగన్డతోలో పుట్టడం వలన ఎంతో ఆనందంగా ఉన్నాను. ఉన్న ఊరు కన్నతల్లి లాంటిది కదా.

మా ఊరు పచ్చని పొలాలతో కళకళలాడుతూ చాలా అందంగా ఉంటుంది. మా ఊరి దగ్గరలో వెంకటేశ్వరస్వామివారి ఆలయం ఉంది. పిల్లలం పెద్దలం అందరం ఆలయంలో తెలుగులో భజనలు చేస్తాం. పిల్లలకు అక్కడే దాటుభజన నేర్పుతారు.

మాఊరిలో సరదా ఆటలచోట్లు, సంతమేడలు అన్నీ ఉన్నాయి. ఆదివారంరోజు మేము ఈతకొలనుకు వెళ్ళుతాము. ఆసుపత్రి, బస్టాండు, తపాలా కార్యాలయం, మసీదు, చర్చి అన్నీ ఉన్నాయి మా ఊరిలో. పొద్దున్నే కోడి కొక్కొరోకో అని గట్టిగా కూసి, గుడినీ మసీదునీ చర్చినీ మమ్మల్నీ సూర్యుడినీ నిద్రలేపుతుంది. సూర్యుడు వచ్చి నూనెతాటి, కొబ్బరి, అరటితోటలను నిద్రలేపుతాడు.

మా ఊరిలో ఒక పెద్దమనిషి ఉన్నారు. వారు చాలా మంచివారు. మా ఇంటినీ మా ఊరినే కాకుండా, అమ్మభాష ఐన తెలుగును కూడా కాపాడుతుంటారు ఆయన. ఆయన పేరు అప్పలనాయుడు గారు. ఆయనలాగే మనమందరం తెలుగును కాపాడుకోవాలి.

**– వెలగ దరినిష**

అమ్మ: శాంతి నాన్న: ఈశ్వరుడు

బుర్రకథ

# మలేసియా తెలుగువారి కథ

ఎల్లపు కృష్ణమూర్తి





వినరా, ఆంధ్ర వీర కుమారా, మలేసియాంధ్ర గాథ

వినరా, నీ తెలుగు జాతియొక్క విజయమైన గాథ

దక్షిణ భారత దేశ మందున, ఉన్నది ఒక రాష్ట్రం

దాని పేరే, ఆంధ్రదేశమని అందురు అందరును. ॥ వినరా॥

వచనం : ఏమిటోయి రామన్నా ! మనవాడు మలేసియాంధ్ర గాథ పాడుతానని, యేదో దక్షిణ భారతదేశమట, ఆంధ్రదేశమట, యితని కేమయిన మతి పోలేదు గదా? లేక మన మర్యాద తీయదలచాడా?

లేదోయి సోమన్నా! సరిగా వినవోయి, మనపూర్వీకులైన ఆంధ్రులు మలేసియాకు యెలాగు వచ్చిరో వారి పూర్వగాథ, చెప్పబోతారోయి.

అద్గదీ సంగతి, అర్థమైంది.

పందొమ్మిదవ శతాబ్దపు తొలి రోజులవీ తందానతాన

ఆంగ్లేయులే అధికారులై ఉన్న రోజులవీ ,,

వీరులు, త్యాగులు, తాండవించే తెలుగు దేశమదీ – తందానతాన తందానాన

కవులు, గాయకులు, ఘనత చెందిన గౌరవ దేశమదీ తందానాన

పుణ్యపురుషులు, పుణ్యనదులు పుట్టిన దేశమదీ ,,

అమర శ్రీరాములు ఆహుతి అయిన, ఆంధ్రదేశమదీ ॥వినరా॥

వచనం : సోమన్న : ఇంకా ఎలాంటి దేశమోయి.

రామన్న : చెప్పుతారు, వినవోయి, తెలివిలేని తెలుగోడ!

(వెనుక పాడేవారు సై సై అని పాడాలి)

పాడిపంటలకు కొదువ లేదురా సైసై

పంట భూములకు కొదువ లేదురా ,,

అన్న వస్త్రములకు, ఆటంకమే లేదురా ,,

దరిద్రమునకు దారే లేదురా ,,

వచనం : సోమన్న : మరెందుకోయి, ఈ మలేసియాకొచ్చినారు.

రామన్న : కొన్ని వెనుకబడిన జిల్లాల వారే వచ్చినారు. విశాఖ జిల్లా, చిత్తూరు జిల్లాల వారు.

(భళీ భళీ అని వెనుకవారు పాడాలి)

మలేసియాను ఆంగ్లేయులు పట్టిన రోజులవీ భళీ భళీ

ఆంగ్లేయులే యధికారులై యున్న రోజులవీ తందానతాన

రబ్బరు, కొబ్బరి, తేయాకు తోటలే తెరచిన రోజులవీ ,,

తెరచిరి వారు, తెరచిరి వారు, తేయాకు తోటలన్నీ ॥వినరా॥

వచనం : సోమన్న : వారు తెరిస్తే మనకేమయ్యా?

రామన్న : తెల్లవారు ఆ తోటల పనులకు మనవారిని ఆంధ్రదేశమునుండి తీసుకొని వచ్చిరి.

సోమన్న : మన వారు ఎలాగు వచ్చిరి?

అయ్యో, అయ్యో యేమి చెప్పుదునయ్యో

మూటా, ముల్లే కట్టిరి, అయ్య అయ్యో, అయ్యయ్యయ్యో!

ముసలివారే ఏడ్చిరీ అయ్య ,,

గోడు గోడున దుఃఖించిరయ్య ,,

మెడ్రాసువోడెక్కిరి అయ్య ,,

మలేసియాకే వా రొచ్చిరయ్య ,,

సోమన్న : వారొచ్చి యేమి చేసిరోయి రామన్నా!

రామన్న : కొంత మంది, కొబ్బరి తోటలలోను, కొంత మంది, రబ్బరు తోటలలోను, పనిచేయుటకు, వెళ్ళిరి.

(సై సై అనే మెట్టు)

నరికిరి నరికిరి అడవులు సై సై

వేసిరి వేసిరి తోటలు ,,

సస్యశ్యామలమే చేసిరి ,,

సంపదలనే, చేర్చిచ్చిరి ,,

పాటుపడి, బాగు చేసిరి ,,

ఈ భాగ్యదేశమును చేసిరి ॥వినరా ఆంధ్ర వీరకుమారా॥

వచ్చినవారు ఎలాగున్నారంటే

అయ్యయ్యో అయ్యో

మాతృభాషనే వారు మర్చిరి అయ్యయ్యో

తనజాతినే వారు మర్చిరీ ,,

కళాచారమునే వారు మర్చిరి ,,

కన్నతల్లినే వారు మర్చిరి ,,

అన్నియును, మర్చినా రయ్యోయ్యో ,,

అమాయకులయినారయ్యోయ్యో (రెండుసార్లు) ॥వినరా॥

వచ్చిన వారి పరిస్థితి ఏమైనది – మన గురువుగారు చెబుతారు విను

విద్య లేదు వారి కన్నా అమ్మమ్మమ్మో

తెలివి లేదు వారి కన్నా ,,

బదులు లేవు వారి కన్నా ,,

నీడ లేదు వారి కన్నా ,,

తల్లీ లేదు వారి కన్నా ,,

నీచమైన బ్రతుకన్నా ॥వినరా॥

వచనం : సోమన్న : మరీ ఏమైనారోయి?

రామన్న : 1956లో కొంతమంది తెలివైనవారు, తమ జాతి పరిస్థితిని తలచి దుఃఖించిరి. తెలుగు తల్లిని పూజించగా, వారికి కలలో కన్పించి చెప్పిందట.

సోమన్నా! యేమని చెప్పిందంటే

లేవో లేవోయి ఆంధ్రుడా సై సై

లేచి నిలబడవోయీ ఆంధ్రుడా ,,

పట్టువిడకోయి ఆంధ్రుడా ,,

తట్టి మేల్కొల్పవోయి ఆంధ్రుడా ,,

మలేసియాలో నీ భాషనాంధ్రుడా ,,

మట్టిపా లవనీకోయి ఆంధ్రుడా ,,

సంఘమునే, చేర్చోయాంధ్రుడా ,,

సంగతీ చెప్పవోయాంధ్రుడా ,,

వచనం : సోమన్నా! యేమి చేసినారోయి, నాయకులు

రామన్నా : వెంటనే ఆంధ్ర సంఘమును స్థాపించినారు. రాత్రనక పగలనక ఎండకన వాననక పూరనక పేటనక ఆంధ్ర శంఖమును ఆంధ్రుల చెవిలో పూదినారయ్యా, యిక చూడవయ్యా.

వినరా ఆంధ్ర వీర కుమారా, మలేసియాంధ్రగాథ

ఆంధ్రులు అందరు అమరిరి భళీ భళీ

ఆంధ్ర సంఘమునే అమర్చిరి భళీ భళీ

ఆడ, మగ, అందరు చేరి ,,

ఆంధ్ర సంఘమునే ఆదరించిరి ,,

చందాలన్ని చక్కగా చేర్చిరి ,,

వచనం : తెలుగువారికి, ఒకే జాతి, ఒకేమాట, ఒకేబాట, ఒకే సంఘము అని ప్రతి ఆంధ్రుడు ప్రతిజ్ఞ చేసిరి.

తెలుగు వారినే – తెలివైన వారిగా చేయాలన్నారు తందానతాన

డాక్టర్లు గాను – లాయర్లుగాను చదవాలన్నారు ,,

ఇంజనీర్లుగా, యినస్పెక్టర్లుగా యిమడాలన్నారు ,,

మాష్టర్లుగా – మేనేజర్లుగా మారాలన్నారు ,,

భూస్వాములుగా – భాగస్థులుగా బాగవాలన్నారు ,,

వ్యాపారులుగా వ్యవహారులుగా కావాలన్నారు ,,

తర్ఫీదిచ్చి – తెలుగువారినే తీర్చిదిద్దినారు ॥వినరా॥

వచనం : సోమన్నా ! యిప్పుడెలాగున్నారోయి మలేసియాంధ్రులు? – రామన్నా! మనవారు, డాక్టర్లుగా, లాయర్లుగా, ఇంజనీర్లుగా, వ్యాపారులుగా, భూస్వాములుగా, విద్యావంతులుగా, ఆఫీసర్లుగా ఎక్కౌంటెంట్సుగా యింకా పెద్దపెద్ద చదువులు చదువుచున్నారోయి, ఇది అంతా,ఆంధ్ర సంఘ మహిమ, సేవ. ప్రపంచ మహాసభలే, మలేసియాలో జరిపించుతుంది.

పాట

మరువాకు – మరువాకు, ఆంధ్రుడా

సంఘమునే – మరువాకు ఆంధ్రుడా

ద్రోహంబు చేయాకు – ఆంధ్రుడా

జాతి భేదంబు – లేదురా ఆంధ్రుడా

సంఘంబు లేదంటే – ఆంధ్రుడా

సాటి, గౌరవము లేదు ఆంధ్రుడా

స్వార్థంబు – విడవోయి ఆంధ్రుడా

వచ్చి సంఘములో చేరు ఆంధ్రుడా

ఐక్య పదవోయి – ఆంధ్రుడా

మంగళం – మంగళం ఆంధ్రుడా

మంగళం – మంగళం ఆంధ్రుడా

'చేయెత్తి జై కొట్టు తెలుగోడ
గతమెంతో ఘనకీర్తి గలవోడ!'

అ

పెండ్లిపిలుపులు, శుభాకాంక్షలు (గ్రీటింగ్ కార్డులు), గుర్తింపు చీట్లు (విజిటింగ్ కార్డులు), తెలుగులో వేద్దాం. అక్కర ఉంటే ఇంగ్లీషులో కూడా వేద్దాం.

మాటల్ని వాడుతూ ఉంటేనే అలవాటు అవుతాయి. వాడకపోతే మన భాష, మన జాతీ వాడిపోతాయి. ఇది మనకు ఇష్టమవుతుందా?

తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా తీసివేస్తే తెలుగు వర్ధిల్లదు

ధారావాహిక

# మౌనంలోని మాటలు

**5**

**సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ**


తెలుగు అనువాదం :
**రంగనాథ రామచంద్రరావు**

కన్నడ మూలం:
**డా. ఆర్. వి. బి. కుమార్**




**పీతల పీడ :**

మేము అప్పట్లో శిబిరదిన్ని మీద గుడారం వేసుకుని ఉన్నాం, మాకు రోజూ తినడానికి ఏదో ఒక నీచు ఉండాల్సిందే. మా వాళ్ళంతా కలిసి ఒక రోజు కంప్లి చెరువులో చేపలు పట్టడానికి వెళ్ళారు. వాళ్ళతోపాటు నేనూ వెళ్ళాను. అప్పటికింకా చేపలు పట్టే చాకచక్యం మాకు అలవాటు కాలేదు. చెరువు గట్టుపైనున్న బొరియల్లో చేతులు పెట్టి చిన్నచిన్న చేపలను, మట్టగిడసలను పట్టుకునే ప్రయత్నాలు చేసేవాళ్ళం. నేను మా వాళ్ళతోపాటు నీళ్ళల్లో దిగి బొరియల్లో చేయి వేసి చేపలు పట్టేవాడిని. ఇలా ఒకటి రెండు చేపలను పట్టుకుని భుజానికి తగిలించుకున్న సంచిలో చేపలు వేసుకున్నాను. అలాగే ముందుకు పోయి బొరియలో చేయి పెట్టాను. బొరియలో చెయ్యి పెట్టడం ఆలస్యం. ప్రాణం పోయినట్టయ్యింది. భరించలేని నొప్పి. చేతిని బయటికి లాగుతున్నట్టే చేతిని ఇరువైపులా గట్టిగా పట్టుకుని బిగించినట్టవుతోంది. అప్పో, అమ్మో అని గిలగిలా తన్నుకుంటూ ఏడవసాగాను. నాతోపాటు చేపలు పట్టడానికి వచ్చిన వాళ్ళంతా నా పీతలాటకం చూసి నవ్వసాగారు. చివరికి నా ఏడుపు చూసి మాలో ఒకడు చేతిని గట్టిగా బయటికి లాగమన్నాడు. అయితే చేతిని బయటికి లాగడానికి సాధ్యం కాలేదు. చివరికి మాతోపాటు వచ్చిన మారెప్ప అనే వ్యక్తి దర్భపుల్ల తీసుకుని నాకు తెలియకుండా నా వీపు వెనుక వచ్చి నా చిరిగిన చెడ్డీలో దూర్చి గట్టిగా గుచ్చాడు. నాకు ఒక్కసారిగా భయం చేసి "అమ్మా" అంటూ చేతిని బయటికి లాక్కున్నాను. అందరూ నా అవస్థ చూసి నవ్వసాగారు. నాకు ఏడుపు వచ్చేసింది. చేతిని కత్తెరలా గట్టిగా కరిచి పట్టుకున్నది ఎండ్రకాయ అన్నది అర్థమైంది.

అప్పటి నుంచి ఈ రోజు వరకు ఎన్ని ఎండ్రకాయలు పట్టుకుని కాల్చుకుని తిన్నానో లెక్కనే లేదు !

**కోతికి కానుపు :**

అదే శిబిరదిన్ని పైన గుడారం వేసుకున్నప్పటి ఒక సంఘటన ఇప్పటికీ గుర్తుకు వస్తోంది !

శిబిరదిన్ని నుంచి ఒక్కొక్క రోజు ఒక్కొక్క ఊరికి భిక్షాటనకు వెళ్ళేవాళ్ళం. కంప్లి పెద్దది కావటం వల్ల రెండు మూడు రోజులు అదే ఊళ్ళో భిక్షం అడిగేవాళ్ళం. భిక్షానికి కంప్లికి నడుచుకుంటూనే పోయేవాళ్ళం. శిబిరదిన్ని నుంచి కంప్లికి వెళ్ళే దారి మధ్యన ఈరణ్ణబావి అనే పేరుగల ఒక బావి ఉండేది. బావి పక్కన వున్న పెద్దచెట్టు చుట్టూ అరుగు నిర్మించి చిన్న దేవుడిగుడి ఏర్పాటు చేశారు. చెట్టు కొమ్మలు దట్టంగా ఉండటం వల్ల అక్కడ ఎప్పుడూ నీడ ఉండేది, చల్లగానూ ఉండేది. బావి నీళ్ళు తాగడానికి తియ్యగా ఉండేవి. అందువల్ల కంప్లికి వెళ్ళే టప్పుడు కానీ, కంప్లి నుంచి వచ్చేటప్పుడు కానీ ఈరణ్ణబావి కట్టమీద కొద్దిసేపు కూర్చోవటం మాకు అలవాటైపోయింది.

ఇలా ఒక రోజు భిక్షాటనకు బయలుదేరి వెళుతూ మామూలుగా ఈరణ్ణబావి కట్టమీద కూర్చున్నాను. అప్పుడు ఒక నల్లమూతి ఆడకోతి ఒంటరిగా బావి పక్కన ఉన్న చెట్టుమీదికి ఎక్కుతూ, దిగుతూవుంది. అది ఎందుకు అలా చేస్తుందో అర్థం కాలేదు. కొద్దిసేపటి తరువాత నా పాటికి నేను బిచ్చానికి వెళ్ళిపోయాను. మరుసటి రోజు చూస్తే అదే కోతి కట్ట పక్కన బావి మెట్లమీద కూర్చుని నొప్పులు పడుతుంది. పరీక్షగా చూస్తే రెండు తోకలు కనిపించాయి. ఒకటి పెద్దది, మరొకటి చిన్నది. అప్పుడు నాకు చప్పున స్ఫురించింది. కోతి బిడ్డను ఈనటానికి నొప్పులు పడుతోందని అర్థమైంది. బిడ్డ తల వైపు నుంచి వస్తే తల్లి సులభంగా ఈనుతుంది. అయితే బిడ్డ కాళ్ళ వైపు నుంచి రావడానికి ప్రయత్నిస్తోంది. తోక బయటికి వచ్చింది. మిగిలిన ఏ భాగమూ బయటికి రాలేదు. దాన్ని పట్టుకుని ఏదో విధంగా బిడ్డను తల్లి కడుపు లోంచి బయట పడేద్దామనుకుంటే నేనొక్కడ్నే ఉన్నాను. ఆ పని చేయడం నా ఒక్కడి వల్ల కాదు. నేను దగ్గరికి పోయినట్టల్లా కోతి దూరంగా పోతోంది. మరో దారి లేక మా గుడారానికి వెళ్ళిపోయాను.

గుడారం ముందు కూర్చుని ఏం చేయాలా అని ఆలోచిస్తుండగా మా జాతి కుర్రవాళ్ళు గుర్తువచ్చారు. వాళ్ళు అక్కడ ఆడు కుంటూ ఉన్నారు. చిన్నపిల్లలు, అంటే మరీ పూర్తిగా చిన్నపిల్లలేం కాదు. సుమారుగా ఉన్నారు.

"లే పిల్లగాల్లు, ఆడొకటి కోతి చాన వనవాసం పడుతుంది. రాండ్రా పిల్లగాల్లు, దానికి

యేదైనా దారి సూపుదాం. రండప్పా" అన్నాను.

వాళ్ళూ అంతకు ముందే బిచ్చానికి పోతూ ఆ కోతిని చూసినట్టున్నారు.

నేను చెప్పగానే 'సరే పదా' అన్నారు. ముగ్గురు పిల్లలు సిద్ధమయ్యారు.

నాకు బిచ్చంలో వచ్చిన ఒక అయిదు రూపాయలతో ఆముదం కొన్నాను. కోతి దగ్గరికి వెళ్ళాం. అది అప్పటికే పూర్తిగా నీరసంగా ఉంది. వెళ్ళి కోతిని పట్టుకున్నా అది మౌనంగా పడుకునివుంది. చూస్తే స్పృహ లేదు. పిల్లకోతి తోక బయటికి వచ్చింది కదా! దానికి ఆముదం పూసి నెమ్మదిగా తోకను లోపలికి తోశాను.

నిజానికి నాకు ఎలాంటి కాన్పులు చేసిన అనుభవం లేదు. కాన్పులు చూసిన అనుభవమూ లేదు. అయితే మరో దారి లేదు. అటు తరువాత నెమ్మదిగా కోతి దేహంలో చేయి దూర్చుతూ, కదిలిస్తూ కోతి పిల్ల తలను దారికి తెచ్చాను. పిల్ల తల దారికి రాగానే నెమ్మదిగా కోతిపిల్ల తల పట్టుకుని బయటికి లాగుతూ లాగుతూ పిల్లను బయటికి తీశాను. అయితే అప్పటికే పిల్ల కడుపులోనే చచ్చిపోయింది. పిల్ల చనిపోయి ఒక రోజు అయినట్టుంది. చివరికి పిల్ల బయటికి వచ్చిందని నాకు సమాధానం కలిగింది. అయితే కోతికి ఇంకా స్పృహ రాలేదు. కొద్దిగా నీళ్ళు ముఖం మీదికి చిలకరించాం. ముఖానికి నీళ్ళు పడుతుండగా నెమ్మదిగా కదలసాగింది. పిల్లకోతి శవాన్ని తల్లికోతి కంటపడకుండా దూరంగా పూడ్చిపెట్టాం.

నెమ్మదిగా తల్లికోతి లేచి కూర్చుంది. కళ్ళు విప్పార్చి మౌనంగా మమ్మల్ని చూసింది. కొద్దిసేపటి తరువాత నెమ్మదిగా నడుస్తూ కొంతదూరం పోయి కూర్చుంది. ఇక కోతి ప్రమాదం నుంచి బయట పడిందని సంతోషం కలిగింది. అది లేచి కూర్చుంది కదా అని ఒక విధమైన సంతృప్తితో గుడారానికి వచ్చేశాం. సాయంత్రం బిచ్చాటనకు వెళుతూ చూశాను. కోతి అక్కడే కూర్చునివుంది. పోనీలే బాగుంది కదా అని అనుకుంటూ ఊళ్ళోకి వెళ్ళి బిచ్చం అడుక్కుని మా స్థలానికి తిరిగొచ్చాను.

మరుసటి రోజు ఉదయం బిచ్చానికి బయలుదేరినపుడు ఆ స్థలాన్ని వదిలి కొద్ది ముందుకు వెళ్ళి మరో స్థలంలో కూర్చునివుంది. ఇక కోతి కుదుటపడిందని అనుకుని బిచ్చం అడుక్కుని మా గుడారానికి మరలినపుడు ఈరణ్ణ బావికట్ట వైపు నా దృష్టిపోయింది. మూడు నాలుగు కుక్కలు మొరుగుతూ తల్లి కోతిని పీకు తున్నాయి. ఆ కోతికి వాటి నుంచి విడిపించు కోవటానికి దాని శక్తి చాలలేదు. అవి ఎలా ఎలా లాగుతున్నాయో, అది అలా అలా ఒళ్ళు అప్పగిస్తూ ఉంది. నేను కుక్కలను తరమటానికి ప్రయత్నించినా అవి వదల్లేదు. రాక్షసుల్లా కోతిని లాగాయి. నేను చూస్తూ చూస్తూండగానే కోతి తన ప్రాణాలను విడి చింది. నిజానికి అది పిల్లను ఈనేటప్పుడే చావాల్సింది. అయితే మేము తంటాలుపడి ఆ కోతిని బతికించినా మరుసటి రోజు ఇలా కుక్కల చేతిలో అది చావాల్సి వచ్చింది కదా అని చాలా బాధవేసింది.

ఈ రోజుకూ ఈరణ్ణబావి దారిన పోయి నప్పుడంతా ఆ కోతి గుర్తుకు వచ్చి మనస్సంతా దిగులు చెందుతుంది.

**సంఘంతో సంబంధం :**

శిబిరదిన్ని మీద మా గుడారాలు ఉన్నాయి. వాటి పక్కనే సుదుగాడు సిద్దులు తమ గుడారాలు వేసుకున్నారు. మా రెండు జాతులువారూ బిచ్చం అడుక్కుని జీవనం సాగించే వాళ్ళమే ! మావి ఓ ముప్పయి కుటుంబాలు ఉన్నాయి. సుదుగాడు సిద్దులవి కూడా అన్నే గుడారాలు ఉన్నాయి. మాపాటికి మేము ఉన్నాం. మేము బిచ్చం అడుక్కునే జీవనం గడిపేవాళ్ళం. బిచ్చాటనకు వెళ్ళని రోజుల్లో చేపలవేట మొదలైనవాటికి వెళ్ళేవాళ్ళం.

ఇలాంటి సమయంలోనే జీపు మాబు, మాధవరావ్‌తో మాకు పరిచయం కలిగింది. వాళ్ళు చేపలు పట్టడానికి కూలీలుగా మా వాళ్ళను నియమించుకున్నారు. ఒక కే.జి. చేపలు పట్టి ఇస్తే ఒక రూపాయి ఇచ్చేవాళ్ళు. నేనూ ఎప్పుడైనా ఒకసారి చేపల కూలీకి వెళ్ళేవాడిని.

ఇలాంటి సమయంలోనే మా దగ్గరకి కొంతమంది వచ్చారు.

"మీరు ఏ ఊరు వాళ్ళు? ఏ జాతి వాళ్ళు?" అని వాళ్ళు మమ్మల్ని ప్రశ్నించారు.

"మాకు ఫలాన ఊరు లేదు. ద్వావరని ఆడించి తిరుపెం ఎత్తుకుని బతికేటోళ్ళం మాము. మాకంటూ ఉండనీకి ఒక తావు లేదు" అని చెప్పాం.

"అలాగైతే మీకు మేము ఆసరా అవుతాం. మీకు ఒక నెలవు దొరికేటట్టు చేస్తాం. అందరికీ ఒక ప్లాటు దొరికేలా చేస్తాం" అన్నారు.

అప్పటిదాకా మాదన్నది మాకు ఏమీ ఉండలేదు.

మా కోసం స్థలం ఇప్పిస్తామని వాళ్ళు అన్నప్పుడు మాకు చాలా సంతోషం కలిగింది.

"ప్లాటుకు పదిహేను రూపాయల్లా ఇవ్వండి" అని వాళ్ళు అన్ని కుటుంబాల వారి నుంచి పదిహేను రూపాయల ప్రకారం వసూలు చేశారు.

బిచ్చమెత్తి జాగ్రత్తగా దాచి పెట్టిన డబ్బును వాళ్ళకు ఇచ్చాం !

తాము ఏ.సి.తో, తహసీల్దారుతో, డి.సి. తో మా సమస్యల గురించి మాట్లాడు తామని చెప్పారు.

తాము డి.ఎస్.ఎస్.కార్యకర్తలని పరిచయం చేసుకున్నారు.

అప్పట్లో మాకు తహసీల్దారు అంటే ఎవరు? డి.సి. అంటే ఎవరు? డి.ఎస్.ఎస్. అంటే ఏమిటి? అన్నది కూడా తెలియదు.

వాళ్ళంతా మమ్మల్ని ఉద్ధరించడానికి వచ్చిన దేవుళ్ళు అని మాత్రం భావించాం.

కొద్దిరోజుల తరువాత ద.సం.స. కార్యకర్తలు మా గుడారాల దగ్గరికి వచ్చి, తాము మాత్రమే మా తరపున పోరాడితే ప్రయోజనం లేదు. తమతోపాటు మా ప్రతినిధులు ఉండాలని తెలిపారు.

"సరే, మాలో సక్కగా మాట్లాడేటోడు ఒకడున్నాడు. అతనే నాగప్ప" అని మా వాళ్ళంతా నా వైపు చూపించారు.

నాకేమో భయం. ఏమీ తెలియని అమాయకుడిని నేను. అయినా మా కులస్థుల ఒత్తిడి ఆపడానికి సాధ్యం కాలేదు. మా కులస్థుల ప్రతినిధిగా నేను ఎన్నికయ్యాను. సుదుగాడు సిద్దుల్లో సిద్ధరామణ్ణను ఎన్నుకున్నారు. ఇకపై ఏ సమస్య ఉన్నప్పటికీ వాళ్ళతోపాటు మేము కూడా వెళ్ళి సహకరించాలని తెలియజేశారు. మేము అంగీకరించాం. అదే విధంగా వాళ్ళు పిలిచిన చోటికంతా వెళ్ళేవాళ్ళం.

అప్పుడే నాకు తాహసీల్దారు కార్యాల యంతో, ఏ.సి కార్యాలయంతో పరిచయమైంది.

పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి



ప్రజలతో, అధికారులతో ఎలా మాట్లాడాలో తెలిసింది. డి.ఎస్.ఎస్. వాళ్ళు మమ్మల్ని కలుపుకుని మునిసిపాలిటి ఎదుట ధర్నా చేయించారు.

ఆ సమయంలో రాజశేఖరరెడ్డి అనే వ్యక్తి నగరపాలక అధ్యక్షులుగా ఉన్నారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశాం. ఇలా ఉండగా మమ్మల్ని శిబిరదిన్ని నుంచి తొలగించాలనే ప్రయత్నం జరగసాగింది. ఎంత కష్టమైనప్పటికీ ఆ స్థలం నుంచి మేము ఖాళీ చేసి వెళ్ళిపోకూడదని సంఘం వాళ్ళు మాకు గట్టిగా చెప్పారు. వారి సహకారంతో మేము పూర్తిగా మొండివాళ్ళమయ్యాం. అది పురపాలక సంఘం వారి అహంకారాన్ని సవాలు చేసినట్టయ్యింది.

ఒకసారి మునిసిపాల్ ఛైర్మన్ స్వయంగా తాను ఎదురుగా నిలబడి వైర్‌హౌస్‌కు పునాది రాయి వేశాడు. అందుకోసం మా గుడారం లోపలికి వచ్చి కొలత గూటాలను నాటారు. నాకు కోపం వచ్చింది. గూటాన్ని లాగి బయటికి విసిరేశాను.

"ఏయ్, నీకు అంత పొగరా? మిమ్మల్ని ఇక్కడ లేకుండా చేస్తాను" అన్నాడు అధ్యక్షుడు.

నాకూ కోపం వచ్చింది. "మీరు మొగోళ్ళయితే మా గుడారాలు పెరికెయ్యండి. చూస్తాను" అన్నాను.

కొంతమంది మధ్యలో కలగజేసుకుని నచ్చజెప్పి పంపారు.

ఇది జరిగిన నాలుగు రోజులకు తాహసీల్దారు వచ్చాడు. 'మీకు సణ్ణపురం మట్టిదిబ్బ దగ్గర స్థలం ఇప్పిస్తాం. అక్కడికి వెళ్ళండి' అన్నారు. మేము అది కుదరదని అన్నాం. ఆయన మౌనంగా వెళ్ళిపోయారు. అది వద్దనుకుంటే షుగర్ ఫ్యాక్టరీ వెనుకభాగంలో శ్మశానం పక్కన స్థలాన్ని ఇస్తామని చెప్పిపంపారు. దానికీ మేము జవాబు ఇవ్వలేదు.

ఇటు చూస్తే సంఘం వాళ్ళు ధర్నా మొదలైనవాటికి డబ్బులు కావాలని మమ్మలను, సుడుగాడు సిద్ధులను డబ్బులు అడగసాగారు. మా దగ్గర బిచ్చం అడుక్కుని కూడబెట్టిన డబ్బులే కాకుండా, కుండల్లో దాచిన బియ్యం, పప్పులు అన్ని అమ్మి అయిదువేల రూపాయలు, సుడుగాడు సిద్ధులు అయిదువేల రూపాయలు మొత్తం పదివేల రూపాయలు జమాచేసి ఇచ్చాం. అంతకు మించి ఇవ్వడానికి మా దగ్గర ఏమీ లేదు.

నేను అప్పటికే బిచ్చాటనకు వెళ్ళడం తగ్గించాను !

మేము ముగ్గురు అన్నదమ్ములు చెరువుకుపోయి మూడు నాలుగు కేజిల చేపలు పట్టి తెచ్చి వాటిని అమ్మి వచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తున్నాం. మా ఇంట్లో నేను, నా ఇద్దరు తమ్ముళ్ళు, నాన్న, అమ్మ ఇంత మందిమి ఉండేవాళ్ళం. అమ్మ అప్పటికే ముసలిదై పోయింది. నేనే వంట చేసేవాడిని. దాంతోపాటు నాకు సంఘం పని ఒకటి !

ఒకవైపున మేము గుడారాలు వేసుకున్న స్థలం వదిలి మరో చోటికి వెళ్ళండంటూ అధికారుల హింస అధికమవ్వసాగింది. మరోవైపున సంఘంవాళ్ళు డబ్బులు ఇవ్వమని అడుగుతున్నారు. దీంతో మేము విసిగిపోయాం.

దీనికి పరిష్కారం ఏమిటా అని నేను ఆలోచించసాగాను !

**మత్స్యకారుల సంఘం :**

మేము మాధవరావు, జీపు మాబు దగ్గర చేపలు పట్టే కూలీ పనులకు వెళుతున్నామని ఇంతకు ముందే చెప్పాను కదా !

ఒకరోజు మాధవరావు వచ్చి మనమే సొంతంగా మత్స్యకారుల సంఘం స్థాపిద్దామని అన్నారు.

మేము సరే అన్నాం.

అయితే మా దగ్గర షేరు కట్టడానికి డబ్బులు లేవు. అదే విషయం మాధవరావ్‌గారికి చెప్పాం. ఆయన షేరు డబ్బు తామే కట్టుకుంటామని చెప్పారు. అదే విధంగా డబ్బు కట్టి మమ్మల్నంత సభ్యులుగా చేర్చుకున్నారు.

సంఘానికి "తుంగభద్ర సంచారుల మత్స్యకారుల సంఘం" అని పేరు పెట్టాం.

నన్ను ఉపాధ్యక్షుడిగా చేశారు. అప్పుడు నా పేరు డి. నాగుడు అని రాయించారు.

"ఇకపై బాధ్యతంతా నీదే, ఎవరూ చేపలు దొంగతనం చేయకుండా చూసుకునే బాధ్యత కూడా నీదే" అని మాధవరావుగారు అన్నారు.

రామసాగర్ చెరువు, గౌరమ్మ చెరువుల టెండర్ మా సంఘానికే దొరికాయి. భోజయ్య అనే వ్యక్తి నుంచి అప్పు తెచ్చాం. చెరువులలో చేప పిల్లలను వదిలాం. తరువాత చెరువులో చేపలు పట్టడం ప్రారంభించాం. ఇలా ఒకటి రెండు సంవత్సరాలు గడిచాయి. అప్పట్లో కేజీ చేపలు పట్టడానికి ఒకటిన్నర రూపాయి కూలీ ఇచ్చేవాళ్ళు. అయితే ఈ డబ్బుతో మా కడుపులు నిండేవి కావు. మేమంతా ఒక్కటై కేజీకి మూడురూపాయలైనా ఇవ్వండని అడిగాం. భోజయ్య, మాధవరావులు కూలీ పెంచడానికి ఒప్పుకోలేదు. మా వాళ్ళనందరిని కూడగట్టుకుని కూలీ పెంచేవరకు చేపలు పట్టబోమని గట్టిగా పట్టుబట్టాం. చివరికి కూలీ పెంచడానికి ఒప్పుకున్న తరువాతే చేపలు పట్టడానికి పోయాం. అదే సమయంలో ప్రతీ సంవత్సరానికి ఒక కేజికి ఒక రూపాయిలా కూలీ పెంచాలని ఒప్పందం కుదిరింది. ఆ ప్రకారంగానే ఇప్పటి వరకూ సాగుతూ వస్తోంది.

ఇప్పుడు ఒక కేజికి పద్దెనిమిది రూపాయలు ఇస్తున్నారు !

(తరువాయి వచ్చే సంచికలో...)

భాషోద్యమ కథానిక

# మనోళ్లే...!

భువనచంద్ర
09840170646

"వానా గోదే?" అన్నాడు సంపత్.

"నే" అన్నాడు సందేష్.

"క్యూం?" అన్నది క్యూట్‌గా మోనీ

"స్టాప్ బాదరింగ్ హిమ్ యార్!" భుజాలు ఎగరేసి అన్నది అశ్వరి.

నాకు ఒక్క ముక్క అర్థమైతే ఒట్టు. అర గంటనించీ ఆ కంపార్టుమెంటుతోనే, వాళ్ళతోనే వున్నాను గనక ఒకరినొకరు పిల్చుకుంటుంటే వాళ్ళ పేర్ల వరకూ తెలిసినై. ఆ పై గడ్డిపరకంతైనా నాకు బోధపడలేదు.

"హేయ్...దూడే...వైనా గోదే?" అయిదో వాడన్నాడు. వాడి పేరు చిల్లింగ్ షామ్‌ట.

"వేంద నన్బా..." తల అడ్డంగా వూపాడు సందేష్.

"ఇది కొంచెం అర్థమైంది. కొంతకాలం తమిళనాడులో వుండటం వల్ల. వేందన్బ అంటే వద్దు మిత్రమా" అని.

" ఒకె ఒకె యార్...డిడ్ యూ రీడ్ గిలెస్పీ గిల్ క్రిస్ట్స్' మాడర్న్ ఫిలాసఫీ" అన్నాడు సందేష్.

"ఓహ్...నో....బట్ ఐ రెడ్ అమిష్ తివారీస్ ట్రయోలజీ ఆఫ్ షివ" అన్నాడు సంపత్.

"ఓహ్...షిట్...బోత్ ఆర్ బిగ్ బుక్స్...ఐ కాంట్ స్టాండ్" చికాగ్గా ముఖం పెట్టి అన్నది మోనీ.

"యా...బక్వాష్" భుజాలు ఎగరేసింది అశ్వరి.

"చాయ్ చాయ్" అరుచుకుంటూ వచ్చాడు రైల్వేకేటరింగ్ వాడు. వాడి వెనకాలే "సమోస్సా వేడీ వేడీ" అంటూ ఫాలో అయ్యాడు సమోసాలవాడు.

"ఏక్ ఏక్ సమోసా...ఏక్ ఏక్ చాయ్" ఆర్డరు చేశాడు చిల్లింగ్ షామ్. తింటూ మళ్లీ సంభాషణ.

సగం ఇంగ్లీషూ మిగతా సగం హిందీ + ఉర్దూ + తమిళం + గాడ్‌నోస్ భాషలు.

అసలు వీళ్ళ పూర్వీకులెవరూ ? పర్సనాలిటీ రంగూ చూస్తే నార్త్ వాళ్ళు కారు.

"ఛేంజ్" గట్టిగా అడిగాడు షామ్.

"మళ్లీ వచ్చేప్పుడు ఇస్తా" పట్టిపట్టి తెలుగులో అన్నాడు సమోసా వాడు. వాడు తెలుగువాడు కాదనీ, బెంగాలీనో బిహారీనో అయి వుంటాడనీ వాడి యాసని పట్టి నాకు అనిపించింది.

"నహీ...అభీదో...." పట్టుపట్టాడు షామ్.

ఆ సమోసావాడు షామ్ వంక సీరియస్‌గా చూసి,"బాబూ...నా దగ్గరకి చిల్లర వచ్చినప్పుడు తీసుకుంటాను...నైతో కోయీ నహీ. ఖావో..." అని వెళ్ళిపోయాడు వంద నోటు తిరిగి షామ్‌కి ఇచ్చేసి.

అవును...మనిషి మనిషిని నమ్మడు. తన కన్నా పై స్థాయి వాడ్ని వెయ్యిసార్లు నమ్మి, మోస పోవడానికైనా సిద్ధపడతాడుగానీ, తనకంటే తక్కువ స్థాయివాడ్ని నమ్మడు. ముక్కు మొహం పరిచయంలేని బడాబడా కంపెనీలవి క్యూలో నిలబడి మరీ షేర్లు కొంటాం. 'బ్రాండెడ్' అంటే చాలు, పైసా కూడా బేరం చెయ్యకుండా ఎంతంటే అంత ధారపోస్తాం. రిక్షావాడు రూపాయి ఎక్కువడిగినా, నెత్తిమీద గంప మోస్తూ వచ్చే కూరలమ్మి కిలోకి పావలా లాభం వేసుకుని చెప్పినా, మనం ఇంతెత్తున ఎగిరిపడతాం. "కలికాలం" అంటూ అరుస్తాం.

ట్రైను కదుల్తోంది. కాలం కదిలినట్టు. స్టేషన్లు దాటాక వేగంగా, స్టేషన్ వచ్చే ముందు వేసవిలో నీరసించిన నదిలా, మెల్లగా.

నెల్లూరొచ్చింది. ఫటాఫట్ దిగిపోయారు 'యూత్'.



**"మరో ప్రపంచం మరోప్రపంచం...**
**మరో ప్రపంచం పిలిచింది...**
**పదండి ముందుకు...పదండి తోసుకు**
**పోదాం పైపైకి" అంటూ**
**అద్భుతంగా పాడటం**
**మొదలెట్టిందా పిల్ల.**
**ఆమె గళంలో గంగ ఉరకలు.**
**నారక్తం ఉప్పొంగుతూ**
**అంది....ఉత్సాహంతో...**
**ఆనందం తోడవ్వడంతో...**
**ఓహ్... లక్షభాషలు**
**వరదల్లా వచ్చినా**
**నా తెలుగు ముందు**
**తలవంచక తప్పదు.**

"భలే మిగిలాయిరా డబ్బులు" చిల్లింగ్ షామ్ తెలుగులో అన్నాడు. "యా! అది నీ చురుకు దనం". మెరిసే కళ్ళతో అన్నది అశ్వని...కంపార్ట్ మెంట్లోంచి దిగి చకచకా నడుస్తూ.

ఒక్కసారి నాకు షాక్. అందరూ తెలుగు వాళ్ళే. చదువుకున్నవాళ్ళే. అన్ని విషయాలూ అన్ని రకాల భాషల్లోనూ మాట్లాడి, ఇతరుల్ని మోసం చేసినప్పుడు మాత్రం మాతృభాషలో మాట్లాడారు. వీళ్ళా మన భావితరానికి ప్రతి నిధులు?

అవాక్కయ్యాను. ఎక్కడుంది తప్పు? పెంచడంలోనా? చదివించే చదువుల్లోనా? పిల్లలు కోరుకున్నది అర్జంటుగా అమర్చిపెట్టడం తప్ప వారి బాగోగుల్ని పట్టించుకోని తల్లిదండ్రుల్లోనా? సడన్‌గా నా స్నేహితురాలు 'ఉమ' మాటలు గుర్తుకొచ్చాయి" మన వయసు వేరు...వాళ్ల వయసు వేరు. మన చదువు వేరు...వాళ్ళ చదువు వేరు. మనతో వాళ్లని పోల్చకు" అని. "చదువు వేరుకావచ్చు. కానీ, సంస్కారం అనేది క్షణానికోసారో తరానికోసారో మారేది కాదుగా". అన్నాను. "అదీ మారుతుంది. మన తాతలకుండే సంస్కారం మనకి వుందా? అలాగే వాళ్ళు పాటించిన నియమాలు మనం పాటిస్తున్నామా ?" నవ్వి అన్నది ఉమ. ఆ మాటలే మరోసారి మననం చేసుకుని నిట్టూర్చాను.

"సార్...ఇందాక ఇక్కడ చాయ్ సమోసాలు తీసుకున్నవాళ్లు" కంగారుగా అన్నాడు కేటరింగ్ బాయ్.

"దిగిపోయారు" నిర్లిప్తంగా అన్నాను. దీర్ఘంగా నిట్టూర్చాడు వాడు. బహుశా ఇలాంటి అనుభవాలు చాలా అయి వుంటాయి. కాళ్లు నెప్పెట్టాయి. కాస్త నడుద్దామని కంపార్ట్‌మెంట్ నించి నడవడం మొదలెట్టాను.

ప్రతి రైలూ ఓ మినీ ఇండియా లాంటిదే... అందునా యీ ట్రైను వచ్చేది ఢిల్లీనుంచి. పోతున్నది చెన్నైకి. జనాల్ని చూసుకుంటూ నడుస్తున్నాను. ఓ బెంగాలీ గ్రూపు హాయిగా వాళ్ళ భాషలో మాట్లాడుకుంటున్నారు. కొన్నాళ్ళు కొల్‌కత్తాలో వుండటం వల్ల కొంచెం బెంగాలీ తెలుసు. వాళ్ల సంభాషణ రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్యానికీ, శరత్ చంద్ర ఛటోపాధ్యాయ సాహిత్యానికి మధ్య ఉన్న పోలికలు తేడాల గురించిన చర్చ. మధ్య వయస్కులే కాదు, యువ కులూ ఉత్సాహంగా పాల్గొని చర్చిస్తున్నారు. ఇంకొంచెం ముందు కెళ్ళాను. అరవ్వాళ్లు. పాటలు పాడుకుంటూ తమనితాము ఎంటర్‌టైన్ చేసుకుంటున్నారు. పాటకి ముందూ, తరవాతా వ్రాసిన రచయితల గురించీ సంగీత దర్శకుల గురించీ కూడా మాట్లాడుకుంటున్నారు.

ఎందుకో వెనక్కి వెళ్లిపోవాలనిపించి వెనక్కి తిరిగాను. మిగతా భాషల వారందరూ తమ భాషలో సంభాషిస్తూ తమ పాటల్ని పాడుకుంటూ తమ సాహిత్య చర్చని కొన సాగిస్తుంటే, మన తెలుగు యువతీ యువకులు మాత్రం తల్లిభాషని మరిచి పరాయి భాషల మీద పడటం నాకు ఘోరంగా అనిపించింది. కన్నమ్మకి కట్టుచీర కూడా కొనని కుమారుడు పిన్నమ్మకి పట్టుచీర కొనిచ్చినట్టు, మాతృభాషలో అ ఆ లు కూడా చదవకుండా ఆంగ్లభాషని ఔపోసన పడుతున్నారు. ఆఖరికి తెలుగుని కూడా ఇంగ్లీషులోనే టైపు చేసుకుంటూ 'తెంగ్లీష్' అనే కొత్తపేరు పెట్టుకున్నారు.

ఆలోచనలు ఆగకుండానే ట్రైను చెన్నై సెంట్రల్ చేరింది. తమిళులకి వారి భాష అంటే ఎంత అభిమానం!

'మద్రాస్' పేరుని 'చెన్నై' గా మార్చాక ఓనాడు అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్ళి మద్రాసుకి తిరిగి వస్తున్నారట. విమానం బయలుదేరే ముందర ఏర్‌హోస్టెస్, "ఈ విమానం ఢిల్లీ నుంచి మద్రాస్ పోబోతున్నది" ...అని ఎనౌన్స్ చేస్తుండగానే కరుణానిధిగారు లేచి ఆమెను ఆపి "ఢిల్లీనించి మద్రాస్ కాదు...ఢిల్లీ నుంచి చెన్నైకి"అని సరిదిద్ది మళ్ళీ ఎనౌన్స్ చేయించారట. అంతటి భాషాభిమానం మనవారికి వుందా? అలాగే మద్రాస్ సెంట్రల్‌ని చెన్నై సెంట్రల్‌గా మార్చడమే కాదు. మర్రోజు నించే టిక్కెట్లపై చెన్నై సెంట్రల్ అని ముద్రింపచేయడం వారికే చెల్లింది. రాత్రికిగానీ రామేశ్వరం వెళ్లే ట్రైను లేదు. అందుకోసం సెంట్రల్ దగ్గరే ఓ హోటల్‌లో ఉందామని అనుకున్నాగానీ, ఓ స్నేహితుడు మొహమాట పెట్టడం వల్ల వాళ్ళింటికి వెళ్లక తప్పలేదు. మేమిద్దరం కొన్నాళ్ళు కలిసి పని చేశాం. మా ఫ్రెండ్ పుట్టిందీ పెరిగిందీ మద్రాసులోనే. వారి పూర్వీకులు తెలుగువారే.

"రండి... కూచోండి" వాళ్ళ నాన్నగారు ఆప్యాయంగా అన్నారు. వాళ్ళ అమ్మగారు నాన్నగారూ అన్నదమ్ములూ అందరూ తెలుగే మాట్లాడారు. ఆ తెలుగులో యాస" కొంచెం చిత్రంగా వున్నా తెలుగుమాత్రం బాగా నచ్చింది. మనకి తెలియని, వినని కొత్త పదాలు కూడా విన్నాను. 'దువ్వగోరు (దువ్వెన) చూపుడు పెంకు (అద్దం) దినుసుల పెట్టె (పోపుల పెట్టె) దోంచు (తరుగుట) వేంచు (వేయించుట) ఇట్లాంటి మనం మరిచిన అందమైన తెలుగు పదాలు. మధ్యాహ్నానికల్లా తిరుపతి నించి నాయుడూ వాళ్ళ ఫేమిలీతో సహా వచ్చాడు; తిరుపతి లడ్డులు బ్రహ్మాండంగా వున్నాయి. ఆ రుచి మరే లడ్డుకీ రాదు. అలాగే రాయలసీమ తెలుగు యాస కూడా అద్భుతం అనిపించింది. దగ్గరదగ్గరే వున్నా మద్రాసు తెలుగుదో అందం, రాయలసీమ తెలుగుదో అందం. అలాగే తూర్పు, పశ్చిమ గోదావరి యాసలు, కృష్ణా, ప్రకాశం జిల్లాల యాస, గుంటూరు యాస గుంటూరిదే. ఇక విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం... దేని సౌందర్యం దానిదే. యాస భాషకి శ్వాస.

"ఇన్ని యాసలుగల అద్భుతమైన మన భాష మన తరంతోనే ఇంకిపోతోందిరా" నిస్సత్తువగా అన్నాను.

"అంతేకాదు...అసలు మనకున్నంత మంది కవులూ, రచయితలూ సాహితీవేత్తలూ భారతదేశంలోని ఏ భాషకీ లేరు. పద్యం, అవధానం, హరికథ, బుర్రకథ లాంటి సాహిత్య ప్రక్రియలూ ఎక్కడా మనకి కనిపించవు. ఇన్ని లక్షల పుస్తకాలూ కావ్యాలూ అన్నీ కాలంతో కనుమరుగై పోవాల్సిందేనా?" మరింత బాధతో అన్నాడు నాయుడు.

కాసేపు మౌనం రాజ్యమేలింది. "బాబూ ...ఈ తరం వరకూ మేము మా పిల్లగాళ్ళకి తెలుగుదా నేర్పిస్తుండాము. పైన ఏం జరుగుతాదో ఆండవరేకుదా ఎరుక" అన్నాడు నా ఫ్రెండ్ నాన్నగారు.

"అంతేగా...! తమిళనాడులో ఉద్యోగం కావాలంటే తమిళ మాధ్యమంలో చదవక తప్పదు. నా కళ్లముందే కొన్ని వందల చిన్నచిన్న స్కూళ్లు మూతబడ్డాయి. ఇప్పుడు పదుల సంఖ్యలో కూడా తెలుగు నేర్పే స్కూళ్ళు లేవు. పొట్టకూటి కోసం పరాయి భాషని నేర్చుకోక తప్పదుగా!" నిట్టూర్చి అన్నాడు నా ఫ్రెండు.

◇

నాలుగింటికి భీకరమైన వర్షం మొద

లైంది. పొద్దుట్నుంచీ చూడలేదుగానీ, టి.వి. ఆన్‌చేస్తే తుఫాన్ హెచ్చరికలు కళ్ళ బడ్డాయి. రామేశ్వరం వైపే కాదు...దక్షణానికి వెళ్ళే అనేకానేక రైలు, బస్సు సర్వీసుల్ని ముందు జాగ్రత్తగా ప్రభుత్వం రద్దు చేసింది.

రోడ్లు జలమయమయ్యాయి. ఇళ్ళలోకి నీరొస్తుంది. కుండ పోతగా వాన. ఆ వానలోనే బయటికి పరిగెత్తి వీలున్నన్ని కూరగాయలూ, సరుకులూ కొని తెచ్చాము. బిడ్డలు ఆకలితో అలమటించకూడదుగా, నాకు చాలా సిగ్గని పించింది, ఆ వానలో అతిథిగా వాళ్ళని ఎంత ఇబ్బంది కలిగిస్తున్నానా అని. తిరుపతి నించి వచ్చిన నాయుడు ఫేమిలీ కూడా కదలడానికి వీల్లేక అక్కడే వుండి పోవాల్సి వచ్చింది. నీళ్ళు గ్రౌండ్ ఫ్లోర్‌లోకి వస్తూ వుండటంతో సామాన్లన్నీ ఫస్టు ఫ్లోరుకి షిఫ్టు చేసేశాం. ఇనుపమంచాల మీద గ్రౌండ్ ఫ్లోర్‌లోనే మగాళ్ళమందరం కూర్చున్నాం. కరెంటు పోయిందో, తీసేవారో తెలీదుగానీ చిమ్మ చీకటి. అదృష్టవశాత్తూ మేము కొని తెచ్చిన వాటిల్లో కొన్ని కొవ్వొత్తులూ వున్నాయి...నూనె పేకెట్లూ వున్నాయి. కొన్ని కొవ్వొత్తుల్నీ నూనె దీపాల్ని వెలిగించాం.

భోరున వర్షం...రాత్రంతా పక్షుల అరుపులూ, నేలకి రాలుతున్న చెట్ల శబ్దాలూ. వర్షం మొదలైన రెండు గంటలకల్లా కప్పల అరుపులు మొదలయ్యాయి...ఎక్కడినించి పుట్టుకొచ్చాయో, ఇన్నాళ్ళూ ఎక్కడ దాక్కున్నాయో మరి. కానీ, ఆ చీకటి రాత్రికి అవీ సాక్షులే. నిముష నిముషానికీ నీటి మట్టం పెరిగింది... అందరం ఫస్టు ఫ్లోర్‌కి వెళ్ళక తప్పలేదు. కొంతమందిమి హాల్లోంచి పైకి వెళ్ళి మెట్లమీదే కూర్చొని కునుకుతీశాం...

⟐

భళ్ళున తెల్లారింది. కళ్ళు తెరవంగానే షాక్. గ్రౌండ్‌ఫ్లోర్ ఆల్‌మోస్ట్ నీటితో నిండిపోయివుంది. వర్షం భీకరంగా కురుస్తూనే వుంది. వర్షమొచ్చినా వరదొచ్చినా ఏదీ ఆగదుగా. ఆకలీ ఆగదు. నిద్రా ఆగదు...ఏదీ ఆగదు. అప్పుడప్పుడూ నీరసించినా మళ్ళీ బలం పుంజుకుని వర్షవాణి నిరంతరాయంగా వర్షిస్తూనే వుంది. తన నాట్య విన్యాసం చూపుతూనే వుంది. కరెంటు లేదు...షాపుల్లేవు...పాలులేవు... ఏమీలేవు. సెల్‌ఫోన్లు ఎప్పుడో చచ్చుపడ్డాయి.

36 గంటల తరవాత వర్షం నిమ్మళించింది. నీరు తగ్గడానికి మరో తొమ్మిది గంటలు పట్టింది. గవర్నమెంటూ స్వచ్ఛంద సంస్థలూ అవిశ్రాంతంగా పనిచేశాయి. అనేక సేవా 'సమితులు' పునరావాస సౌకర్యాల్ని కల్పించడానికి ముందుకొచ్చాయి. మూడో రోజున నాయుడు ఫేమిలీతో తిరుపతి వెళ్ళిపోయాడు. నేను మాత్రం వారం వరకు కదల్లేక పోయా. కారణం నా ఫ్రెండ్ వాళ్ళ నాన్నగార్ని మూడో రోజునే హాస్పటల్లో చేర్చాల్సి రావడం. 3 రోజుల తరవాత ఆయన ఆరోగ్యంగా ఇంటికొచ్చారు.

నేను బయల్దేరబోయాను. ఆయన బలవంతంగా, "ఇంకొక్క రెండ్రోజులు వుండు బాబూ...నిజానికి యీ భీభత్సంలో నువ్వు మాకు తోడుండటం ఏనాటికీ మర్చిపోలేను. కాదనకు" అంటూ ఆపేశారు.

"పోనీ రేపు వెళ్తాను" అన్నాను.

"ఉమా....అసలు కార్యక్రమం రేపే. ఎన్నాళ్ళ నించో నేనూ ఆ కార్యక్రమం గురించే ఎదురు చూస్తున్నా" అన్నారు. "ఏమిటీ?" అడిగా. "సస్పెన్స్" అన్నారాయన.

⟐

ఉదయం పదిగంటలకల్లా ఇద్దరం బయల్దేరి బస్సులో చెన్నై యూనివర్సిటీ చేరాం "ఇరవైనాలుగు గంటల కవితా పఠనం" అన్న 'బేనర్' చూసి థ్రిల్లయ్యాను.

ఎంతమంది కవులు! చెన్నైలో వారే కాదు, ఆంధ్ర, తెలంగాణా తమిళనాడు, కర్నాటక కేరళ నలుమూలల నించీ తెలుగు కవులు పాల్గొనడానికి వచ్చారు. ఎవరి యాస వారిదే, ఎవరి పలుకు వారిదే...తెలుగు తల్లికి నిలువెత్తునా నవరత్నాల తొడుగు తొడిగినట్లనిపించింది. తెలుగుభాష నాట్యరాణిలా నర్తించింది. కవితల వెలుగులో మాతృభాష మెరిసిపోయింది. నా గుండె ఆనందంతో కరిగిపోయింది.

బయటికొస్తూ నా స్నేహితుడి తండ్రి అన్నారు, "బాబూ...భయంకరంగా వాన వరదై ఇళ్ళకి ఇళ్ళు ముంచేసింది. బ్రతికి బట్టకడతామా అని భయపడ్డాం. ఇంటిని ముంచిన నీరు ఇంకిపోవడానికి భయపడ్డంత సమయం కూడా పట్టలా. ఇదీ అంతే. ఇంగ్లీషు భాష వరదలా వచ్చి కొన్ని తరాల్ని ముంచవచ్చు. కానీ, తనది కాని పునాది మీద ఏ భవనాన్నీ నిలబెట్టలేం. అలాగే తనదికాని తెలుగుమీద ఇంగ్లీషు ఏనాటికీ ఆధిపత్యం సాధించలేదు. వరద నీరు ఇంకినట్టు ఇంకిపోక తప్పదు. వెయ్యిరెట్లు బలం పుంజుకుని తెలుగుభాష వెలుగు చిమ్మకా తప్పదు. ఇది నిజం. మనుషులుపోయినా, భాష మిగిలే వుంటుంది. కారణం ఏమిటో తెలుసా...ఇవ్వాల్టి తెలుగు మూలాలు తెలుగునాడులోనే కాదు, ప్రపంచపు అన్ని దేశాల్లోనూ వున్నాయి గనక! "తృప్తిగా మీసం దువ్వుకుంటూ అన్నాడాయన. నా గుండె ఉప్పొంగి పోయింది. నిజం...నా తెలుగు చిరంజీవి...అది ఏనాడూ ఇగిరిపోని 'తావి'.

"వానా...గోదే?" పక్కింటి కుర్రాడు తనగాళ్ ఫ్రెండ్‌తో అంటున్నాడు.

"యా!" అన్నదా పిల్ల.

"బట్..." సందేహంగా అన్నాడు పక్కింటి కుర్రోడు.

"వీ కాంట్ రీడ్ ఎండ్ రైట్...బట్.... ఐ కెన్ సింగ్" అన్నదా పిల్ల.

"బాబూ...ఇఫ్ యూ డోంట్ మైండ్... వాటీజ్ ద మీనింగ్ ఆఫ్ వానా గోదే?" ఏమనుకుంటే అదే అనుకుంటార్లే అనుకుని అడిగేశా".

"అదా...వాంట్ టూ గోదేర్ " అని అర్థం అంకుల్" నవ్వి అన్నాడు చక్కని తెలుగులో...

"మరి?"

"ఏం లేదు. తనూ తెలుగమ్మాయే... తెలుగు చదవడం వ్రాయడం రాదుగానీ అద్భుతంగా పాడుతుంది. ఇవ్వాళ సాయంత్రం మా కాలేజీలో శ్రీశ్రీగారి మహాప్రస్థానం గురించి ఉపన్యాసాలూ, కావ్య పఠనమూ ఉంది. తనూ వస్తానంది గనక ఏం పాట పాడుతుందో అక్కడే వినాలి" నవ్వి అన్నాడా కుర్రాడు.

"ఏం పాడతావమ్మా" అడిగాను. నా మనసు నిండా ఆనందం. కుర్రాళ్ళు శ్రీశ్రీ కవితల్ని పాడటం అంటే గొప్పగా అనిపించింది.

"మరో ప్రపంచం మరో ప్రపంచం... మరో ప్రపంచం పిలిచింది...పదండి ముందుకు...పదండి తోసుకు పోదాం పోదాం పైపైకి" అంటూ అద్భుతంగా పాడటం మొదలెట్టిందా పిల్ల. ఆమె గళంలో గంగ ఉరకలు. నా రక్తం ఉప్పొంగుతోంది... ఉత్సాహంతో... ఆనందంతో గర్వంతో... ఓహ్...లక్షభాషలు వరదల్లా వచ్చినా నా తెలుగు ముందు తలవంచక తప్పదు...

జై తెలుగుతల్లీ.

సాహిత్య విమర్శ

డా॥ కా.వెంకటేశ్వర్లు
08912562280

# కన్యాశుల్కం - ఒక తులనాత్మక అధ్యయనం

మహాకవి గురజాడ రాసిన మహత్తరమైన నాటకం కన్యాశుల్కానికి జాతీయస్థాయిలో తగిన రాణింపు దక్కలేదు. ఇతర భారతీయ భాషీయులకు కన్యాశుల్కం రచనా ప్రక్రియలోని మెలకువలు, యదార్థ / వాస్తవిక దృష్టి, విమర్శనాత్మక దృక్పథం, చారిత్రక నేపథ్యం, పాత్రపోషణ, భాషా విశిష్టత, మరెన్నో విషయాలు అరకొర మాత్రంగానే తెలుసు.

ఈ సందర్భంలో కీర్తిశేషులు డా॥ ఉపాధ్యాయుల అప్పలనరసింహమూర్తిగారు రాసిన **కన్యాశుల్కం - 19వ శతాబ్ది ఆధునిక భారతీయ నాటకాలు (2007)** గ్రంధాన్ని విధిగా పేర్కొనాలి. ఇదొక మౌలిక పరిశోధనా గ్రంథం. పెద్ద (722పుటలు) గ్రంధరాజం.

ముందుగా శ్రీ నరసింహమూర్తి ప్రతిభ, పాండిత్యాన్ని గురించి రెండు మాటలు. సంస్కృతాంధ్రాలను సంప్రదాయరీతిలో అభ్యసించారు. బోధనకు పరిశోధనకు ఉపకరించేందుకుగాను Library Language గా ఆంగ్లభాషను చదువుకొన్నారు. మహారాజ కళాశాలలో (విజయనగరం) తెలుగు శాఖాధ్యక్షులుగా పదవీ విరమణ చేసారు. ప్రతిభామూర్తి. గొప్ప పండితుడు. నిరంతర అధ్యయన శీలి. బహుగ్రంధకర్త. సహృదయ విమర్శకుడు. ఎంతటి వారైనా, ఎట్టి వివాదగ్రస్తమైన సాహిత్య సమస్య అయినా, తన అభిప్రాయాన్ని తీర్పును నిర్మొహమాటంగా చెప్పేవారు. ఆధునిక భారతీయ సాంఘిక నాటకాలలో కన్యాశుల్కం అజరామర దృశ్య కావ్యమన్నారు. 20వ శతాబ్దం ప్రారంభకాలం నాటికే మనదేశంలో ఎన్నో 'మత, రాజకీయ, ఆర్థిక సమస్యలు తలయెత్తాయి. జాతీయ పునరుద్ధరణ వాదమొకటి బలపడింది. అస్సామీ, బెంగాలీ, ఒరియా, హిందీ నాటక కర్తలు ఈ సమస్యలన్నింటికి ప్రతిస్పందించి విషయ వైవిధ్యంగల నాటకాలను రాశారు...ఈ దృష్టితో చూసినపుడు గురజాడ అసంఖ్యాక ప్రజానీకానికి సంబంధించిన సమస్యను కాక ఒక పరిమిత



వర్గంలోని మౌఢ్యాన్ని తన నాటకానికి ఇతివృత్తంగా స్వీకరించడం ఒక లోపంగా కనిపిస్తుంది...అసంఖ్యాక భారతీయ ప్రజానీకం ఎదుర్కొనే వివిధ సమస్యల ప్రస్తావన ఈ నాటకంలో లేదు' అని గూడ రాసారు. ఇది మూర్తి సాహిత్య వ్యక్తిత్వరూపం, సారం.

ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో మూర్తిగారి తులనాత్మక (కన్యాశుల్కం) అధ్యయనమొక గీటురాయి. వారి మాటలలో గ్రంథం సారమిది : "ఆధునిక భారతీయ నాటకాలు తొలి అర్థశతాబ్దిలో ఏ విధమైన వికాసాలు సాధించాయో ఆ నాటకాల ఆవిర్భావానికి కారణమైన ఆర్థిక, సాంస్కృతిక, మత, రాజకీయ పరిణామాలు ఏ విధమైనవో అధ్యయనం చేస్తూ ఆ కాలపు సాంఘిక నాటకాలతో గురజాడ రచించిన కన్యాశుల్కాన్ని తులనాత్మకంగా పరిశీలించడం ఇంతవరకు జరిగింది. ఈ అధ్యయనంలో భాగంగా అస్సామీ, బెంగాలీ, హిందీ, గుజరాతీ, మరాఠీ, కన్నడ, ఒరియా భాషా సాహిత్యాలలోని సాంఘిక నాటకాలను మాత్రమే ప్రధాన అధ్యయనాంశాలుగా స్వీకరించడం జరిగింది. కన్యాశుల్కంలోని ఇతివృత్తం భారతీయ సమాజానికి కొత్తది కాదు. భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన సమస్యలే ఈ నాటకేతివృత్తంలో ఉన్నాయి. ఆధునిక పంజాబీ, తమిళ నాటక రంగాలను గూడ పరిశీలించారు. నాటక కళలోని అన్ని అంశాలను అపార పాండిత్యం, నిష్పక్షపాత బుద్ధి, ప్రామాణికమైన ఆధారాలతో తులనాత్మకంగా అధ్యయనం చేసి ఆధునిక భారత సాంఘిక నాటక సాహిత్యంలో కన్యాశుల్కానికి గల ప్రాముఖ్యతను ఆవిష్కరించారు. తద్వారా ఆధునిక భారతీయ సాంఘిక నాటకాల చరిత్రను, పుట్టుపూర్వోత్తరాలను, వస్తుగత ఏకోన్ముఖతను, రచనా ప్రక్రియలోని వైవిధ్యాన్ని విశదీకరించారు. మనదేశ సమైక్యతకిదొక నిదర్శనం. అత్యంత ప్రశంసనీయమైన రచన. వైవిధ్యభరితమైన ఆధునిక భారతీయ వాఙ్మయంతో పోల్చి, మూర్తి గురజాడ సాహిత్యాన్ని మూల్యాంకనం చేసారు. ఒక ఉదాహరణ. దలపత్‌రామ్ (1820 -98) అనే గుజరాతీ రచయిత గొప్ప నాటకకర్త, సాంఘిక సంస్కర్త, కవి. ఆధునిక గుజరాతీ సాహిత్యం ఆద్యులలో ప్రముఖుడు. ఆయన రాసిన మిథ్యాభిమాన్ నాటకంలో 'హున్నర్ ఖాన్ ఛడాయ్' అన్న ప్రతీకాత్మక పద్యం బహుళ వ్యాప్తి పొందింది. బ్రిటిష్ వలసవాదులు మనదేశ సంపదను కొల్లగొట్టుకు పోతున్నారని, సాంకేతిక పరిజ్ఞానంతో మన వస్తువులను మనదేశంలో మనమే తయారు చేసుకోవాలన్న స్వదేశీయ స్ఫూర్తి, వర్తక వ్యాపారాలతో మనదేశం సిరి సంపదలతో వర్ధిల్లాలని, దీనికిగాను ప్రజలు ఐకమత్యంతో మెలగాలని, సరియైన విద్య సాంఘిక సంస్కరణ కావాలని, ఈ పద్యం సారాంశం. 'హున్నర్‌ఖాన్ ఛడాయ్' (1851)కి గురజాడ 'దేశభక్తి' (1910) గేయానికి అరవై యేళ్ల అంతరం. భావాలను స్ఫూర్తిని చూస్తే "రెండు రచనలకూ వీసం వాసి తేడా లేదు. ఒకటే భేదం. అది ప్రతీకాత్మక రచన - ఇది సూటిగా రాసిన ప్రబోధ గేయం".

మూర్తి చేసిన కృషి పరిశోధన ప్రక్రియను సూచన ప్రాయంగా వివరిస్తాను. కలకత్తా, గౌహతి, దిబ్రూఘర్, ఢిల్లీ, బరోడా, పూనా, కొల్హాపూర్, బెంగుళూరు, ఉడిపి తదితర ప్రాంతాలకు వెళ్ళి ప్రముఖ గ్రంధాలయాల నుండి అమూల్యమైన సమాచారాన్ని శ్రద్ధగా సేకరించారు. పండితులతోను నాటక కర్తలు ప్రయోక్తలతోను సుదీర్ఘమైన చర్చలు జరిపి




ఆయా ప్రాంతాలలో వికసించిన నాటక సాహిత్యపు మెలకువలను సంప్రదాయాలను గ్రహించారు. పండిత మిత్రుల సహాయ సహకారంతో దేశభాషలలో లభిస్తున్న సుప్రసిద్ధ నాటకాలను అనువదింపజేసుకొని చదివారు. తద్వారా దేశభాషలలో వృద్ధి చెందిన నాటక కళా సంస్కృతి నాడిని పట్టుకొన్నారు. ఎంతో ప్రయాస, చిక్కులతో గూడిన పరిశోధనా కృషి. అప్రస్తుతమైనా స్ఫూర్తిదాయకమైన మరొక పరిశోధనా కృషి ఉదంతాన్ని వివరిస్తాను. డా॥యస్.ఎల్.భైరప్పగారు మహాభారతం ఇతిహాసం ఆధారంగా కన్నడ భాషలో 'పర్వ' అనే నవలను రాసారు (1979). ఈ రచనకు పూర్వ రంగంగా వారు చేసిన కృషి అనితర సాధ్యం. మహాభారత కథాక్రమంలో పేర్కొనబడిన చారిత్రక పట్టణాలను, ప్రాంతాలను సందర్శించి అక్కడ నివసిస్తున్న ప్రజలతో మాట్లాడి నేటికీ అంతర్లీనంగా సజీవంగా ఉన్న మహాభారత సంస్కృతిని ఆస్వాదించారు. ముందుగా హిమాలయ ప్రాంతంలో నేటికీ ద్రౌపదీయ వివాహ వ్యవస్థ (ఒకస్త్రీ కుటుంబంలోని అన్నదమ్ములను పెండ్లాడటం) కొనసాగుతున్న కొన్ని గ్రామాలను ఒకటికి రెండుమార్లు సందర్శించి అక్కడి మహిళలతో సంభాషించి వారి మనోగతాన్ని అనుభవాలను తెలుసుకొన్నారు. కురు సామ్రాజ్యపు రాజధాని హస్తినాపురాన్ని (మీరట్ సమీపంలో గల గ్రామం), పాట్నా నగరానికి 90 కిలోమీటర్ల దూరంలో పర్వత శ్రేణులలో గల రాజగిర్‌ని (జరాసంధుని రాజధాని), కురుక్షేత్రాన్ని, పాండవుల రాజధాని ఇంద్రప్రస్థాన్ని (పాత ఢిల్లీ నగర ప్రాంతం), జైపూర్ జిల్లాలోగల విరాట నగరాన్ని, ఆరావళి పర్వత శ్రేణుల ప్రాంతాన్ని, మధురా నగరాన్ని, ద్వారకను, సముద్రంలో మునిగిపోయిన శ్రీకృష్ణుని ద్వారకప్రాంతాన్ని, ఏకచక్రనగర్ ప్రాంతాన్ని, బర్నవ ప్రాంతాన్ని, మరికొన్ని ప్రాంతాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల ప్రజలతోను, ప్రముఖ పండితులతోను చర్చలు జరిపి, వారి ఆచార వ్యవహారాలను, సంస్కృతీ సంప్రదాయాలను, చారిత్రక విష యాలను గురించి సమాచారాన్ని సేకరించారు. తదేక దీక్షతో భైరప్ప, మూర్తి పరిశోధనాధ్యయనాన్ని పూర్తి చేసారు.

ఈ పరిశోధనా కృషి చేస్తున్న కాలంలో మూర్తిగారి కంటి చూపు మసకబారి పోయింది. చదవలేని దుస్థితి దాపురించింది. వారి ధర్మపత్ని శ్రీమతి వేంకటరమణమ్మగారు వారి 'అక్షరదీప్తి'. అక్షరాలా మూర్తిగారి సహధర్మచారిణి. మూర్తికోసం గ్రంథపఠనం చేసేవారు. మూర్తి చెప్పిన దానికి చిత్తు ప్రతి తుదిప్రతి రాయటం రమణమ్మ దినచర్య. ఆ విధంగా మూర్తి బుద్ధిబలం రమణమ్మ భుజబలం సమ్మేళనంతో మూర్తిగారి కన్యాశుల్కం అధ్యయనం రూపొంది వెలువడింది.

భారతీయ భాషీయులకు కన్యాశుల్కం ఔన్నత్యపు గుణగణాలను సాధికారికంగా తులనాత్మకంగా వివరించటానికి ఎంతగానో తోడ్పడే గ్రంథమిది. కనుక మూర్తిగారి గ్రంథాన్ని అనువదించి భారతీయ భాషీయులకు అందించాలి. ఇందుకోసం సంస్థాగతమైన ప్రయత్నం జరగాలి. కాని గత దశాబ్దంలో తెలుగు విశ్వవిద్యాలయం, ద్రవిడ విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమి, కేంద్ర సాహిత్య అకాడమి తదితర సాహిత్య సంస్థలు ఇట్టి కార్యక్రమాన్ని చేపట్టలేదు. ఇక ముందుగూడ చేపడతాయన్న ఆశలేదు. ఇది తెలుగుజాతి దురదృష్టం.

ఇట్టి పరిస్థితిలో డా॥ సూరపనేని విజయకుమార్‌గారు (విజయ నిర్మాణ సంస్థ అధినేత, సాహిత్య కళాపోషకులు, విశాఖపట్నం) ముందు కొచ్చి కార్యభారాన్ని వహించారు. డా॥ సాగి అప్పల సూర్యనారాయణ వర్మగారు (హిందీశాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, పూర్వాశ్రమంలో నరసింహమూర్తిగారి సహచరులు) ఒక సంవత్సర కాలం పాటు శ్రమపడి, నిస్వార్థంగా (ఉచితంగా) మూర్తిగారి గ్రంథానికి సంపూర్ణమైన హిందీ అనువాదాన్ని పూర్తి చేశారు (755 పుటలు). వర్మ గ్రంథముద్రణ బాధ్యతను నిర్వహించారు. గోకుల్‌చంద్ర రాహుల్‌చంద్ర స్మృతి ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో డా॥ విజయకుమార్‌గారు హిందీ అనువాద గ్రంథాన్ని (500 ప్రతులు) ముద్రించారు (విశాఖపట్నం : 2015). ఇంతేకాదు. మన రాష్ట్రంలోను ఇతర రాష్ట్రాలలోను హిందీ పండితులకు హిందీ భాషాభిమానులకు గ్రంథాలయాలకు ఉచితంగా గ్రంథాల ప్రతులను పంపించారు. గురజాడవారి ప్రజ్ఞను, ఆధునికతను, కన్యాశుల్కపు కీర్తి ప్రతిష్ఠలను, విశిష్టతను భారతీయ భాషీయులకు చాటి చెప్పే బృహత్తర ప్రయత్నానికి నాంది. శ్లాఘనీయమైన దాతృత్వం, సత్కార్యం. డా॥ విజయకుమార్‌గారు సత్పురుషులు. వారికి తెలుగుజాతి నమస్కృతులర్పించాలి.

సామల మురళి
9486135396

# తెన్నాటి తెలుగుపాటలు - 4

చెలికాడు చెలికత్తె విడిపోయినారు, ఎడబడినారు. ఒకరినొకరు తలచుకొని వగచుకొని పాటలు పాడుకొంటున్నారు. ఆ పాటలని 'విరహగీతాలు' అని పెరమాటతో పిలుస్తుంటాము. వాటినే 'వలవంత పాటలు' అంటారు ఉడుమలపేట తావులోని తెలుగువాళ్లు. ఈ మాటని నన్నె చోడుడు వాడినాడు. 'మరచిన తెలుగుమాటలు దొరకుచోటు' అని తెన్నాడు గురించి అశ్వత్థరెడ్డి అనే హోసూరు కవి రాసినాడు. ఏరితే ఏరుకొన్నన్ని తెలుగుమాటలు తెన్నాడులో. ఈ నెలలో కొన్ని వలవంత పాటలు మీ కోసం.

**పాడింది: పగిడికత్తి పట్టియమ్మ (70 ఏండ్లు) ఊరు:బండగలూరు కులం:మాదిగవారు**

పాట: 1

నానానాన నాననాన నాననాన నాననాన
నాననాన నాననాన నాననాన నాననాన
ఉద్దిరాయి బండలాన ఉద్దులెండ పోసితినే
ఉద్దులకు ఎద్దులొచ్చె ముద్దులాడ పొద్దులేదే ॥నాన॥
సాపరాయి బండలాన సామలెండ వేసితినే
సామలకు సీమలొచ్చె సరసమాడ వేళలేదే ॥నాన॥
ఏటినిండ నీళ్లెపోయె ఎల్లవత్తుర మేనమామ
రేకుపలక వేసికోని తేలిరావే వన్నెమయిలా ॥నాన॥

పాట: 2

నా నానెనానే నానెనానే నానెనానే నానెనానే
నా నానెనానే నానెనానే నానెనానే నానెనానే
నా రాయమాకు పుట్టుతుండ రాజుకొడుకు పుట్టదేమే
నా రాయమాకు పెక్కవయ్యె రాజుకొడుకు లెయ్యదేమే ॥నా నానె॥
నా పోకమాకు పుట్టుతుండ పొన్నికొడుకు సిన్నబిడ్డ
నా పోకమాకు పెక్కవయ్యె పొన్నికొడుకు లెయ్యదేమే ॥నా నానె॥
నా మర్రిమాకు పుట్టుతుండ మంగకొడుకు సంకబిడ్డ
నా మర్రిమాకు పెక్కవయ్యె మంగకొడుకు లెయ్యదేమే ॥నా నానె॥
నా జాలిమాకు పుట్టుతుండ జాలికొడుకు జోలిబిడ్డ
నా జాలిమాకు పెక్కవయ్యె జాలికొడుకు లెయ్యదేమే ॥నా నానె॥

పాట: 3

నా నానెనానే నానెనానే నానెనానే నానెనానే
నా నానెనానే నానెనానే నానెనానే నానెనానే
ఈడ యిత్తువేసింది ఇర్లపల్లి చెట్టు మొలిసింది చెన్నిమల
ఈడ కాయకాసింది కన్నివాడి పండుమాగింది పొల్లాదూరు ॥నా నానె॥
నేడు పండును కోయ గొడ్డళ్లెత్తి కంబానికి పయనాలయ్యె
నా కంబామెద్దు కానమన్న నేడు అయిరిమల కొండలోన ॥నా నానె॥
ఆ కానరాని కంబామెద్దు కలికి కన్నుకే తెలిసెనేమో
ఆ ఎద్దుమింద వచ్చేమా నేనొద్దంటినా ముద్దుమాల ॥నా నానె॥
ఆ గుర్రమ్మింద వచ్చేమాల సింజువాడి నగరిమాల
ఆ ఏనుగుమింద వచ్చేమాల మైవాడి దొరమాల ॥నా నానె॥

పాట: 4

అత్తపేరు అల్లిపూవు మామపేరు మల్లిపూవు
దానిపేరు దామరపూవు మరిదిపేరు మళ్లమారి
తొమ్మిదినాళ్లుండాయి మన సేతుల్లాన బంగారుగాజులుండాయి
తిరుముకారి సెంపకమాల ఎందుబోతివి ఏడకుబోతివి
దరుమకారి పట్నానికి దరుమకొంగులేయబోతిని
తొమ్మిదినాళ్లుండాయి మన సేతుల్లాన బంగారుగాజులుండాయి
ఆరెద్దుల మూడుమడకల అడివిసేను దున్నేబావా
కన్నిపరవాలెత్తి ఈడే కట్టిదున్నా నీ సేతవ్వా
తొమ్మిదినాళ్లుండాయి మన సేతుల్లాన బంగారుగాజులుండాయి.

⊙

ఉద్దిరాయి : ఎత్తయిన రాయి
ఉద్దులు : మినుములు
మయిలు : నెమలి
రాయమాకు : రావిచెట్టు
పెక్కవ : పెద్ద
జాలిమాకు : నల్లతుమ్మచెట్టు
అల్లిపూవు : కలువపువ్వు
మళ్లమారి : మరులమారి: ప్రేమికుడు
తిరుముకారి: తిరుగుబోతు

ఇర్లపల్లి, చెన్నిమల, కన్నివాడి, పొల్లాదూరు (పొళ్లాచ్చి), అయిరిమల, సింజువాడి, మైవాడి, ఇవన్నీ తెక్కణ కొంగునాడులో తెలుగుపాళెగార్ల ఏలుబడిలో ఉండిన ఊర్లపేర్లు. 'కంబం' మట్టుకు పాండెనాడు లోనిది.

ఇలాంటి పాటలు తమిళనాడులోని తెలుగు ప్రజల నోట ఇంకా నానుతూనే ఉన్నాయి. ఈ పత్రికలో వాటి ప్రచురణను ఇంతటితో ఆపుతున్నాము. ఎవరైనా ముందుకువచ్చి వాటిని పుస్తకంగా ప్రచురిస్తామంటే 'అమ్మనుడి' కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. అ

జిల్లాస్థాయి వరకు కోర్టుల్లో తీర్పులు తెలుగులో తేవాలి (జి.ఒ.నెం. 485/29.3 1974)

డా॥ నలిమెల భాస్కర్
970437408

# తెలంగాణ తెలుగు, సంస్కృతాల అవినాభావ సంబంధం

సంస్కృత భాషపై తెలుగుభాష చూపిన ప్రభావ ఫలితంగానో లేక తెలుగు భాషీయుల సంస్కృత వ్యామోహ పర్యవసానంగానో, కారణాలు ఏవైతేనేమి తెలుగులో వేనవేల పదాలు చేరిపోయినై. "బడి" అనే తెలుగు పదం వుండగా "పాఠశాల" చొచ్చుకొని వచ్చింది. చిన్నబడి, పెద్ద బడులు అనడానికి తెలుగు వాడికి నామోషీనో ఏమిటోగాని "ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలు" వచ్చాయి. పంతులుకు మారుగా ఉపాధ్యాయుడు, ఉపన్యాసకుడు, అధ్యాపకుడు విచ్చేసారు. పాఠశాల తర్వాతి పెద్ద చదువులకు కళాశాలకు వెళ్ళాలి కదా! కళాశాలకు తెలుగు పదం లేదు కనుక సంస్కృత భాష నుండి స్వీకరించడంలో తప్పు లేదు. మళ్ళీ కళాశాలల్లో వైద్యకళాశాల, న్యాయ కళాశాల, సాంకేతిక కళాశాల... యిత్యాదులన్నీ సంస్కృత శబ్దాలే! విద్య, విద్యార్థి, విద్యాలయం, ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు, ఉపస్థితి, సమయసారిణి (కాలనిర్ణయ పట్టిక), పరీక్షలు, ఉత్తీర్ణత, ఫలితాలు...అన్నీ సంస్కృతాలే! ఒక్క విద్యారంగ సంబంధితాలే వుదాహరణకు మాత్రమే పైన వుటంకించబడినప్పుడు, ఇంకా ఇతర రంగానికి చెందిన మాటలు అతి వేలంగా వున్నాయని అది వేరే చెప్పాలా?

తెలుగువాళ్ళు మాట్లాడితే చాలు బోలెడు సంస్కృత పదాలు దొర్లుతాయి. తెలుగువాళ్ళు రాస్తే చాలు బొచ్చెడు సంస్కృత శబ్దాలు దొరుకుతాయి. తప్పదు. అనేకానేక శతాబ్దాల నుండి తెలుగూ, సంస్కృతమూ కలగలిసి పోయాయి. శనగపిండిలో కొంత బియ్యపు పిండి కలిపి గారెలూ, చేగోడీలూ వంటి అప్పాలు చేస్తే ఎంత కరకరగా వుంటాయో, తెలుగు పిండితో సంస్కృత పిష్టం చేరి అద్భుతమైన, సమ్మిళితమైన పదాల పిండి వంటలుతయారయ్యాయి. తెలంగాణ భాష సైతం తెలుగు కనుక ఈ తెలంగాణ పదాల్లోనూ సంస్కృతం పలుకులు చేరి ఆ తెలుగును వెలిగింప చేశాయి. ముఖ్యంగా...తెలంగాణ పల్లీయుల సల్లాపాల్లో సంస్కృత పదాలు ఎట్లా మిళితమై వున్నాయో చూసినపుడు ఆశ్చర్యచకితులం అవుతాం.

తెలంగాణలో "పంచపాల' అనే పదం ఒకటుంది. ఇది ఒక వస్తువు. అందులో ఐదు అరలుంటాయి. అంతా గుంతల్లా వుంటాయి. మొత్తంగా ఆ వస్తువు చేయి పరిమాణంలోనే వుంటుంది. ఆ అయిదు గుంతల్లో పసుపు, కుంకుమ, పచ్చపిండి మొదలైనవి వుంటాయి. ప్రతిరోజూ స్త్రీలు గడపల్ని కడిగి ఆ కడపల మీద పచ్చపిండితో గీతలూ, వాటి మధ్య కుంకుమ బొట్లూ, గడపకు (వెలుపలివైపు పసుపూ కుంకుమల బొట్లూ పెట్టి అలంకరిస్తారు – పూజిస్తారు. ఇట్లా పసుపు కుంకుమా –.....కల్గి వున్నదే "పంచపాల" "పంచ" అంటే ఐదు. అది సంస్కృతం. శబ్ద రత్నాకరంలో పంచపాలి లేదు గానీ దాదాపు అదే అర్థంలో పంచపాత్రం వుంది. పాత్రకు సమానార్థకంగా "పాల" అని గ్రహించవచ్చును.

"పంచ పాండవులు ఎందరు అంటే మంచంకోళ్ళ తీరుగ ముగ్గురని రెండు వేళ్ళు చూపించ పోయిండట" – ఇది తెలంగాణ సామెత. వాస్తవానికి తెలంగాణేతర తెలుగు ప్రాంతాల్లోనూ ఈ నానుడి వుంది. విషయం...తెలంగాణలోనూ "పంచ పాండవులు"అనే పద ప్రసక్తి. ఆ సమాసంలోని పంచ సైతం సంస్కృతమని చెప్పడం వుద్దేశం.

తెలంగాణలో "వాడు ఏ పని చేసినా పొక్త చేస్తడు" అనే మాటతీరు వుంది. అంటే వాడు చాలా చక్కగా పని చేస్తాడు అని చెప్పడం. 'పొక్త' బహుశ; సంస్కృత "పక్వత" నుండి రావచ్చును. పక్వం అన్నా, పక్వత అన్నా, పరిపక్వత అన్నా, సఫలీకృతం చేయడం, పనిని ఫలప్రదం చేయడమే తెలంగాణ పొక్త చేయడం.

ఇంక 'పంక' (పంఖా) గురించి ఆలోచిద్దాం. దీన్ని ఆంగ్లంలో ఫ్యాన్ అంటున్నాం. తెలంగాణాలో గ్రామీణులు యిప్పటికీ "మీ యింట్ల ఎన్ని పంకలున్నయి" అంటూంటారు. "పంక" పదం ఎగతాళికి అర్హమైన మాటకాదు. ఆ మాటకొస్తే ప్రజలు మాట్లాడుతున్న, ఏ మాటనూ హేళన చేయకూడదు. "ఫంఖా" హిందీ / ఉర్దూ పదం. దీనికి మాతృక సంస్కృత "పక్షం". పక్షం అంటే ఒక అర్థం "రెక్క". (పక్షాలు కల్గిందే పక్షి), ఈ రెక్కలు దీనికి మూడు ఉంటాయి కనుక పంక అన్నారు. పక్షంలోని "క్ష" "క"గా మారింది. అంతేగాక ఆ 'క' అక్షరానికి ముందు సున్నా చేరింది. చివరి ము వర్ణలోపం జరిగి పంక అయ్యింది. "అక్షి" అనే సంస్కృత పదం హిందీ 'ఆంఖ్' కాలేదా? ఇక్కడా సున్నా రాలేదా? అదనంగా పదాది హ్రస్వ అకారం దీర్ఘంగా అవలేదా? భాషలో ఈ మార్పులు స్వాభావికాలు. సంస్కృత "నిద్ర" సైతం హిందీలో సున్నాతో 'నీంద్' అయింది. ఏమైనా తెలంగాణ 'పంక' కూ, సంస్కృత "పక్షాలకు" లంకె వుందనేది నిజం.

సంస్కృతంలోని "పక్షి" తెలంగాణలో 'పచ్చి" అయింది. "పచ్చిమానూ తొర్రలోనా/ పంచ వన్నెల పచ్చి పలికే / పచ్చి పలికిన పలుకులాకూ / పగడమే పడి పచ్చెలాయే" అని జానపద గేయంలోని "పంచ వన్నెల వచ్చి" లో పచ్చి వుంది. ఇదే పక్షి పక్షిలోని క్షి సంయుక్తాక్షరం. పచ్చిలోని చ్చి ద్విత్వం. "క్షి" ఎట్లా "చ్చి" అవుతుందని విచిత్ర పడాల్సిందేమీ లేదు. "లక్ష్మి" లచ్చి కావడం లేదా? ఇంకా 'క్ష్మి' లో క,ష,మ అనే ..మూడు అక్షరాలున్నాయి. ఆ మూడూ కలిసి 'చ్చి' అవగా లేనిది, క,ష లు కలిసి ...."చ్చి" అవడంలో వింత ఏమిటి? లచ్చి వంటి వాటిని ఛీ కొట్టకూడదు సుమా!

నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూరు ప్రాంతాల్లో "పట్కరోల్లు" ఉంటారు. బహుశ : ఈ పట్కరోల్లు పటకారుల్లోంచి వచ్చి వుంటారు. "పటకారుడు" అంటే సాలెవాడు అని అర్థం. పట్కరోల్లు సైతం ఒక రకం పద్మశాలీలే కదా! కాకుంటే వీళ్ళు పట్టుగుడ్డ – లకు సంబంధించిన వాళ్ళై వుండాలి.

"పొద్దుగాల్లప్పటి నుంచి వంచిన నడుము వంచినట్లే పనిచేస్తున్న.

– నా నడుంల టింగుమంటుంది. పనిచేసి చేసి నా పటమారుతుంది" అనే వాక్యాలు విన్పిస్తారు తెలంగాణలో. "పటమారుతుంది" అంటే మరి! అది "పటిమ" ఆరడం అన్నమాట! పటిమ అంటే సంస్కృత పదం. అర్థం నిఘంటువులు నేర్పు ఓర్పు అని యిచ్చినా, సన్నివేశాన్ని బట్టి నాకు శక్తి చాలడం లేదనే! పోరాట పటిమ అనే సమాసంలోని పటిమకు దాదాపు యిదే అర్థం కదా! చాలా అలవోకగా ఈ 'పటమారుదు' పదబంధం తెలంగాణ పల్లె ప్రజల్లో వుంది.

"పట్టణము" అంటే ప్రధాన నగరం అని తెలుసు. ఇది సంస్కృత పదం తెలంగాణలో "పట్నం" అంటే హైద్రాబాదు. సికింద్రాబాదు, తెలంగాణ పట్నమే గాక, మచిలీపట్నం మొదలైన యితర ప్రాంతాల్లోని పట్నానికి "పట్టణమే" మూలం. ఎన్ని వింత మార్పులో చూడండి. "పట్టణం" లోని ద్విరుక్త టకారం పట్నంలో ఒంటరిగా మిగిలింది. అంతేగాక మూలంలోని మూర్ధన్యం (ణ) 'న' గా మారి అది 'ట' కు ఒత్తుగా వుంది. పలుకడానికి ఏది సులువో దాన్ని పరిగ్రహిస్తారు ప్రజలు.

సంస్కృతంలో "పతంగం" అనే మాట వుంది. దీనికి ఒక అర్థం పక్షి అని, తెలంగాణలో గాలిపటాన్ని ఇప్పటికీ చాలామంది పతంగులు అంటారు. ఏకవచనం 'పతంగి', అంటే పక్షి లాంటిదని అర్థం. పక్షిలాగే ఆకసంలో ఎగురుతుంది కనుక పతంగి అయింది.

తెలుగులో 'తాయిలం' అనే ఓ మాట వుంది. తల్లులు పిల్లలను బుజ్జగించి బుజ్జగించి తాయిలం పెడ్తారు. రాజకీయ నాయకులు ప్రజలకు తాయిలాలు చూపెడ్తూ ఎన్నికల్లో పాల్గొంటారు. ఈ 'తాయిలం' తెలంగాణలో 'పన్కాయి' అని పల్కబడుతుంది. కొందరు 'పనాయి' అని అంటుంటారు. ఈ పన్నాయి అంటే బహుశ. 'పనసకాయ' కావచ్చును. అరుదుగా లభించే మధుర ఫలం కనుక అలా బుజ్జగించారేమో! 'పనస' సంస్కృత పదమే!

మగనాలు, పతిపత్ని, వతిపత్ని, పతివ్రతలకు అర్థాలు తెలుసు మనకు, ఇది ఉదాత్తమైన పదాలు. సకారాత్మకాలు. కాని చిత్రంగా తెలంగాణలో నకారాత్మకంగా "పెద్ద పత్తిత్తు" అంటుంటారు. ఇది పతివ్రతా జన్య పదం. భావం మాత్రం పతివ్రతకాదని. సమాజంలో పతివ్రతలే కాదు, సతీవ్రతులూ వుండాల్సిన సమయమిది. పురుషులు సతీవ్రతులైతేనే సంస్కారులవుతారు. ఎయిడ్స్‌లాంటి భూతం (వ్యాధి) వుండదప్పుడు.

'పత్రము' అంటే చాలా అర్థాలున్నాయి. ఈ మాటా సంస్కృతమే! తెలంగాణలో "ఓ లెక్కలేదు – పత్రం లేదు" అంటే లెక్కా పత్రాలు (రాసుకొన్న కాయిదాలు) లేవని అర్థం. నిజానికి వెనుకట పత్రం అంటే ఆకు అని. ఆకుల మీద (తాళపత్రాదులు) రాసేవాళ్ళు కనుక లెక్కా పత్రాల్లో పత్రం అమరింది. తెలంగాణలో కరీంనగర్, నిజామాబాదు మొదలైన ప్రాంతాల్లో బీడీ పరిశ్రమలు ఎక్కువ. ముఖ్యంగా బీడీలు చుట్టేవాళ్ళు స్త్రీలు. వీళ్ళు బీడీ ఆకుల్ని ఒక చిన్నపాటి యినుపముక్కను పెట్టి ఆ పరిమాణంలో కత్తిరించి, అందులో పొగాకు పోసి తయారు చేస్తారు. ఆ చిన్నపాటి యినుప ముక్కను 'పత్ర' అంటారు. అది ఆకుల్ని కత్తిరించడానికి ఉపయుక్తం అయ్యే చిన్నపాటి యినుప ఆకు కనుక "పత్రం" అంటున్నారు. ఇంతేగాక, రేకు షెడ్లపై వేసే రేకుల్ని సైతం కొందరు 'పత్రాలు' అంటారు. మరాఠీ భాషా ప్రభావం వల్ల షెడ్డుల మీద కప్పే రేకుల్ని పత్రాలుగా పేర్కొంటారు. ఇవీ పెద్ద ఆకుల పరిమాణంలో వుండటం చేత కావచ్చును అలా వ్యవహరించడం.

'పదం' అనే మాట సంస్కృత సంబంధం. దీనికి అనేకార్థాలున్నాయి. తెలంగాణలో మాత్రం పదం అంటే పాట అని అర్థం. "ఒక్క పదం పాడరాదు! నీ గొంతు మంచిగ వుంటది" అంటే పాట పాడుమని అడగడం. అన్నమయ్య సైతం 'పద కవితా పితా మహుడు' కదా!

'పరమాన్నం' అంటే పాలుపోసి ముద్దగా కాకుండా పలుచగా వండిన అన్నమనీ, పాయసమనీ బహుజనపల్లి తన శబ్దరత్నాకరం నిఘంటువులో అర్థాలు చెప్పినా, తెలంగాణలో మాత్రం పరమాన్నం అంటే చక్కెర లేదా బెల్లంతో వండిన ముద్దన్నమే! పాయసాన్ని తెలంగాణలో పాశెం అంటారు. వినాయకచవితినాడు పాశెం కుడుములూ, తాలికలూ వేసి తయారు చేస్తారు. కనుక తెలంగాణలో పరమాన్నమూ, పాయసమూ...రెండూ వేర్వేరుగా వుంటాయి. పరమాన్నమూ సంస్కృతం నుంచి వచ్చిన సమాసమే! అది మామూలు అన్నంగాక పరమమైన అన్నం అని.

'పరస్పరం' అంటే అన్యోన్యం అని అర్థం. ఇదీ సంస్కృతమే! అయితే తెలంగాణలో పరస్పరం అంటే ఎంతకు అంతే అని. "వాళ్ళిద్దరికి పరాస్పరం. మాటలే లేవు" అంటే వాళ్ల మధ్య సంబంధం అంతంతమాత్రమే అని చెప్పడం. ఒక భాషలో ఒక అర్థంతో వున్న పదం, మరో భాషలో యింకొక అర్థఛాయతో వుంటం మామూలే! తెలంగాణ పరాస్పరంలో 'ర' వర్ణానికి దీర్ఘం వచ్చిన చిన్నమార్పు వుంది. అంతే! పరస్పరం ఆ రెండు పదాల మధ్య పద స్వరూపంలో పెద్ద మార్పులేదు గానీ అర్థాల్లో భేదం వుంది.

'ఏమో బాగ పరాశికాలు ఆడుతున్నవేందిరా?' లోని పరాశికాలకు మూలం సంస్కృత 'పరిహాసం' ఇదే పరియాచకం. అట్లాగే 'ఏమో బాగ పరీచ్చ పట్టి చూస్తున్న వేందిరా?'లోని పరీచ్చ 'పరీక్ష' నుంచి వచ్చింది. పరీక్ష అనేదీ సంస్కృతమే! పరీక్షించి చూడ్డమే 'పరీచ్చవట్టి చూసుడు' అంటే గుచ్చిగుచ్చి తరచి తరచి చూడ్డం అన్నమాట.

"ఈ గోస పాడుగాను – ఎన్నొద్దుల పడెంత్రమో ఏమో' అనే వాక్యంలోని పడెంద్రం సంస్కృత 'పర్యంతం' లోంచి వచ్చింది. వరకు అని అర్థం. ఎన్నొద్దులు అంటే ఎన్ని రోజులు అని.

'పర్యంకం' అంటే మంచము. ఈ పర్యంకం తెలంగాణలో (నిజామాబాదు పరిసరాల్లో) పలంగ్ అయ్యింది – హిందీలో సైతం పైలంగా పలంగే ! ఇక 'పల్యంకిక' అంటే పల్లకి. అది తెలంగాణలో పాల్కి, పాలాకి అయ్యింది (కొందరు మేనా అంటారు కూడాను)

"వీని పాడుగాను – పాండురోగపోడు' అంటారు తెలంగాణలో పూర్తిగా రక్తహీనతాది రోగాలతో తెల్లబడుతున్న వ్యక్తిని చూసి. పాండువు అంటే ఒక రోగమే!

'ఈ పండు పాకానికి వచ్చిందా?' లోని పాకం సంస్కృతమే! పాకం అంటే పరిపాకమే!

'ఏమో పాటం చదువుతున్నవేందిరా?' అంటే వాస్తవానికి 'పాఠ పఠనం' కాదు. ఒకే మాటను పదేపదే చెప్పడం. చర్విత చర్వణంగా విషయం విప్పడం, 'పాఠం' సంస్కృత పదం. ఆ మాటలోని మహాప్రాణం తేలికైంది తెలంగాణలో. 'పాతకం' అనేదీ సంస్కృతం మాటే! అయితే ఈ పదం 'పాత్కం' అని మారుతుంది. పల్కడానికి సులువుగా వుంటుందని

కవిత

# ఆదిపునాది ఉగాది

వసంతమా! రా!
రక్త సంబంధాలు తిరస్కరించిన
ఈ వృద్ధాశ్రమాల్లోకి
శరీరాల్లోనే సమాధులపోయిన
మోడువారిన పండు బతుకులు మళ్ళీ చిగురిస్తాయేమో!
మమతల జలపాతాలు మళ్లీ ఎగజిమ్ముతాయేమో!
ఉగాది పురుషా! స్వాగతం! సుస్వాగతం
అనుబంధాలు మంటగలిపి
తల్లిదండ్రుల్ని మనుషుల బందెల దొడ్డికి తరలించిన
కన్నబిడ్డల్ని ఆవహించు! కనికరం కొత్త మోసులెత్తుతుందేమో!
రక్తంలో అమ్మానాన్నల వాసనేస్తుందేమో!
కోయిలా ! కోయిలా! కొత్తపాట పాడవమ్మా
కాంక్రీటు అరణ్యాలలో కలల పూలు పూస్తాయేమో
ఒక్క చిరునవ్వు పరిమళమైనా
నగరాల నిర్జీవ బంధాల్లో వీస్తుందేమో!
వసంతాల్లేని ఉగాదుల్లేని, మమతల పునాదుల్లేని
ఈ మరబతుకుల రణరంగంలో
స్వార్థం తప్ప మరో రుచి తెలియని వింతలోకంలో
ఉగాది పచ్చడి ఎవరికి తినిపించాలి!
కన్నీటి ఉప్పునే తప్ప కొత్త రుచెరుగని
కూలి రసనకి చెరుకురసమైనా చేదేకదా!
మన్మధా! మదనరాజా!
పంచ బాణాల తూణీరం ప్రక్కన పెట్టు
కడుపులో బిడ్డ కడుపులో ఉండగానే
అమ్మకాలు, కొనుగోళ్లు జరిగిపోతున్న కాలంలో
సృష్టి సంగమం సైతం క్షణిక వ్యాపారమే!
వెన్నెలా! వెన్నెలా! విరగకాయమ్మా పుచ్చపువ్వులా
పాతను రోతనే చెత్త ఆలోచనలు నిండిన
జనాల హృదయాలలో
అంధకారాలుదయించే మొద్దు మెదళ్ళలో
నీ వెండి వెలుతురైనా దీపాలు వెలిగిస్తుందేమో!
హేవిళంబివో, విళంబివో పేరేదైనా
పురాతన సామూహిక రక్త స్పర్శను
మా ఊపిరిలో పొదివినప్పుడే నీవు ఉగాదివి!
కాలకడలిలో మానవ సృష్టికి
ఆదివి, పునాదివి!

**(మార్చి 18 : విలంబ నామ ఉగాది)**

గుర్రాల రమణయ్య, 9963921943

భావించి సూతకం మాటను సూత్కంగానూ, జాతకం పదాన్ని జాత్కంగానూ ఉచ్చరిస్తారు. విడివిడిగా వున్న అక్షరాలను కలివిడిగా (సంయుక్తాక్షరంగా) చేయడం భాషలో సర్వసాధారణంగా జర్గుతుంది. తెలుగు తెల్గు, వెలుగు వెల్గు...యిట్లా ఎన్నయినా చెప్పవచ్చు. పద్యభాషలో ఇటువంటివి ఎక్కువగా కన్పిస్తాయి. తెలంగాణలో 'ఇస పాత్కుడు' అనే సమానం వుంది. ఇది నిజానికి 'విష పాతకుడు' అని. పాతకుడు అంటే పాపం చేసేవాడు. విష సదృశమైన పాతకుడు, విషాన్ని పోసే పాతకుడు అని అర్థచ్ఛాయలు.

'ఈ బాయిల నీల్లు సిత పతాలాల్లంల వున్నాయి' లోని సితపతాల్లం అనేవి చాలా లోతులో బావి నీళ్ళున్నాయని భావం. పతాల్లం అనేది 'పాతాళం' నుంచి వచ్చింది. పాతాళం సంస్కృత శబ్దం, మరి 'సిత' ఏమిటి? అయితే ఇది అతలవితల సుతలాది లోకాల్లోని సుతుల నుండి వచ్చి వుండాలి. లేక శీతల పాతాళమైనా కావాలి. నీళ్ళు చాలా లోతులోనూ చల్లగానూ వున్నాయని చెప్పటం కావచ్చును. లేదా సితము (తెల్లనిది) నీళ్ళయినా అవ్వాలి.

పాపి, పాపిష్ఠుడు, పాపిష్ఠి మనిషి అనేవి అన్నీ సంస్కృత భాషా పదాలే! తెలంగాణలో పాపిష్టి మనిషి అనీ, పాపాత్ముడు అనీ వ్యవహరిస్తున్నారు. పాపాత్ముడులోని మా వత్తు పోయి తెలంగాణలో కావత్తు వచ్చింది. ఇది చిత్రమైన పరిణామం. ఏ భాషా సూత్రానికి లొంగదు. అయినా పల్లీయుల ఉచ్చారణకు కావత్తు అనుకూలం కావచ్చును. అట్లా పాపాత్ముడు పాపాత్కుడు అయ్యాడు. ఎంతైనా వాడు పాపాత్ముడే కదా, అలా అనటం తప్పేమీ లేదులెండి. ఇంకోమాట – పాపకారి, పాపకారి మనిషి అని దోషకారి రూపంలో రెండు మాటలున్నాయి.

తలలో ఒకే వైపు నొప్పి అదేపనిగా వున్నప్పుడు దాన్ని తెలంగాణలో 'పార్శ్వపు నొప్పి' అంటారు. దీన్ని బహుశ; ఆంగ్లంలో మైగ్రెయిన్ అంటారేమో ఆలోచించాలి. 'పార్శ్వం' అంటే ఒక ప్రక్క, ఈ పార్శ్వం సంస్కృత శబ్దం.

'వీడు మామూలు పిండం కాదు, గనుడు" లోని 'పిండం' సంస్కృతం. పిండం అంటే గర్భం, చనిపోయిన వారికి పెట్టే పిండాదులతో పాటు యిక్కడ మనిషి అని అర్థం. శనగపిండితో చేసే పిండివంటను తెలంగాణలో 'పిట్ల' అంటారు. పిష్టము లేదా పిష్టకము నుండి తయారైన వంటకం పిట్ల. ఇట్లా తెలంగాణలో అసంఖ్యాకమైన సంస్కృత పదాలు కొంత రూపం మార్చుకొని ప్రజల నోట పలుకుతున్నాయి. ●

# శ్రీకాకుళం (కృష్ణాజిల్లా) ఆంధ్రమహావిష్ణు దేవాలయ ప్రాంగణంలో
# తెలుగు భాషాబ్రహ్మోత్సవాలు



జనవరి 26, 27, 28 తేదీల్లో తెనాలిలో ఘనంగా జరిగిన తెలుగు సాహిత్య మహోత్సవాల రుచులు మరపులోకి జారిపోకముందే ఫిబ్రవరి 10, 11 తేదీలో కృష్ణాజిల్లా శ్రీకాకుళంలోని ఆంధ్ర మహావిష్ణు దేవాలయ ప్రాంగణంలో తెలుగు భాషా బ్రహ్మోత్సవాల సంరంభం అలరించింది. తెనాలిలో స్థానిక శాసనసభ్యుడు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గారి ఆధ్వర్యంలో మొదటిసారిగా జరిగిన తెలుగు సాహిత్య సంబరాలకు కూడా ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖకు చెందిన సంస్థలు సహకారం అందించాయి. శ్రీకాకుళం ఉత్సవాలనైతే పూర్తిగా ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత మరియు సంస్కృతీసమితి, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ దివి ఐతిహాసిక మండలి పూర్తిగా భరించి నిర్వహించాయి. తెనాలి కార్యక్రమానికి ప్రేరకాలు, ప్రోత్సాహకాలు ఆంధ్రప్రదేశ్ తెలుగు సాహితీ సాంస్కృతికతకు ప్రతినిధి నాయకుడు అయిన శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారే కాగా, శ్రీకాకుళం సభలకు కూడా ఆయనే సర్వం. ఘనతంతా ఆయనదే. దీనికి కొన్నేండ్ల పూర్వరంగం ఉంది. 2002 నవంబరు 1, 2 తేదీల్లో ఇచ్చోటనే తెలుగు భాషోద్యమ సమాలోచనా శిబిరం రెండు రోజుపాటు జరిగి, ఒక చరిత్రకు శ్రీకారం చుట్టింది. ఆ సభ నిర్ణయం ప్రకారమే 2003 ఫిబ్రవరి 21న తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆవిర్భవించింది.

తెలుగుభాషా బ్రహ్మోత్సవాల్లో తొలి రోజు ప్రారంభసభలో తమ అధ్యక్షోపన్యాసంలో అవన్నీ ఆయన జ్ఞాపకం చేసుకొన్నారు. కొన్నేళ్లుగా శ్రీకృష్ణదేవరాయ మహోత్సవాలను తాము ఇక్కడ జరుపుతున్న సంగతిని ప్రస్తావించారు. బుద్ధప్రసాద్‌గారు స్వయంగా సంకల్పించి కొన్నేండ్ల క్రితమే అక్కడి ఆముక్త మాల్యద మండపంలో స్థాపించిన శ్రీకృష్ణదేవరాయ విగ్రహం ఈ ఉత్సవాలన్నిటికీ సాక్షిగా ఉండి, సాహితీవేత్తలకు స్ఫూర్తిని కలిగిస్తున్నది.

ప్రారంభసభలో ముఖ్య అతిథిగా, ప్రారంభకునిగా విచ్చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ ప్రసంగంలో – ప్రపంచంలో ఏ ఇతర భాష వారికీ తమ భాషను రక్షించుకోవడానికి ఇంత కష్టపడాల్సిన పరిస్థితి రాలేదేమోనన్నారు. మార్కెట్ శక్తులు భాషను కంట్రోల్ చేస్తున్నాయని హెచ్చరించారు. మన భాష మీద మనకు పట్టుండాలని, అన్నిచోట్లా మన భాషనే ఉపయోగించాలని పిలుపునిచ్చారు. జపాన్, కొరియా ఛీఫ్ జస్టిస్‌లకు ఆంగ్లభాష రాదని, వారు అన్ని వ్యవహారాలను తమ మాతృభాషలోనే నిర్వర్తిస్తారని తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణాధికారి డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ తన లక్ష్య ప్రస్తావన ప్రసంగంలోను, రెండు రోజుల కార్యక్రమంలో పలుసందర్భాల్లో మాట్లాడుతూ – ఈ సంవత్సరాన్ని తెలుగు భాషా వికాస సంవత్సరంగా పరిగణిస్తూ ముఖ్యమంత్రి ప్రకటించారని, ఇందుకోసం కార్యాచరణ ప్రణాళికకై కృషి చేస్తున్నామని, అందరూ తమ సలహాలను, సూచనలను అందించాలని విజ్ఞప్తి చేశారు.

డాక్టర్ విజయభాస్కర్ భాషా పరిణామాల లోతుల్లోకి వెళ్లి, సమకాలీన అవసరాలకు తగ్గట్లు భాషను మనం పెంపొందించుకోవలసిన అవసరాన్ని వివరించారు. మన భాషా రక్షణలో మరొక భాషను ద్వేషించాల్సిన అవసరం లేదని, ఒక భాష అనేక భాషను కలుపుకొని వికసిస్తుందని, సామాజికంగా, ధర్మసూత్రాల్లో



మార్పు వచ్చినట్లే భాషాపరంగా కూడా మార్పు వస్తాయని, రావాలని ఆయన అన్నారు.

డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు రచించిన 'తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం', 'ద్రావిడ మంగోలు భాషల జన్య సంబంధం' (తెలుగుజాతి ట్రస్టు ప్రచురణలు), 'దేశభాషలందు తెలుగు లెస్స' పరిశోధనాత్మక వ్యాససంపుటిని, ఈమని శివనాగిరెడ్డి రచన 'ఆంధ్రమహావిష్ణుదేవాలయ చరిత్ర', జి.వి.పూర్ణచంద్ రచన 'తెలుగులో అతిథి పదాలు', డా.దీర్ఘాసి విజయభాస్కర్ రచన 'సూతరంగస్థలి' సిద్ధాంత పత్రం, మరి మూడు పుస్తకాను ఈ వేదికపైన పెద్దు విడుద చేశారు.

రెండురోజులపాటు జరిగిన ఎనిమిది సదస్సుల్లో అనేకమంది ప్రముఖులు ప్రసంగించారు. ఇంటి భాషగా తెలుగు, బడి భాషగా తెలుగు, పాలనాభాషగా తెలుగు, సాంకేతిక తెలుగు, భాషాభివృద్ధి – లక్ష్యాల, ప్రణాళిక, ప్రసార మాధ్యమాలు – భాషాభివృద్ధి, భాషాభివృద్ధి – సాహిత్యసంస్థలు – ఇవీ ఈ సదస్సులు. పాల్గొన్న వారంతా ఆయా అంశాలపై శ్రద్ధతో ప్రసంగించారు. వాటి సారాంశాన్ని ప్రభుత్వానికి అందించగల నేతలు, అధికారులు సభల నిర్వాహకుల్లో ఉన్నారు గనుక ఈ మొత్తం కార్యక్రమం ఫలవంతం కాగలదని ఆశిద్దాం.

సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ కవల ప్రసంగాలు, కళాకారుల ప్రదర్శనలు, రాజకీయవేత్తల, మంత్రుల, పెద్దల హడావిడి – అంతా కలిసి "శ్రీకృష్ణదేవరాయల మహోత్సవం– 2018" కోలాహలంగా జరిగింది. ఎటువంటి రుసుమూ వసూలు చేయకుండా అన్ని విధాలుగా ఆహ్వానితులందరినీ సత్కరించి పంపిన ప్రభుత్వాన్ని అందరూ మెచ్చుకొన్నారు. కావసింది అదే కదా....

– 'అమ్మనుడి' ప్రతినిధి





గజానన్ తామన్
9440211285

# నిగమశర్మకు అక్క వ్రాసిన లేఖావళి-4

నా అనుంగు సోదరుడైన చి॥ నిగమశర్మకు దీవెనలు దీవెనలతోపాటు వ్రాస్తున్న జాబు

కొన్ని రోజులక్రితం నిన్ను విసిగించేంత సుదీర్ఘ లేఖ వ్రాసి ఇంటిని. 'ఇంత చిరుగీతి ఎదవేగిరించెనేనిపాడుకొనును తాండవమాడుకొనును' అన్నారు కదా దేవులపల్లివారు! తెలుగు భాషకు, సాహిత్యానికి మంచి రోజులు రావాలన్న నా ఉత్సాహపూరిత భావనలకు శబ్ద రూపంతో మరో లేఖ.

విద్య, వైద్యం మరియు రక్షణ పౌర సమాజానికి అందించ వలసిన కనీస బాధ్యతలు ప్రభుత్వాలవి. 'ముందుచూపులేని గతంలోని దొరతనాలు విద్యావైద్యాలను కార్పొరేటు రంగానికి సమర్పించుకొన్నవి. ఉపాధికి ప్రతిభా వ్యక్తిత్వాలు అర్హతలు కాక మార్కులే యువతీ యువకులకు రాచమార్గాలని భ్రమలు కల్పించి. తలిదండ్రుల నుండి ఫీజు రూపంలో నిలువునా దోచుకుంటున్నవి. ఈ ప్రైవేటు విద్యా సంస్థలు ఆంగ్లాన్ని బోధనామాధ్యమంగా చేసి తమ శ్రేష్ఠత్వాన్ని నిరంతరం చాటుకొంటూ, ఛాత్రులను పెద్ద సంఖ్యలో చేర్చుకొంటున్నవి. ప్రభుత్వ పాఠశాలలు ఒకటి తరువాత ఒకటి మూతవడుతున్నందునందున బోధనా మాధ్యమైన తెలుగుకు సర్కారులు స్వస్తి చెప్పి ఆంగ్లానికి ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రభుత్వాలు సంస్థలను శాసించడంపోయి సంస్థలే ప్రభుత్వాన్ని శాసిస్తు న్నాయి. ఆంగ్లంలో ఓ సామెత ఉంది. "కుక్కతోకని ఆడించడానికి మారుగా తోకే కుక్కను ఆడిస్తున్నది".

ఈనాడు తెలుగులో పంతులుగారు పాఠాలు చెప్పరు. న్యాయా ధీశులు తెలుగులో తీర్పులివ్వరు. ఆంగ్లంలో శాసకీయ వ్యవహారాలు సాగిస్తూ దొరతనం వారు ప్రజల చేరువలో ఉండరు. ప్రజాస్వామ్యం ఈవేళ నేతి బీరకాయలోని నేయిలా వుంది! మన శ్వసనావసనాలైన తెలుగు భాష క్రమంగా అంతర్హితమయ్యే ప్రమాద ఘంటికలు వినిపిస్తున్నాయి. ఆధునిక పరిభాషలో చెప్పాలంటే ఈనాడు తెలుగు భాషాయోష ఐ.సి.యు. లో ఉంది.

మన తీయ తెలుగును పునరుజ్జీవింప చేసే ఉద్యమాలు ప్రజల నుండి పెద్ద ఎత్తున రావాలి. కుంభకర్ణునిలా నిద్రపోతున్న సర్కార్లను మేలుకొల్పాలి. బోధనా మాధ్యమంగా కాక, తెలుగును ఒకటి తరగతి నుంచి ఇంటరు స్థాయి వరకు పాఠ్యాంశంగా చేసినందుకు ఉబ్బి తబ్బిబ్బు కావడం అల్ప సంతోషత్వానికి నిదర్శనం. ఇటీవలి చర్య మొక్కుబడి అవుతుందే తప్ప విద్యార్థులను పఠనాసక్తులను చేయదు.

సాహిత్యం వినా భాష జీవించి యుండదు. తెలుగునాట ప్రాచీన సాహిత్యం దాదాపు విస్మృతమౌతున్నది. వైభవ ప్రతీకలైన మహా కావ్యాలు పునర్ముద్రణకు నోచుకొనవు.

నోచుకొనినా, ప్రజాదరణలేని కారణంగా పుస్తక విక్రయశాలలు అమ్మకానికి పెట్టవు. పలు విషయాలకు చెందిన గైడ్లు విక్రయిస్తూ అస్తిత్వాన్ని నిల్పుకొంటున్నవి. ఆ గైడ్లు సాహిత్య గ్రంథాలకు నేటి అనివార్య పర్యాయాలు. అవి చదివే డిగ్రీలు, కొలువులు సంపాదించడం నేడు సాధ్యమౌతున్నది. సాహిత్యకృతులే అందుబాటులో లేనప్పుడు సిద్ధాంత గ్రంథాలు పి.హెచ్‌డి. నిమిత్తం ఎలా సమర్పిస్తారు? నాటి బ్రౌను మహాశయుని అపార ఉపకృతి వల్ల తెలుగు ప్రాచీన సాహిత్యం కనుమరుగు కాకుండా ఉంది. నేడు తిరుమల తిరుపతి వారు కొంతవరకు ప్రాచీన సాహిత్య గ్రంథాలను ప్రజలకు అందజేస్తున్నారు. హైదరాబాదులోని తెలుగు విశ్వవిద్యాలయం వారు, కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం వారు తెలుగు ప్రబంధాలను ఇటీవల ముద్రించి యున్నారు. విశాలాంధ్ర పుణ్యమా అని గురజాడ, జాషువా, శ్రీశ్రీ మరియు దేవులపల్లి కృతులు లభ్యమౌతున్నవి. తెలుగు సాహిత్య అకాడమివారి ప్రయాసను విస్మ రించలేము. 'ఎమెస్కో' వారు తెలుగు ప్రబంధాల్ని ప్రజలకు కారు చౌకగా చేరవేస్తున్నారు. అయినా వారు టీకా తాత్పర్యాలతో ప్రచురించనందువల్ల పెద్దగా ప్రయోజనం చేకూరదు.

ఇటీవల వేదం వేంకట రాయశాస్త్రి వారి టీకా తాత్పర్యాలతో ఓ ప్రైవేటు సంస్థవారు ప్రచురించిన శ్రీనాథుని 'శృంగార నైషధ' కావ్యాన్ని కొన్నాను. వెల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే అయినా, ఆ పుస్తకం తీవ్ర మనోవ్యథకు గురి చేసే అచ్చు తప్పుల తడక – ఈ పరిస్థితుల్లో, ప్రభుత్వంవారు నాటి బ్రౌను మహాశయుని ఎనలేని ప్రాచీన, ఆధునిక కావ్యాల పునర్ముద్రణకు కటి బద్ధులు కావాలి. సరసమైన ధరకు ఆబాల గోపాలానికి అందించాలి. డిగ్రీ కాలేజీలు విశ్వవిద్యాలయ గ్రంథాల యాలను అధ్యాపక విద్యార్థులకు ప్రాప్తిస్థానాలుగా చేయాలి. తెలుగు సాహిత్యం ఆద్యంతం ఔపోసనపట్టి విద్వత్పరిషత్తుల 'శలాక' పరీక్షకు నిలిచి తమను నిరూపించుకొన్నవారినే ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా, ఆచార్యులుగా నియమించి గౌరవించాలి. ఉద్యోగం దొరకని పక్షంలో సంపూర్ణ సాహిత్య అధ్యేతలైన విద్యార్థులకు గౌరవ వేతనాన్ని ఒసగే వ్యవస్థను ఏర్పర్చాలి. సాహితీ మూర్తులు వార్షిక పురస్కారాలకు 'పైరవీ' కాక 'ప్రతిభ' గీటురాయి కావాలి.

ఇంతటితో సరిపెట్టుకొనక, విశ్వకోశాలనూ, శబ్ద కోశాలను సామెతల కోశాలను మాండలిక వ్యాకరణాలను రూపొందించే బాధ్యత ప్రభుత్వంవారు వారి రాష్ట్రానికి సంబంధించిన 'అకాడమీ'లకు అప్పగిం చాలి. అందుకు తగిన నిధులను సమకూర్చాలి. నేటికీ ఉభయ తెలుగు రాష్ట్రాలలో భాషా సాహిత్య నిష్ణాతులకు కొరత లేదు. వారి సేవలను 'అకాడమీలు' వినియోగించుకోవాలి. ఇది చేసిన పక్షంలో తెలుగు సాహితీ వైభవ పునరాగమన ప్రవేశాలకు తోరణద్వారాలు తెరచుకొంటాయి.

ఈనాడు తెలుగు సాహితీ ప్రాంగణంలో ఉత్పలవారు నుడివినట్లు ఒక ప్రకారమైన 'స్తబ్దత' నెలకొని యుంది. ఉత్తమ సాహిత్య నిర్మితి దాదాపు మృగ్యమై పోయింది. అక్కడక్కడ ఊట చెలమలే తప్ప తెలుగు సారస్వత నదీ ప్రవాహం ఇరుతటాలను ఒరుసుకొంటూ, 'ఉప్పొంగి పోతూ' 'ఆకాశగంగతో హస్తాలు కలుపుతూ' సాగర మార్గం పట్టడం లేదు. పూర్వం కవి సమ్మేళనాలకు జనం తండోపతండాలుగా వచ్చేవారు. ఒక విశ్వనాధనో, ఒక దేవులపల్లినో, ఒక దాశరధినో ఒక సినారెనో విని జన్మసార్ధకమైన అనుభూతిని పొందేవారు. నేటి సమ్మేళనాలలో శ్రోతలకన్న నానీల కవులే గుంపులుగా దర్శనమిస్తారు. నేటి కవులు తమ కవితా సంకలనాలను తామే వ్యయ ప్రయాసలకోర్చి ముద్రించుకొని సాహితీ గంధస్పర్శ ఎరుగని మిత్రులకు కట్టబెడతారు. కొన్ని పత్రికలు సూది మొన మోపినంత చోటు కవితలకు ఈయవు.

*ఏమా రోజులు! తెలుగువారు గర్వంగా చెప్పుకొన్న సాహితీ మాసపత్రిక. భారతి. రచనలు స్వీకరించటంలో సంపాదకులు గొప్ప ప్రమాణాలను పాటించేవారు. మహాకవి శ్రీశ్రీ 'మహా ప్రస్థానం' ను ప్రచురించక మొదట తిప్పి పంపారంటే నీకు ఆశ్చర్యం వేస్తుంది కదూ!*

కొమ్ములు తిరిగిన విమర్శకుల వ్యాసాలు అందులో చోటు చేసుకొనేవి – అట్టి గొప్ప పత్రికను అడిగేవారు లేనందున మూత పడింది. తెలుగు సాహిత్య చరిత్రలో అది ఒక చీకటి అధ్యాయం.

ఉత్తమ సాహితీ నిర్మితికి పరిపోషకమైన బౌద్ధిక వాతావరణం మాధ్యూ ఆర్నల్డ్ సెలవిచ్చినట్లు ఎంతైనా అవసరం. అట్టిదానికి నానా భాషలలో చరిత్ర సృష్టించిన గ్రంథాలు తెలుగులోకి అనూదితం కావాలి. ఫ్రెంచి రచయితలైన 'సార్త్రే', 'కేమూ'లు, జర్మన్ రచయిత 'కాఫ్కా', రష్యన్ రచయిత 'సోల్జినిట్షిన్' తో నేటి రచయితల పరిచయం పెరగాలి. అలాగే 'సాల్‌బెలో' లాంటి అమెరికన్ రచయితలతో. మరాఠీ బెంగాలీ భాషలలో గొప్ప సాహిత్యముంది. "పేరడైజ్‌లాస్ట్ వంటి మహాకావ్యం రచనకు ఆంగ్లకవి మిల్టన్ యూరపీయ సాహిత్యాన్ని కొల్లగొట్టాడని ఎవరో అన్నట్లు జ్ఞాపకం. మిల్టన్ ఎంచుకొన్న మార్గాన్నే నేటి తెలుగు కవులు అనుసరించాలి.

మనకు గల విశ్వవిద్యాలయాలకు, అకాడమీలకు ఇంతకు మించిన 'ఎజండా' ఉండబోదు. ఈ సంస్థలు అంకిత భావంతో అనువాద కార్యానికి పూనుకొనాలి.

ఒకనాడు తెలుగునాట గొప్ప గ్రంథాలయాలు ఉండేవి. ఇటు హైదరాబాద్ ఓరుగల్లులో, అటు రాజమహేంద్రవరంలో. హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయ భాషానిలయం 1903లో స్థాపింపబడింది. అట్టి సందర్భానికి ధర్మవరం కృష్ణమాచార్యులు ఆహూతులు. మంత్రపురికి చెందిన గంగా లక్ష్మణకవి ఆచార్యుల వారి ప్రశస్తిగా పంచరత్నాలను సభలో సమర్పించారు. లక్ష్మణకవి అప్పుడు కేవలం పదమూడు ఏండ్లు నిండిన పసివాడు.

నేడు గ్రంథాలయోద్యమాలు తెలుగునాట మళ్ళీ రావాలి. గ్రంథాలయాలకు పట్టిన నేటి దయనీయ స్థితి తొలగిపోవాలి. పల్లీ పత్తనాల్లో గ్రంథాలయాలకు తగిన భవనాలు లేవు. గ్రంథాలను భద్రపరిచే, పఠితలు కూర్చునే సామగ్రి లేదు. చెదలు పట్టకుండా వలసిన రాసాయనిక చర్యలు లేవు. పుస్తకాల ప్రియులైన గ్రంథపాలకులు లేరు. అంతర్ముఖులై ప్రజలూ ప్రభుత్వాలు ఆలోచించాలి. ఈ విషాద స్థితికి చరమగీతం పాడాలి. అంధ విశ్వాసాల్ని సమూలం పెరికి వైచి, హేతువాదాన్ని పరిపుష్టం చేసే సాధనాలు గ్రంథాలయాలు! పౌరుల్ని సుసంస్కృతుల్ని చేసి దేశోన్నతి వైపు నడిపించే ప్రేరణా స్రోతస్సులు గ్రంథాలయాలు!

పురాణాల్లో సుందోపసుందుల గాధ ఉంది. వారు లోకభీకరులైన రాక్షసులు. దైవీ ప్రేరణ వల్ల వారు పరస్పరం కలహించుకుని ఒకరినొకరు హతమార్చుకొన్నారు. తెలుగు సాహిత్యంలో ఇదే జరిగింది. సమయ ప్రేరితాలుగా వచ్చిన ధోరణులు సహజీవనం నెరపకుండా పరస్పర హత్యాకాండకు పూనుకొన్నవి.

భావ కవిత్వాన్ని – అభ్యుదయ కవిత్వం, అభ్యుదయ కవిత్వాన్ని విప్లవ కవిత్వం అంతమొందించే వరకు అభినివేశాన్ని వీడలేదు. దిగంబర కవులు రంగ ప్రవేశం చేసి సాహిత్యాన్ని చీల్చి చెండాడి శాశ్వత సమాధి కట్టారు. జన వంద్యమైన పద్యాన్ని వచన కవులు అపరవామనులై పాతాళానికి నెట్టివేశారు.

కవిత్వం సార్వకాలికం. కవులది భౌగోళిక, రాజకీయ సాంస్కృతిక ఎల్లలెరుగని సువిశాల జగత్తు. టాల్‌స్టాయ్ మనకు పరకీయుడు కాదు. జర్మనీకి చెందిన 'గెటే' త్యాజ్యుడు కాదు. కాళిదాసుని అభిజ్ఞాన శాకుంతలాన్ని జర్మన్‌భాషలోనికి అనువదించిన మహనీయుడు. ఏ మూలలో సృష్టింపబడినా సాహిత్యం సమస్త మానవాళిది.

పోతన్నగారి 'ఆపన్న గజేంద్రము పాహి! పాహి! అనగానే శ్రీ మహావిష్ణువు సంరంభియైనట్లు' నేటి ప్రజా నాయకులు తెలుగునకు పూర్వ వైభవం కల్పించటానికి నడుం బిగించాలి. ఉంటాను.

ఇట్లు

నీ అక్క, నిర్మల

పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

గుండె లోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేదీ 'అమ్మనుడి'లోనే

సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడలేరు

భాష లేకపోతే భావం లేదు ; నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది



# బౌద్ధం - వైజ్ఞానిక మార్గం

బొర్రా గోవర్ధన్
93906 00157

## 11. తొలి శస్త్రచికిత్సకుడు - జీవకుడు

ఇప్పటివరకూ బౌద్ధంలోని తాత్విక దృక్పథాన్ని శాస్త్రీయంగా విశ్లేషించుకున్నాం. వైజ్ఞానిక దృక్పథం అంటే కేవలం తాత్త్విక చింతనే కాదు. మానవ నాగరికతకు అది అంతో ఇంతో దోహదం చేయాలి. మనిషికి దైనందిన జీవితంలో, దైహిక విషయాల్లో ఉపయోగ పడాలి. బౌద్ధులకు కేవలం తాత్త్విక, నైతిక, సామాజిక దృక్పథాలే ఉన్నాయా? ఆచరణాత్మక భౌతిక, సాంకేతిక విషయాలు కూడా ఉన్నాయా? అంటే...వారు ఆ రంగంలో కూడా ముందున్నారనే చరిత్ర ఋజువు చేస్తోంది.

మానవ వికాసానికి, నాగరికతా పురోగతికి కారణమైన వైద్య, గణిత, సాంకేతిక రంగాల్లో బౌద్ధుల పాత్ర ఏమిటో చూద్దాం...ముందుగా వైద్యం గురించి చర్చిద్దాం.

**తొలినాటి వైద్యం:**

భారత దేశ చరిత్రలో మనకు సాధికారికంగా లభించే వాఙ్మయ ఆధారాలు వేదాలు, బౌద్ధ త్రిపిటకాలు. ఈ రెండింటిలో వైద్య విషయాలున్నాయి. రుగ్వేద కాలం క్రీ.పూ. 2000 నుండి క్రీ.పూ 1000 సంవత్సరాల మధ్యగా నిర్ణయించాయి. ఆ తర్వాత క్రీ.పూ. 700 వరకూ సామ, యజుర్వేద కాలం. ఆ తర్వాత వందేళ్ళకు బుద్ధుడు పుట్టాడు. బుద్ధుని కాలానికి వేదాలు మూడే. ఈ విషయం యజుర్వేదంలో ఉంది, బౌద్ధ త్రిపిటకాల్లో ఉంది. కాబట్టి వైద్య వేదంగా పేరుబడ్డ అధర్వణ వేదం క్రీ.పూ. 600 సంవత్సరాల నాటికి లేదు. దాని రచన క్రీ.పూ. రెండో శతాబ్దం అంటారు. అంటే బుద్ధుని తర్వాత 400 ఏళ్ళకి అన్నమాట.

కాబట్టి...మనం మన ప్రాచీన వైద్య విధానాల్ని మొదటిగా రుగ్వేదంలో చూడాలి. కానీ...రుగ్వేదం కంటే ముందే ఈ దేశంలో ఒక మహోన్నత నాగరకత వెలసింది. అదే సింధూ నాగరికత. దాని అవశేషాలు, ఆధారాలు కొన్ని దొరికాయి. వాటిల్లో వైద్యానికి చెందిన అంశాలు ఏమైనా ఉన్నాయా? అని చూస్తే...పెద్దగా ఏమీ లభించలేదు. పళ్ళ వంకర్లు తీయడానికి వాడే క్లిప్పు ఆనవాలు మెహర్‌గర్‌లో దొరికింది. ఇది క్రీ.పూ. 3000 నాటిది. ఈ మెహర్‌గర్ ఇప్పుడు పాకిస్థాన్‌లో ఉంది. ఆధారాలు దొరకనంత మాత్రాన సింధూ ప్రజలకు వైద్య విధానం లేదనుకోకూడదు. దంతవైద్యులే ఉన్నారంటే వైద్యులు ఉండకుండా ఉంటారా? అయితే - ఆనవాళ్ళు లేవు కాబట్టి వారి వైద్య విధానం ఏమిటో, వారు ఏయే రోగాలకు ఎలాంటి ఔషధాలు వాడారో తెలియదు. మెహర్‌గర్‌లో దొరికిన పంటి క్లిప్పుల్లాంటి క్లిప్పులు ఈజిప్టులో కూడా దొరికాయి.

ఇక - మనకి ఇక్కడ రుగ్వేద కాలం నాటి ఆర్య జీవనంలో కేవలం మూలికా వైద్యమే ప్రధానంగా ఉంటే...ఆ కాలానికి ఈజిప్టులో శస్త్ర చికిత్సలు చేసే స్థాయిలో వైద్యం ఉంది. మహిళా వ్యాధులు, వాటి నివారణకి ప్రత్యేక మహిళా వైద్యులు కూడా అక్కడ ఉన్నారు. ఈ విషయాన్ని క్రీ.పూ. 1800 కి చెందిన 'నేహుల్ గైనకాలాజికల్ పాపిరస్" అనే గ్రంథం తెలియజేస్తుంది. అలాగే క్రీ.పూ. 1600 నాటి గ్రంథం 'ఎడ్విన్‌స్మిత్ పాపిరస్" లో రక్త ప్రసరణ వ్యవస్థ, తెగిన చర్మాలకి కుట్లు, మూత్ర వ్యవస్థ, రకరకాల గాయాలూ, వాటికి చికిత్సా విధానం - వీటన్నింటి గురించి విపులంగా ఉంది.

ఈజిప్టువారి గొప్ప వైద్యగ్రంథం ఎబెర్స్ పాపిరస్. ఇది క్రీ.పూ. 1500 సంవత్సరాల నాటిది. ఈ 110 పేజీల గ్రంథంలో వివిధ శస్త్ర చికిత్సల వివరాలున్నాయి. (పాపిరస్ అంటే పాపిరస్ చెట్టు బెరళ్ళ మీద రాసిన గ్రంథం. ఇవి మన తాళ పత్ర గ్రంథాల్లాంటి గ్రంథాలు)

ఈ గ్రంథం క్రీ.పూ. 1500 నాటిదే అయినా, అంతకు పూర్వం వెయ్యేళ్ళ నుండే అక్కడ శస్త్ర చికిత్సా విధానం ఉంది. అక్కడే ఎందుకు ఈ విధానం ఉంది? అని...ఆలోచిస్తే - దానికీ కారణం ఉంది. ఈజిప్టు వారికి ఆత్మల మీద నమ్మకం ఎక్కువ. అవి ఎప్పుడో ఒకసారి తిరిగి వచ్చి అదే శరీరంలోకి ప్రవేశిస్తాయని నమ్మేవారు. కాబట్టి ఆ శరీరాల్ని కాల్చి

బూడిద చేయకుండా, పాతిపెట్టి మట్టిలో కలసి పోకుండా కాపాడేవారు. ఆ శరీరాల్నే 'మమ్మీ'లంటాం. చనిపోయిన వారి శరీరాల్ని కోసి శుద్ధిచేసి పసర్లు పూసి, ద్రావకాల్లో నానబెట్టి, ఎండబెట్టే ప్రక్రియ అక్కడ సర్వ సాధారణం. కాబట్టి మానవ శరీరంలోపలి అవయవాలూ, వాటి స్థానాలు – వారికి బాగా తెలుసు. ఇలా శరీరాల్ని కోసే అలవాటే శస్త్ర చికిత్సకు దారి తీసింది.

**వేదంలో వైద్యం:**

వేదకాలంలో ఆర్యులకు అగ్ని ప్రధాన ఆరాధకుడు. ఈ అగ్ని తమ ఆత్మల్ని 'దేవలోకం చేర్చగలడు' అని రుగ్వేద ప్రజలు నమ్మారు. అందుకే ఇక్కడ శవ దహనాలు వచ్చాయి. పైగా వేదకాల రుషులకి ఆత్మలు తిరిగి వస్తాయనే నమ్మకం లేదు. అవి వెళ్ళిపోయి దేవలోకంలోనే ఉండిపోతాయనేది వారి విశ్వాసం. కాబట్టి, శరీర అంతర్గత అవయవాల అధ్యయనం ఇక్కడ సాధ్యం కాలేదు. అందుకే ఔషధాల చికిత్సలకే ఇక్కడి వైద్యం పరిమితమై పోయింది.

రుగ్వేదంలో కనిపించే దేవ వైద్యులు అశ్వినీకుమారులు. వీరు మనుషులకూ, పశువులకూ, పంటలకూ వైద్యం చేసినట్లుంది. ఆనాడు ఆర్య జాతుల్లో ఉన్న కుష్ఠు, క్షయ, పాండురోగాలకి వీరు ప్రధానంగా చికిత్స చేసి నివారించినట్లుంది. దృష్టి దోషాలకు, సంతానలేమికి కూడా చికిత్స చేశారు. కృత్రిమంగా నడవడానికి ఇనుము, చెక్కలతో కాళ్లు అమర్చారు. అశ్వినులు కాకుండా, ధన్వంతరి, చ్యవనుడు, అధర్వణుడు,ఆత్రేయుడు, యక్ష్మనాశకుడు అనే వైద్యుల ప్రస్థావనలూ, వారు చెప్పిన సూక్తాలూ రుగ్వేదంలో ఉన్నాయి. రుగ్వేద కాలంలో నాటి వైదిక రుషులు రోగాలకి మందుల్నే వాడారు. కానీ, యజుర్వేదకాలానికి మందులతోపాటు 'మంత్రాల్ని' ఉపయోగించిన విధానం వచ్చింది. అంటే వైద్యం గాడి తప్పిందన్నమాట. రుగ్వేదంలో లేని 'జలవైద్యం' ప్రత్యేకంగా యజుర్వేదంలో (శుక్ల యజుర్వేదం 4-12,13) కనిపిస్తుంది. కంటి చూపుకి, చర్మ రోగాలు పోవడానికీ మంత్రాలు వచ్చిపడ్డాయి.

ఔషధాల నుండి 'ఆం...హ్రీం' లకు చేరాక, ఇక వైద్య వికాసం ఏమంటుంది? రుగ్వేద కాలానికి కాస్తో కూస్తో ఉన్న వైద్యం కాస్తా యజర్వేద చివరి కాలానికి తిరోగమనం పాలైంది.

ఇలా...యజ్ఞయాగాలూ, మాయలూ, మంత్రాలతో ఈ దేశం కునారిల్లుతున్న సమయంలో క్రీ.పూ. ఆరో శతాబ్దంలో బుద్ధుడు పుట్టాడు.దాదాపు అదే సమయంలో – ఒక వైద్యుడూ పుట్టాడు. ఆయనే జీవకుడు.

**జీవకుని జననం- వైద్యాభ్యాసం:**

జీవకుని కథ – బుద్ధుని నిర్వాణానంతరం 100రోజుల్లో కూర్చబడిన బౌద్ధ పిటకాల్లోని మొదటి పిటకమైన వినయపిటకంలో, జాతక కథల్లో, ఇంకా అనేక చోట్ల ఉంది. అలాగే 11వ శతాబ్దికి చెందిన సోమదేవుడు రాసిన కథాసరిత్సాగరం అనే సంస్కృత గ్రంథంలో కూడా ఉంది.

ఆ రోజుల్లోని గణ సమాజాల్లో రాజనర్తకి, రాజవేశ్యల్లాంటి ఒక సంప్రదాయం ఉండేది. అలాంటి వారిలో 'గణిక' లు ఒకరు. బౌద్ధ ధార్మికుల్లో ఒకరైన 'ఆమ్రపాలి' వైశాలికి చెందిన గణిక. ఆమ్రపాలి లాంటి అందగత్తెను తామూ గణికగా నియమించాలనుకుని రాజగృహకు చెందిన మగధరాజు బింబిసారుడు సాలవతి అనే ఆమెను నియమించాడు. ఒక్కో రాత్రికి ఆమెకు వంద కార్షాపణలు (నాణేలు)చెల్లించి ఆ రాత్రి ఆమెతో గడపడం ఆ రోజుల్లో క్షత్రియ వంశాలవారు చాలా గౌరవంగా భావించేవారు. (ఈ వ్యవస్థను బుద్ధుడు తీవ్రంగా వ్యతిరేకించాడు)

గణిక సాలవతికి గర్భం వచ్చింది. తనకి గర్భం వచ్చిందని తెలిస్తే తన విలువ పడిపోతుందని అనుకొని, ఈ విషయాన్ని రహస్యంగా ఉంచింది. అనారోగ్యం పేరుచెప్పి తన ఇల్లు దాటి బైటకు రాకుండా గడిపింది. నెలలు నిండాక ప్రసవించింది. తెల్లారక ముందే తన దాసిని పిలిచి –

"ఈ బిడ్డను చేటలో పెట్టి, ఊరి చివరనున్న చెత్తకుప్పలో పడేసిరా" అని ఇచ్చి పంపింది.

ఆ దాసి అలాగే చేసింది.

ఆ రోజు ఉదయం ఆ దారిలోంచి వస్తున్న రాచ కుటుంబానికి చెందిన కుమార అభయునికి ఆ బిడ్డ ఏడ్పు వినిపించింది. రథం ఆపి, సారథిని పంపి చూడమన్నాడు. కాకులు మూగి పొడుస్తున్న చంటిబిడ్డ కన్పించాడు. ఆ బిడ్డను తెచ్చి కుమార అభయునికి ఇచ్చాడు. 'వళ్లంతా రక్తంతో తడిసిన బిడ్డని చూసి –

"ఇతను జీవితుడేనా?" అని అడిగాడు.

"రాజా! జీవించే ఉన్నాడు" అన్నాడు సారథి.

"అయితే...ఇతను జీవకుడు" – అని, ఆ బిడ్డని తెచ్చుకుని, తనే పెంచి పెద్ద చేశాడు.ఆ బిడ్డే జీవకుడు.ఇతని పూర్తిపేరు జీవక కుమార బత్త. జీవకుడు విద్యాభ్యాసం కోసం తక్షశిలకు వెళ్ళాడు. ఒక ప్రసిద్ధ వైద్యాచార్యుని దగ్గర చేరి విద్యనభ్యసించాడు. విద్యాభ్యాసం పూర్తయింది.

ఒకరోజు గురువు తన శిష్యులందర్నీ పిలిచి "ఈ తక్షశిల పరిసర ప్రాంతాల్లో ఒక యోజన దూరం గాలించి వైద్యానికి పనికిరాని ఒక మొక్కల్ని తెచ్చి, నాకు గురుదక్షిణగా ఇవ్వండి" అని చెప్పి పంపాడు.

వెళ్ళిన శిష్యుల్లో దాదాపు అందరూ ఏవేవో కొన్ని మొక్కలు మోపుకట్టుకుని తెచ్చారు.

ఎంతకూ జీవకుడు రాలేదు. చూసి చూసి గురువు గారే శిష్యుణ్ణి వెతుక్కుంటూ వెళ్ళాడు . చివరికి ఒకచోట విషణ్ణవదనంతో కూర్చొన్న జీవకుడు కనిపించాడు. గురువుగారు కారణం అడిగాడు.

"గురుదేవా! క్షమించండి. నేను మీ వద్ద విద్యను సరిగా అభ్యసించలేక పోయాను. వైద్యానికి పనికిరాని ఒక్క మొక్కనీ వెతికి పట్టుకోలేక పోయాను. క్షమించండి" అంటూ పాదాలమీద పడ్డాడు.

గురువు కళ్ళవెంట ఆనంద బాష్పాలు రాలాయి. జీవకుణ్ణి లేపి–

"నాయనా! నీవు వైద్యంలో పరిపూర్ణుడవు. నీకిక తిరుగులేదు. ఇక నీకు బోధించే విద్య నాదగ్గర లేదు. పద వెళ్దాం" అని తక్షశిలకు తీసుకువచ్చి దారి బత్తెంగా కొంత సొమ్ము ఇచ్చి పంపాడు.



జీవకుడు (ఊహాచిత్రం)

**జీవకుని వైద్యం:**

జీవకుడు రాజగృహకు తిరుగు ప్రయాణమయ్యాడు. గురువు గారిచ్చిన సొమ్ము సాకేత్‌వరకూ (పాకిస్తాన్‌లోని సాహేత్ మహేత్) సరిపోయింది. ఆ తర్వాత చాలా దూరం పోవాలి? ఎలా? అనుకొన్నాడు. ఆ సాకేత్ నగరంలో ఒక పెద్ద వ్యాపారి భార్య ఎన్నో ఏళ్లుగా తలనొప్పితో బాధపడుతుందని తెలిసింది. అక్కడికి వెళ్ళాడు జీవకుడు. వైద్యం చేస్తానని చెప్పాడు.

"ఇప్పటికే ఎందరో వైద్యులు ప్రయత్నించారు. వందల, వేల బంగారు నాణేలు తీసుకు పోయారు" అంది వ్యాపారి భార్య.

"ముందుగా సొమ్ము వద్దు. తగ్గితేనే ఇవ్వండి" అన్నాడు జీవకుడు.

'ఎందరో పెద్దపెద్ద వైద్యుల వశం గాని రోగాన్ని ఈ కుర్రవాడు ఏం బాగు చేయగలడు' అనుకున్నారు. చివరికి ఒప్పుకున్నారు.

జీవకుడు నేతితో కొన్న మూలికల్ని ఉడికించి, ఆమె ముక్కు రంధ్రాల్లో పోసి, దాన్ని నోటిలోంచి బైటకు ఉమ్మివేయించాడు. దానితో ఏడేళ్ళ నుండి పట్టి పీడిస్తున్న శిరోవేదన సమసి పోయింది.

దానితో వ్యాపారి భార్య నాలుగువేలు, అతని కుమారుడు నాలుగువేలు, వారి కోడలు నాలుగు వేలు ఇచ్చారు. వ్యాపారి నాలుగు వేలతో పాటు ఒక రథాన్ని, ఒక దాసిని, ఒక దాసుణ్ణి ఇచ్చి పంపాడు.

వాటితో జీవకుడు రాజగృహ చేరి, తనను పెంచిన తండ్రి అభయ రాకుమారుని దగ్గరకు పోయి, "తండ్రీ! ఇది నా మొదటి సంపాదన" అని వాటిని సమర్పించాడు.

'కుమార జీవకా! ఇవి నీవే ఉంచుకో. ఈ ప్రదేశంలో ఇల్లు కట్టుకో" అని చెప్పాడు.

ఆ సమయంలో మగధరాజు బింబిసారునికి భగంధర రోగం (ఫిస్టులా) పట్టుకుంది. పంచె రక్తంతో తడిసిపోతోంది. జీవకుడు ఒకే ఒక్క లేపనం ఇచ్చి ఆ రోగం కుదిర్చాడు. రాజు వేల కొలదీ బంగారాన్ని ఇవ్వగా జీవకుడు స్వీకరించలేదు. జీవకుని కోరిక మేరకు – ఆస్థాన వైద్యునిగా, బుద్ధుని భిక్షు సంఘ వైద్యునిగా నియమించాడు బింబిసారుడు.

అలా జీవకుడు చివరికి బుద్ధునికి వ్యక్తిగత వైద్యునిగా, బౌద్ధునిగా మారాడు.

**తొలి శస్త్ర చికిత్స:**

ఆ రోజుల్లో రాజగృహ నగరంలో, ఒక ధనమంతుడైన శ్రేష్ఠికి తలనొప్పి పట్టుకుంది. ఎందరు చికిత్స చేసినా ఉపయోగం లేదు. చివరికి ఒక మహా వైద్యుడు చూసి ,పరీక్షించి– "ఈ శ్రేష్ఠి ఏడు రోజుల్లో చనిపోతాడు" అని చెప్పాడు. ఈ విషయం తెలిసిన శ్రేష్ఠి స్నేహితుడు ఒకడు రాజు బింబసారుని దగ్గరకు వచ్చి, విషయం చెప్పి 'మహారాజా! నా మిత్రుడు శ్రేష్టికి రాజవైద్యుడు జీవకునితో వైద్యం చేయించండి " అని వేడుకున్నాడు. రాజు అంగీకరించి జీవకుణ్ణి రోగి దగ్గరకు పంపాడు.

జీవకుడు వెళ్ళి రోగిని పరిశీలించి , ఆ శ్రేష్ఠిని ఒక మంచానికి గట్టిగా కట్టేయించాడు. సారాయి బాగా తాగించాడు. అతని తలకు శస్త్ర చికిత్స చేసి, రెండు క్రిముల్ని బైటకు తీసి, తలకు కట్టు కట్టాడు. మూడు వారాల తరువాత తలకు కట్టిన కట్లు విప్పాడు. అలా రోగాన్ని నయం చేశాడు. ఆ శ్రేష్ఠి రెండు లక్షల బంగారు నాణేలు ఇచ్చాడు.

ఆ తర్వాత వారణాసికి చెందిన ఒక వ్యాపారి కుమారునికి పొట్టకు శస్త్ర చికిత్స చేసి, కడుపులో మెలికపడిన ప్రేగుల్ని మెలికలు తీసి, వాటిని సరిచేసి, పొట్టను కుట్టి రోగం కుదిర్చాడు.

ఇక్కడ చెప్పిన ఈ రెండు శస్త్ర చికిత్సలు కథలు కాదు. జీవకునికి ఎంత సొమ్ము వచ్చింది? అనేదీ లెక్క కాదు. వీటి ప్రత్యేకత ఏమిటి...

ఈ దేశచరిత్రలో నమోదైన మొట్టమొదటి శస్త్ర చికిత్సలు ఇవి.

ఇవేకాక ఇంకా జీవకుడు చేసిన వైద్య ప్రక్రియలు, వాడిన ఔషధాలు అన్నీ త్రిపిటకాల్లో మొదటిదైన వినయ పిటకంలో నమోదయ్యాయి.

వినయ పిటకంలోని మహావగ్గలోని చివరి స్కంధంలో జీవకుని వృత్తాంతం ఉంది. అందులో రికార్డయిన శస్త్ర చికిత్సలే ఈ రెండూ –

రోగిని మంచానికి గట్టిగా కట్టేసి, మత్తు మందుగా సారాయిని తాగించడం అనేది తొలినాళ్ళలో శస్త్ర చికిత్స కారులందరూ చేసిన ప్రక్రియే. ఈజిప్టులో కూడా ఇలానే చేసేవారు. అప్పుడే కాదు దాదాపు 1830లో జర్మనీ వైద్యుడు (ఫార్మాసిస్టు) మోల్డెన్ హావర్ క్లోరోఫాం కనిపెట్టేవరకూ మత్తు మందుగా సారాయినే వాడేవారు.బౌద్ధంలోని పంచశీలలో సారాయి సేవించడం నిషేధం. కానీ, వైద్యం కోసం సేవించడం దోషం కాదు.

జీవకుడు తక్షశిలలో విద్యాభ్యాసం చేయడం వల్ల శస్త్ర చికిత్సకుడు కాగలిగాడు. ఆనాడు తక్షశిల ప్రపంచంలోనే గొప్ప విశ్వవిద్యాలయం. అక్కడికి గ్రీకు, మెసపుటోమియ, ఈజిప్టు, చైనా దేశాల్నుంచి విద్యార్థులు వచ్చేవారు. జీవకుడు ఈ విధానం ఈజిప్టు, గ్రీకుల నుండి నేర్చుకొని ఉండొచ్చు.

**శవాల్ని భద్రపరచడం మహిమ కాదు:**

అలాగే మరణించిన వారి దేహాల్ని భద్రపరచడం. ఇది కూడా బౌద్ధులకు తెలుసు. బుద్ధుడు మల్ల గణతంత్ర రాజధాని కుసీనగర్‌లో మహా పరినిర్వాణం పొందాడు. బుద్ధుని పార్థివదేహానికి ఎక్కడ

అంత్యక్రియలు జరగాలి? అనే విషయంలో కోసల, మగధ, మల్ల, లిచ్ఛవీ,శాక్య, కొలియ రాజ్యాల మధ్య వివాదం చెలరేగింది. పైగా బుద్ధుని తర్వాత అంతటివాడైన మహా కాశ్యపుడు అప్పుడు అక్కడ లేడు. కాబట్టి బుద్ధుని దేహానికి వెంటనే అంత్యక్రియలు జరపడం కుదరలేదు. బుద్ధుని దేహాన్ని 500 అడుగుల పలుచటి పొడవైన గుడ్డలతో(నవ్వారు లాంటి చారెడు వెడల్పు ఉన్న గుడ్డ) చుట్టారు. ఆ గుడ్డని కొన్ని నూనెలతో, ఆకు పసర్లతో, ద్రావకాలతో తడిపారు. శరీరానికి కొన్ని లేపనాలు పూశారు. పెద్ద మట్టితొట్టెను నూనెతో నింపి ఆ నూనెలో గుడ్డ చుట్టిన దేహం మునిగేలా ఉంచారు. అలా వారంరోజులు ఉంచారు. ఆ తరువాత ఆ దేహాన్ని నూనె నుండి తీసి చితిపై గుడ్డ చుట్టతో పాటు ఉంచారు. ఎనిమిదో రోజున వచ్చిన మహా కాశ్యపుడు బుద్ధుని పాదాలవద్ద ఉన్న గుడ్డను కొద్దిగా తొలగించి, తల మోడ్చి నమస్కరించి చితిని వెలిగించాడు. బుద్ధుని శరీరం దహనమైంది. కానీ ఆయన దేహాన్నిచుట్టి ఉంచిన వస్త్రంపొరలు పూర్తిగా తగలబడి బూడిదకాలేదు. ఆ పొరల కోశం లోపల మిగిలిన బుద్ధుని అస్థికల్ని ఆ తర్వాత ఏడుగురు రాజులు, ద్రోణుడనే పండితుడు పంచుకున్నారు. కొలియులు బూడిదనే తీసుకున్నారు. ఆ అస్థికలపై వారు స్థూపాల్ని నిర్మించారు. వాటిలో ఈ నాటికీ నిలచిఉన్న మట్టి స్థూపం వైశాలిలో ఉంది. ఆ స్థూపాలలోని అస్థికలతో ఆ తర్వాత అశోకుడు 84000 స్థూపాలు దేశ విదేశాలలో నిర్మించాడంటారు. అది వేరే సంగతి. కానీ ఇక్కడ గమనించాల్సిన విషయం పార్థివ దేహాన్ని భద్రపరచే అంశం. అది బుద్ధుని విషయంలో నమోదైన అంశం.

ఇలా భద్రపరచే ప్రక్రియలు ఈజిప్టు వారికి తెలుసు.వారు కూడా దేహాల్ని నూనెలు పూసిన గుడ్డలతో చుట్టి నూనె తొట్టెల్లో భద్రపరచి, తొట్టెపై మూత గట్టిగా బిగిస్తారు.ఆ గుడ్డకోశం లోపల ఎండిపోయిన దేహం, ఎముకలు మిగులుతాయి. ఇంగ్లీషు సినిమా 'మమ్మీ'లో ఈ ప్రక్రియలు ఉంటాయి. ఈ ద్రావకాలుగా బొగ్గునూనె (వార్నీషు), గుగ్గిలం, దేవదారు కలప రసం, కల్లు నుండి తీసిన నీరా ఉపయోగిస్తారు. గుగ్గిలం, నీరాలు బాక్టీరియా నాశకాలు. బరానీ గింజలు నూరి నిమ్మరసంలో రంగరించిన లేపనాల్ని సోడియంక్లోరైడ్ (రాతి ఉప్పు), సోడియం కార్బొనేట్, సోడియం బైకార్బొనేట్ (చాకలిసోడా)లతో కలుపుతారు.

బుద్ధుని దేహం విషయంలో జరిగింది ఇదే విధానం. ఉప్పులో తడిపి ఎండబెట్టిన గుడ్డ కట్టెల నిప్పులో తగలబడదు. ఉప్పు గుడ్డ తగలబడాలంటే 800 సెంటీగ్రేడ్ డిగ్రీల ఉష్ణం కావాలి. కట్టెల్లో తుమ్మ, సరివి లాంటి బలమైన కట్టెల ఉష్ణం 200 డిగ్రీల సెంటీగ్రేడ్‌లకు దాటదు. అందుకే బుద్ధుని శరీరానికి చుట్టిన వస్త్రంపొరలు తగలబడలేదు. ఇది మహిమకాదు.

బుద్ధుని అంతిమ సంస్కారాల సమయంలో ఇవన్నీ జీవకుడు చేశాడో లేదో? అసలు అప్పటికి జీవకుడు బ్రతికున్నాడా లేదా? అన్నది తెలియదు. కానీ , భిక్షువులే ఈ భద్రపరచే ప్రక్రియ చేశారన్నది వాస్తవం.

**తొలి ప్లాస్టిక్ సర్జరీ:**

ఇక, ప్రత్యేకంగా మరొక్క విషయం తెలుసుకోవాలి. బుద్ధునికి విరేచనాలు, మలబద్ధకం, వాంతులు లాంటి శారీరక రుగ్మతల విషయంలో జీవకుడు వైద్యం చేసినట్లుంది. అవి కాక, మరో ముఖ్యమైన చికిత్స ఉంది. అదే ఇప్పుడు చెప్పుకునేది.

బౌద్ధ సంఘం నుండి దేవదత్తుడు వేరుపడి పోయి, బింబిసారుని కుమారుడైన అజాతశత్రు పంచన చేరి బుద్ధుణ్ణి మీద ఎన్నో అపనిందలు మోపాడు. చివరికి అజాతశత్రు నిజం తెలుసుకుని బుద్ధునికి చేరువయ్యాడు. దేవదత్తుణ్ణి దూరం పెట్టాడు. దీనితో దేవదత్తుడు బుద్ధుణ్ణి హత్య చేయించాలని కొన్ని పథకాలు పన్నాడు. వాటి నుండి బుద్ధుడు బైటపడ్డాడు.

**ఆ పథకాల్లో ఒకటి –**

బుద్ధుడు ఒక కొండ మార్గంలో పోతున్నప్పుడు పై నుండి బండరాళ్ళు దొర్లించి బుద్ధుణ్ణి చంపడం. రాయి దొర్లిపడి వచ్చింది. ఆ రాయిలోని ఒక ముక్క బంతిగా లేచి వచ్చి బుద్ధుణ్ణి కాలికి తగిలింది. కాలి ఎముక విరిగి, కాలు నజ్జు నజ్జు అయ్యింది.దీనికి జీవకుడు వైద్యం చేశాడు.

విరిగిన ఎముకల్ని సరిచేసి, చీలిపోయి, చెల్లా చెదురైన మాంసాన్ని సరిచేసి కుట్టి, మరలా మామూలు చర్మం రంగులోకి వచ్చేలా చర్మాన్ని ఆ ప్రక్కగానే మరో చోటునుండి తీసి తాపడం చేసి కుట్టి కట్టు కట్టాడు. ఈ విధానంలో ఎముకల వైద్యంతో పాటు, ప్లాస్టిక్ సర్జరీ (మాంసంపై చర్మాన్ని కప్పి అతికించడం) కూడా ఉంది.

ఈ దేశ వైద్య చరిత్రలో నమోదైన తొలి ప్లాస్టిక్ సర్జరీ కూడా ఇదే కావొచ్చు! ఇలా జీవకుడు ఈ దేశ తొలి శస్త్ర చికిత్సకుడు – బౌద్ధుడు.

జీవకుడు బౌద్ధం స్వీకరించాడు. తన యావదాస్తినీ బౌద్ధ సంఘానికి దానం చేశాడు. జీవితాంతం బుద్ధుని వెంటే నడిచాడు. దానికి కారణం బుద్ధుడు వైద్య విధానాన్ని ప్రోత్సహించడమే! ప్రతి బౌద్ధ భిక్షువూ కొంత వైద్యం తప్పనిసరిగా నేర్చుకోవాలని చెప్పాడు బుద్ధుడు. నేర్పాడు కూడా. అందుకే బుద్ధుణ్ణి "భైషజ్య గురువు" అంటారు. బౌద్ధంలో 18 రకాల వైద్య పద్ధతులు ఉన్నాయి. మూలికా వైద్యం, కషాయం, ఆకులు, పండ్లు, లవణ వైద్యం, పచ్చిమాంస వైద్యం, రక్తం, నస్యం, సొమ్రాణి, మద్యం, ఆవిరి స్నానం, శరీర మర్దనం, మలాం పట్టీలు, విషాలు, విరుగుళ్ళు, లేపనాలు, హిప్నాటిజం, శస్త్ర చికిత్సలు – ఇవీ ఆ పద్దెనిమిది ప్రక్రియలు.

వాటి వివరాలు వచ్చే సంచికలో చూద్దాం!

భాష లేకపోతే భావం లేదు ; నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది

సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడలేరు

గుండె లోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేదీ 'అమ్మనుడి'లోనే

చలసాని నరేంద్ర
9849569050

# బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలి పోవడానికి సిద్ధమా ?!

***ప్రధాని మోడీ ఇటువంటి తీవ్ర చర్యలకు సాహసింప గలరా ? జరిగిన కుంభకోణాలపై ప్రభుత్వంపై నిందలు మోయడంతో కాలం గడపకుండా రాహుల్ గాంధీ, ఇతర నాయకులు ఇటువంటి తీవ్ర చర్యలను సూచించగలరా ? ముందుగా బిజెపి ప్రభుత్వాలలో ఉన్న మంత్రులు, పార్టీ పదాధికారుల ఎవ్వరు బ్యాంకులకు బకాయిలు చెలించకుండా, మొండి బకాయిదారులుగా ఉండరాదని రెండు, మూడు నెలల గడువు ఇవ్వండి. ఈ లోగా బకాయలు చెల్లించని పక్షంలో వారి పదవులు ఉండవని స్పష్టం చేయండి. వచ్చే ఎన్నికలలో అటువంటి వారికి పార్టీ టికెట్ లే కాకుండా, నామినేటెడ్ పోస్ట్ లు కూడా ప్రభుత్వంలో ఉండబోవని స్పష్టం చేయండి.***

రూ 9 వేల కోట్ల మేరకు బ్యాంకు రుణాలను చెల్లించకుండా దేశం నుండి పరారైన విజయ్ మాల్యా ఉదంతం కనుమరుగు కాకముందే మరో ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు రూ 11,500 కోట్ల మేరకు టోపీ పెట్టి సంపన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ దేశం విడిచి వెళ్లిపోవడం సంచలనం కల్గించింది. ఆ తరువాత మరో రెండు బ్యాంకులకు ఘరానా వ్యక్తులు టోపీ పెట్టిన ఉదంతాలు సహితం వెలుగులోకి వచ్చాయి.

అప్పుడప్పుడు ఇటువంటి ఒకటో, రెండో సంఘటనలు సంచల నాలు కలిగిస్తున్నా అవేమీ పొరపాటున జరుగుతున్న సంఘటనలు మాత్రం కాకపోవడం గమనార్హం. మొత్తం భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ మనుగడే ఇప్పుడు ప్రశ్నార్ధకరంగా మారింది. ప్రభుత్వం జాగ్రత్తపడి కఠినమైన చర్యలు తీసుకోని పక్షంలో మొత్తం బాంకింగ్ వ్యవస్థ కుప్పకూలి పోవడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం అవుతున్నది.

ఈ సందర్భంగా పారిశ్రామిక మండలి అసోచామ్ జారీచేసిన ప్రకటన మరింతగా ఆందోళన కలిగిస్తున్నది. ఘరానా కార్పొరేట్ అధినే తలు బ్యాంకులకు భారీస్థాయిలో టోపీ పెట్టడాన్ని అసలు ఖండించకుండా ఇటువంటి ఆర్ధిక నేరాలను అరికట్టడానికి ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరణ చేయడమే మార్గం అన్నట్లుగా 'ఉచిత సలహా' దేశ ప్రజలకు ఇచ్చింది. అంటే వారి దృష్టిలో ప్రైవేట్ బ్యాంకులు ఎంతో నిజాయతీతో పనిచేస్తున్నాయి అన్నమాట. కారణాలు ఏవైనా స్వతంత్ర భారత దేశంలో మూతపడినన్ని ప్రైవేట్ బ్యాంకులతో పోల్చుకొంటె ప్రభుత్వ రంగ బ్యాంకులు ఎంతో మేలని చెప్పక తప్పదు. లక్షలాదిమంది ప్రజలకు టోపీ పెట్టడంలో ప్రైవేట్ బ్యాంకులే పోటీ పడుతూ వస్తున్నాయి.

1948 నుండి 1968 వరకు 736 ప్రైవేట్ బ్యాంకులు భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడి, పని చేయలేని పరిస్థితులలో విలీనం కావడమో, మూసి వేయడమే జరిగింది. అంటే ఒక విధంగా దివాళా తీసినట్లే అని చెప్పవచ్చు. బ్యాంకులు జాతీయకరణ జరిగిన ఆ తరువాత కాలంలో సహితం అనేక ప్రైవేట్ బ్యాంకుల కుంభకోణాలు చూసాము. టైమ్స్ బ్యాంకు, గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు, సాంగ్లీ బ్యాంకు వంటి 36 బ్యాంకులు కాలగర్భంలో కలసి పోయాయి. ప్రైవేట్ బ్యాంకులు అంత సమర్ధవంతంగా పనిచేస్తూ ఉంటే ఇటువంటి పరిస్థితి ఎందుకు ఏర్పడింది ? వీటిల్లో అత్యధికంగా ప్రభుత్వ బ్యాంకు లతో విలీనం కావడం గమనార్హం.

ఈ బ్యాంకులకు వసూలు కాని రుణాలు అన్ని కార్పొరేట్‌లు, ప్రైవేట్ కంపెనీలు, భారీ ఆర్ధిక నేరస్థులకు చెందినవే. సాధారణ పౌరులు, చిన్న చిన్న వ్యాపారులు ఎవ్వరూ లేనే లేరు. ఈ మధ్యనే పెద్ద నోట్ల రద్దు సందర్భంగా కొత్త నోట్లలో సింహ భాగాన్ని కైవసం చేసుకొని, పెద్ద సంఖ్యలో నల్ల బజారుకు చెల్లించడంలో, నల్ల డబ్బును తెలుపు చేయడంలో ఒకటి, రెండు ప్రైవేట్ బ్యాంకులు కీలక పాత్ర వహించినట్లు కథనాలు వచ్చాయి. అయితే అటువంటి ఆరోపణలపై దర్యాప్తు చేయగల ధైర్యం మన ప్రభుత్వాలకు ఉన్నట్లు చెప్పలేము.

అసలు కొత్త నోట్లు ప్రభుత్వ ముద్రణ సంస్థల నుండే భారీ సంఖ్యలో ఆర్ధిక నేరస్థుల ఇళ్లకు చేరినట్లు పలు చోట్ల బైట పడినా ఒక్కరిపై కూడా కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేనే లేవు. పలువురు అధికార పక్షానికి చెందిన సీనియర్ నాయకులు, కీలక పదవులలో ఉన్న రాజకీయ నాయ కులు, ఉన్నత ప్రభుత్వ అధికారులు-వారి కుటుంబం సభ్యులు పాతనోట్లకు కొత్త నోట్లను కమీషన్ లకు అమ్ముకోవడం బహిరంగ రహస్యమే. అటువంటి కథనాలపై దర్యాప్తు చేయగల ధైర్యం అవినీతి పొడ గిట్టదని చెప్పుకొనే ప్రధాని నరేంద్ర మోడీకి ఉందని భావించలేము.

ఈ దేశంలో పేరుపొందిన 'ఆర్ధిక నేరస్థులు' కీలక పదవులలో ఉన్న రాజకీయ నాయకులు, ప్రముఖ రాజకీయ పక్షాల నాయకులు, ప్రభుత్వాలలో ఉన్నత అధికారులకు సన్నిహితంగా ఉంటూ ఉండడంతో వారిపై చట్టబద్ధంగా చర్య తీసుకోవడం సాధ్యం కావడం లేదు.

స్వయంగా ప్రధాని మోడీ వంటి వారే అసలు యుద్ధ విమాన ఉత్పత్తిలో ఏమాత్రం అనుభవంలేని ప్రముఖ పారిశ్రామికవేత్తను ఫ్రాన్స్‌కు తీసుకువెళ్లి, ప్రభుత్వరంగ సంస్థతో ఒప్పందంకోసం కొద్ది సంవత్సరాలుగా జరుగుతున్న రఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందాన్ని ఆ ప్రైవేట్ సంస్థతో చూపించడం చూసాము. ఈ దేశంలో ఆర్ధిక నేరాలకు పాల్పడు తున్న కార్పొరేట్ ప్రముఖులు ప్రభుత్వాలను, వాటి విధానాలను నియంత్రిస్తున్న సమయంలో బ్యాంకులలో డబ్బు వేసుకోవడం భద్రంగా ఉంటుందని ఈ దేశ పౌరులు భావించడం లేదు.

డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం కోసం స్వయంగా ప్రజలను చేతిలో నగదును పెద్ద ఎత్తున ఉంచుకోవద్దని, డిజిటల్ లావాదేవీలకు పాల్పడమని ప్రోత్సాహించే ప్రయత్నం చేస్తున్నా గత కొంత కాలంగా ప్రజలు పెద్ద సంఖ్యలో బ్యాంకు లలో ఉన్న తమ డిపాజిట్‌లను తీసివేసుకొంటున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. దానితో బ్యాంకు లు, వాటి ఏటియంలు నగదులేక బోసిపోతున్నాయి. దేశంలో ముంచు కొస్తున్న తీవ్రమైన ఆర్ధిక సంక్షోభాలకు ఇటువంటి పరిస్థితులు అద్దం పడుతున్నట్లు గమనించాలి.

దేశంలో ఎటువంటి ఆర్థిక కుంభకోణం వెలుగులోకి వచ్చినా దాని మూలం కాంగ్రెస్ పాలనలోనే ఉన్నదని, ఆ పాపం చేసినది యుపిఎ ప్రభుత్వమే అని బిజెపి నాయకులు పోటీపడి విమర్శలు గుప్పించడంలో మునిగిపోతున్నారు. అప్పుడు జరిగితే నాలుగేళ్లుగా మోడీ ప్రభుత్వం ఏమి చేస్తున్నదట ! వీరే గదా సహకరించి, నేరానికి పాల్పడేటట్లు చేసి, వారిని దేశం నుండి 'సురక్షితంగా' విదేశాలకు పారిపోయేటట్లు చేసినది అంటూ కాంగ్రెస్ నాయకులు ప్రత్యారోపణలు చేస్తున్నారు.

ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయ ప్రయోజనాలు పొందే ప్రయత్నాలు చేస్తూ ఉండడమే గాని అసలు ఆర్థిక నేరాలకు కళ్లెం వేయడం ఎట్లాగో దృష్టిసారించే ప్రయత్నం ఎవ్వరు చేయడం లేదు. ఆర్థిక నేరస్థులను సామాజికంగా వెలివేసే ప్రయత్నం ఉమ్మడిగా చేసే ఆలోచనలు చేయకపోవడం దురదృష్టకరం.

ఉదాహరణకు విజయ్ మాల్యా మొదటి సారి రాజ్యసభకు కాంగ్రెస్ మద్దతుతో ఎన్నికైనట్లు బిజెపి ఆరోపిస్తుంటే, ఆ సమయంలో బిజెపి సహితం అతనికి మిగులు ఓట్లు వేయడమే కాదు, రెండోసారి బహిరంగం గానే మద్దతు ప్రకటించింది. విజయ మాల్యా విమానాలను సొంత కారుల వలె ఉపయోగించుకొని ఉచితంగా చాలామంది బిజెపి ప్రముఖులు అనేకసార్లు ప్రయాణం చేస్తుండేవారు. వెంకయ్యానాయుడు, అరుణ్ జైట్లీ ఇళ్లల్లో తరచు కనిపిస్తూ ఉండేవారు. దేశం విడిచి వెళ్లిపోయే ముందు కూడా వారిద్దరిని కలిసి, వారితో సమాలోచనలు జరిపిన తర్వాతే వెళ్లడం గమనార్హం.

వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో హడావుడిగా జరుపుతున్న 'భాగస్వామ్య సదస్సులు'కు దేశంలోని ఒక డజన్ మంది పారిశ్రామిక వేత్తలు పనికట్టుకొని హాజరవుతున్నారు. ఆయా రాష్ట్రాలలో భారీ పరిశ్రమలు నెలకొల్పుతామని అంటూ ప్రభుత్వాలతో ఎన్నో ఒప్పందాలు చేసుకొంటున్నారు. వాటిని చూసి చిరునవ్వులతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విలువైన భూములను చౌక ధరకే ఇస్తున్నారు. ఆ భూములను చూపి వారు బ్యాంకుల నుండి భారీ రుణాలు తీసు కొంటున్నారు. వాటిలో అసలు పరిశ్రమలు పెట్టారు, ఆ బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించే ప్రయత్నం చేయడమే లేదు. ఇక ఆ రాష్ట్రంలో ఉపాధి కల్పించడం దేముదెరుగు. ఈ మాటలను స్వయంగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ముఖ్య మంత్రులకు చెబుతున్నారు.

ఆంధ్ర ప్రదేశ్ లోనే కేవలం ముగ్గురు ఘరానా పారిశ్రామిక వేత్తలు బ్యాంకులకు లక్షకోట్ల రూపాయలను టోపీ పెట్టారు. వారిని కనీసం ప్రశ్నించే సాహసం ప్రభుత్వాలు చేయడం లేదు. ఇటువంటి పరిస్థితుల కారణంగా అంతర్జాతీయంగా భారతీయ బ్యాంకుల పట్ల విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఏర్పడింది. అదే జరిగితే ప్రపంచంలో పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా చెప్పుకొంటున్న మన ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఏర్పడుతుంది.

బ్యాంకులలో అంతర్గత పర్యవేక్షణ, ఆడిటింగ్ యంత్రాంగం, రిజర్వు బ్యాంకు పర్యవేక్షణ లోపాలను ఈ ఉదంతాలు బహిర్గతం చేస్తున్నాయని స్వయంగా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలో పెద్ద ఎత్తున జరుగుతున్న రైతుల ఆత్మహత్యలకు ఎక్కువగా తీసుకొన్న అప్పులు చెల్లించక పోవడమే. తీసుకున్న ఒకటి, రెండు లక్షల రూపాయలు చెల్లించక పోవడంతో బ్యాంకుల నుండి ఎదురవుతున్న వత్తిడులు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ఒక్క పారిశ్రామిక వేత్త అయినా ఆ విధంగా ఆత్మహత్య చేసుకున్నారా ? కనీసం అల్లరి అయితే మినహా జైలుకు వెళ్ళారా ? అల్లరి జరిగితే దేశం విడిచి వెళ్లిపోతున్నారు.

తాజా కుంభకోణానికి ఏడేళ్ల క్రితమే పునాది పడినట్లు తెలుస్తోంది. బ్యాంకు ఏటా వార్షిక ఆడిట్‌లు క్రమపద్ధతిలో నిర్వహిస్తున్నప్పటికీ ఈ కుంభకోణానికి ఏడేళ్ల క్రితమే తెరలేచింది. దిగుమతి బిల్లుల పరిష్కారం కోసం అందిన విజ్ఞప్తుల మేరకు చెల్లింపులు చేసిన ఇతర బ్యాంకులకు చెందిన విదేశీ శాఖలు ఇందులోని లోపాలను దీర్ఘకాలంపాటు ఎత్తి చూపలేక పోయాయి. 1.77 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 11వేల కోట్ల పైనా) విలువ చేసే ఈ కుంభకోణంలో మొత్తాలను ముందుగానే వ్యూహా త్మకంగా విదేశాలకు తరలించిన్నట్లు కూడా బ్యాంకు వర్గాలు ధృవీకరించాయి.

అనేక బ్యాంకుల్లోనూ ఈ తరహా మోసం జరిగి ఉండొచ్చని సంకేతాలు వస్తున్నాయి. ఇంత జరిగినా ఈ వ్యవహారంపై ఆ బ్యాంకు స్పష్టమైన ప్రకటన చేయడంలేదు. ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి జైట్లీ స్పందించి ఏమి జరిగిందో చెప్పే సాహసం చేయడం లేదు. రాజకీయ ప్రాపకంతోనే బ్యాంకులను ఇంత పెద్దఎత్తున మోసం చేస్తున్నట్లు స్పష్టం అవుతున్నా, ఆ కోణంలో సిబిఐ, ఇతర దర్యాప్తు సంస్థలు ఎటువంటి గుట్టు రాబట్టే ప్రయత్నం చేయడం లేదు.

ఉదాహరణకు విజయ్ మాల్యాకు సంబంధిత బ్యాంకు అధికారులు భారీ ఋణం ఇవ్వడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేసినా, నాటి బ్యాంకు చైర్మన్ జోక్యంతో ఆ ఋణం మంజూరైనట్లు చెబుతున్నారు. చైర్మన్ ను విచారిస్తే తనకు ఎదురైన రాజకీయ వత్తిడుల గురించి నోరు విప్పే అవకాశం ఉండెడిది. కానీ సీబీఐ అటువంటి ప్రయత్నం చేయనే లేదు. బ్యాంకు లలో విదేశీ లావాదేవీలను పర్యవేక్షించ వలసిన బాధ్యత రిజర్వు బ్యాంకుదే అయినా, దేశంలో బ్యాంకుల యాజమాన్య తీరుతెన్నుల పర్యవేక్షణ బాధ్యత ఆర్థిక శాఖదే. అయితే వీరిద్దరితో సంబంధంలేకుండా బ్యాంకు లు తమ ఇష్టం వచ్చిన్నట్లు వ్యవహరిస్తున్నట్లు ఇప్పుడు భావించ వలసి వస్తున్నది.

బ్యాంకులపై ఆర్‌బిఐ పర్యవేక్షణ తగ్గిపోతూ ఉండడం ఇటువంటి కుంభకోణాలకు ఆస్కారం ఏర్పడుతున్నట్లు కనిపిస్తున్నది. అందుకు కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పించుకోలేదు. గత ఏడు నెలలుగా దేశంలోని బ్యాంకులను పర్యవేక్షించడానికి ఆర్‌బిఐలో పూర్తి స్థాయి డిప్యూటీ గవర్నర్ లేరు. గత జులైలో ఎస్ఎస్ ముద్ర పదవీ విరమణ అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆ పదవిని భర్తీ చేయకుండా అలానే వదిలే సింది.

బ్యాంకులకు వందల కోట్ల రూపాయలు చెల్లించకుండా, కోర్టు కేసులతో కాలక్షేపం చేస్తున్న అనేకమంది స్వయంగా వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులుగా చట్ట సభలకు ఎన్నికై, కొందరు మంత్రి పదవులలో కూడా ఉన్నారు. ప్రముఖ రాజకీయ నాయకులు తమ వద్ద గల నల్లధనాన్ని తెలుపుగా మార్చు కోవడం కోసం తమ కుటుంబం సభ్యుల పేర్లతో నడుపుతున్న ట్రస్ట్ లలో కార్యనిర్వాహక పదవులలో బ్యాంకు లకు టోపీ పెడుతున్నవారే ఎక్కువగా ఉంటున్నారు.

రాజకీయ పార్టీలకు, ఎన్నికలలో అభ్యర్థులకు పుష్కలంగా నిధులు సమకూర్చుతున్నది కూడా వీరే. అంటే ఆర్థిక నేరస్థులకు మన రాజకీయ

వ్యవస్థే ఆశ్రయం కల్పిస్తున్నది. ఈ లొసుగులను అవకాశంగా తీసుకొని బ్యాంకు అధికారులు సహితం విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు.

బ్యాంకు రుణాలను ఎగవేసే వారిని, ఎగవేసే ప్రయత్నం చేసిన వారిని 'ఆర్థిక నేరస్థులు' గా పరిగణించి, ఆర్థిక వ్యవహారాలకు వారిని దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తే గాని మన బ్యాంకింగ్ వ్యవస్థను కాపాడుకోలేదు. తద్వారా మన ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి పోకుండా జాగ్రత్త పడలేము. ఈ సందర్భంగా చైనా ఈ మధ్య తీసుకున్న కొని చర్యలను ప్రధాని నరేంద్ర మోడీ పరిశీలించి, కఠిన నిర్ణయాలు చేపట్టాలి.

**చైనా సుప్రీమ్ పీపుల్స్ కోర్టు 67.3 లక్షల మంది బ్యాంకు రుణాల ఎగవేతదారుల్ని బ్లాక్ లిస్ట్ చేయమని ఆదేశించింది. అటువంటి వారు విమానాల్లో ప్రయాణాలు చేయలేని విధంగా, వారికి కొత్తగా రూపాయి రుణం పుట్టకుండా, చివరకు క్రెడిట్ కార్డులు కూడా పనిచేయకుండా ఆంక్షలు విధించమని ఆదేశించింది. చైనా ప్రభుత్వం ఇప్పటికే 61.5 లక్షల మందిని విమానాల టికెట్లు కూడా కొనకుండా బ్లాక్ లిస్టు చేసింది. 22.2 లక్షల మంది అసలు హైస్పీడ్ ట్రెయిన్లలో ప్రయాణం కూడా చేయకుండా నిషేధించింది.**

**పాస్‌పోర్టులు, ఐడీ కార్డుల ఆధారంగా దీన్ని అమలు చేస్తున్నట్టు సుప్రీమ్ పీపుల్స్ కోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో చీఫ్ మెంగ్ జియాంగ్ చెబుతున్నాడు. 71 వేల మంది ఎగవేతదారులు కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులుగా, ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేయకుండా ఆదేశాలు జారీ చేశారు. 5.5 లక్షల మంది రుణఎగవేతదారుల క్రెడిట్ కార్డుల దరఖాస్తులను ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా చెత్తబుట్టలో పారేసింది.**

**ప్రభుత్వ సిబ్బంది, రాజకీయ సలహా కమిటీల సభ్యులు, స్థానిక లెజిస్లేటివ్ సభ్యులు, చైనా కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్ డెలిగేట్స్ విషయంలోనూ ఎలాంటి మినహాయింపులు ఇవ్వవద్దని సుప్రీం ఆదేశించింది. దీంతో కొందరిని బహిష్కరించారు, కొందరిని డిమోట్ చేశారు. కనీసం పది లక్షల మంది దీంతో బెదిరిపోయి, రుణాలు చెల్లించటానికి సిద్ధపడుతున్నారట.**

ప్రధాని మోడీ ఇటువంటి తీవ్ర చర్యలకు సాహసింప గలరా ? జరిగిన కుంభకోణాలపై ప్రభుత్వంపై నిందలు మోయడంతో కాలం గడపకుండా రాహుల్ గాంధీ, ఇతర నాయకులు ఇటువంటి తీవ్ర చర్యలను సూచించగలరా? ముందుగా బిజెపి ప్రభుత్వాలలో ఉన్న మంత్రులు, పార్టీ పదాధికారుల ఎవ్వరు బ్యాంకులకు బకాయిలు చెల్లించకుండా, మొండి బకాయిదారులుగా ఉండరాదని రెండు, మూడు నెలల గడువు ఇవ్వండి. ఈ లోగా బకాయిలు చెల్లించని పక్షంలో వారి పదవులు ఉండవని స్పష్టం చేయండి. వచ్చే ఎన్నికలలో అటువంటి వారికి పార్టీ టికెట్ లే కాకుండా, నామినేటెడ్ పోస్టులు ప్రభుత్వంలో ఉండబోవని స్పష్టం చేయండి.

దేశంలో బ్యాంకులలో రూ 50 లక్షల కోట్లకు పైగా వసూలు కానీ బకాయిలు పేరుకుపోయిన్నట్లు అనధికార కథనాలు తెలుపు తున్నాయి. అయితే బ్యాంకులు, ప్రభుత్వం కూడా వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇటువంటి కఠిన చర్యల ద్వారా మాత్రమే ప్రధాని క్రుంగి పోవడానికి సిద్ధపడుతున్న మన ఆర్థిక వ్యవస్థను కాపాడ గలరని గ్రహించాలి. మౌనం వీడాలి. తన నిజాయతీని 'ఎంపిక చేసిన' రాజకీయ ప్రత్యర్థులపై కాకుండా మొత్తం వ్యవస్థను సంస్కరించడంలో ప్రదర్శించాలి. అ

కవిత

# పాలకులు ప్రకృతి విధ్వంసకులౌతున్నారు

ఆ నదిపై ఆ పడవ సొగసుగా సాగుతోంది
అలల్లో నుండి పాటలు వినిపిస్తున్నాయి
పాటల్లో రంగుల వలయాలు చూశాను
తెరచాప నుండి చిరుగాలి సవ్వడి
ఆ పాటలో గుంపు నృత్యం వుంది
అవును, అద్దాల పావడాలతో
గజ్జెల పట్టాలు మ్రోగుతున్నాయి
ఆ సహజ సౌందర్యం ఎక్కడిది?
తేయాకు ఆకులను తాకడంతో వచ్చిందా!
ఆ గంభీరత టేకు చెట్ల నీడివి నుండి వచ్చిందా!
ఆ నృత్యం నెమళ్ళసావాసం తెచ్చిందా?
ఆ లంబాడీ స్త్రీల కాళ్ళ చప్పుడు నుండే
పదనిసలు ఏర్పడ్డాయి !
అవును, ఆ అరకులోయల్లో
చిరుగాలికి తుమ్మెదలు ధ్వనిస్తున్నాయి
ప్రకృతీ, మనిషీ మమేకం అయ్యారు
చిక్కని చీకటిలో మిణుగురువెలుగులు
అదృశ్యమైనవే మనల్ని ఉత్తేజ పరుస్తున్నాయి
దారంతా సజీవ చిత్రాలు
నేను ఓ పాలరాతి విగ్రహాన్ని చూశాను
శిల్పి కన్నుల్లో వెలుగులు నిండాయి
ఆత్మగౌరవంతో నిండిన
ఆ శిల్పం దృశ్యకావ్యమే
చూపుల్లో పక్షుల ధ్వనులు
మాటల్లో వెన్నెల జల్లులు
నవ్వుల్లో నక్షత్రాల జడి
మూలవాసుల రూప చైతన్యాన్ని ఆ శిల్పంలో చూశాను
అవును, కావ్యమంటే ఏమిటి?
ప్రకృతి మనసూ ప్రకృతుల సమ్మేళనమే కదా!
అయితే ఆ రూప చైతన్యమే ఇది
పాలకులు ప్రకృతి విధ్వంసకులౌతున్నారు
ఎన్నో మనసుల్లో శిల్పాలు శిధిలమౌతున్నాయి
ఆ లంబాడీ స్త్రీ పావడా అద్దం మసిబారుతోంది సుమా!

డా॥ కత్తి పద్మారావు
9849741695

వావిలాల సుబ్బారావు
9866402973

# మునగాల పరగణా కథలు - గాథలు




రచయిత:గుడిపూడి సుబ్బారావు
వెల:150/-,పేజీలు:34+302
స్వేస్ పబ్లికేషన్స్, 1-6-141/19
విద్యానగర్, సూర్యాపేట-508213
తెలంగాణ

ఇటీవల నేను చదివిన పుస్తకాలలో 'మునగాల పరగణా కథలు - గాథలు' విషయపరంగానూ, సామాజిక జ్ఞాపకాలను భద్రపరచవలసిన అవసరాన్ని గుర్తుచేసే పుస్తకంగాను ఇది నన్ను నిగ్గదీసింది. ఇట్లాంటి స్థానిక జ్ఞాపకాలు మనస్వి అయిన ప్రతివానికి ఉంటాయి. వాటిని భద్రపరచే ఓర్పు మాత్రమే అందరికీ ఉండదు. తనను దాటి వెళ్ళిన ఆంతరంగిక జ్ఞాపకాలను భద్రం చేయకపోయినా నష్టం లేదు. చెళ్లపిళ్ళ, శ్రీపాద వ్రాసిన 'కథలు-గాథలు; 'అనుభవాలూ-జ్ఞాపకాలూనూ' అచ్చు కాకపోయి ఉంటే సమాజ చరిత్రకు ఎంతనష్టం! 'అమరావతి కథలు', 'లచ్చుమయ్య కథలు' వచ్చి ఉండకపోతేనో!! అట్లాంటిదే మరొక పుస్తకం 'మునగాల పరగణా కథలు - గాథలు' - రచయిత స్వయంగా అనుభ వించినవి. సేకరించినవి.

ఆ జమీందారుల గురించి, వారి ప్రజల గురించి రచనాడంబరం లేకుండా, కల్పనా శిల్పం లేకుండా, భాషలో అనవసరపు నాజూకులు పోకుండా, స్వచ్ఛంగా దేశవాళీ వాసనతో వ్రాసిన పుస్తకం. రచయిత శ్రీ గుడిపూడి సుబ్బారావుగారి మూర్తిగూడ అంతే. మనిషిని చూచి దేశం చెప్పవచ్చు అన్నట్లు.

మునగాల జమీందారు రాజా నాయని వేంకట రంగారావుగారి పేరు వినగానే భాషాభిమాను లకు, సంస్కృతీ పునరుద్ధారకులకు వారు చేసిన మహత్కార్యాలు, భాషా సేవ, విజ్ఞాన చంద్రికా గ్రంథమాల, కొమర్రాజు లక్ష్మణరావుగారి పోషణ మొదలయిన కాంతి రేఖలన్నీ కనిపిస్తాయి. పోషించబడ్డ పండితులే ఘనంగా కీర్తిస్తారు గనుక అవి ఎక్కడయినా చదువవచ్చు. కాని జమీందారీ ప్రజల అతీగతీ ఎట్లా ఉన్నాయి; ప్రభువులపై ప్రజల భక్తి ఎట్లా ఉంది; ప్రజల మధ్య అనుబంధాల మాధుర్యం ఎట్లాంటిది. ఏమీ తెలియకుండానే పాటించే విలువల మూల్యం ఎట్లాంటిది. ఇవన్నీ తెలియటానికి ఈ పుస్తకం తరగని ఊటబావి...చరిత్ర చదివినట్లు కాకుండా ఆ సమాజాన్ని అనుభ విస్తున్నట్లు ఉంటుంది. రచ్చబండమీద పొద్దుపోయిన తర్వాత ఆ తరం తాతగారు ఈ తరం మనుమలకు చెపుతున్నట్లు ఉంటుంది.

ఇట్లాంటివి వ్రాసేటప్పుడు రచయితకున్న ఆత్మీయ స్పర్శ రచ నకు జోడు కడుతుంది. రచయితకు స్వస్థాన ప్రీతి (నాస్టాల్జియా) ఎక్కువ. అందమయిన జ్ఞాపకాల అందలం ఎక్కి దిగిరాడు. వెళ్లిపో యిన మబ్బుల్లో చిక్కుకున్న మనసు మరలిరానని మారాం చేస్తుంది. ఇంతగా చెప్పటం ఎందుకంటే - పుస్తకంగా తీసుకురాగలిగినా లేక పోయినా ప్రతిగ్రామంలోను ఒకరు వారి గ్రామ సమాజ జ్ఞాపకాలను వ్రాసి భద్రపరిస్తే మెకంజీ కైఫీయతులు ఏ మూలకు వస్తాయి! గ్రామ స్మృతులు అందరికోసం. కుటుంబ స్మృతులు గూడ కొందరికోసం. పదిలం చేయాలి.

బ్రిటిష్ పాలన, నిజాం పాలనకు సరిహద్దుల్లో ఉన్న 42 గ్రామాల పరగణా ఈ మునగాల జమీందారీ. రెండు ప్రభావాలను, రెండు ఒత్తిడులను పొంది, జోడు పడవలపై కాళ్లుంచి సాగిన ప్రాంతం. పెద్ద పాలకులు సులభంగ పన్నులు వసూలు చేసుకొనటం కోసం ఏర్పరచినది జమీందారీ వ్యవస్థ క్రమంగా అదే బలపడి ప్రజల మీద మోయరాని బరువై పీడనగా మారితే, నోరెత్తలేని జనం క్రమంగా తలయెత్తి ఎదిరించ నేర్వటం, ఉద్యమమై జమీందారీ రద్దుదాకా దారి తీయటం - ఆ జాడలు, నీడలు ఈ పుస్తకం విప్పిచెపుతుంది. చరిత్ర పరిశోధనలాగ కాదు జ్ఞాపకాలు కలబోసుకున్నట్లు, కష్ట సుఖాలు చెప్పుకున్నట్లూ.

కలచివేస్తున్న జ్ఞాపకాలు, కలల్లోకి జార్చే జ్ఞాపకాలు ఉన్న వాళ్ళందరు ఈ మార్గం పట్టి వ్రాసి గాదెలు నింపవచ్చు. ఏ భాషలో ఏ నేర్పుతో వ్రాయాలన్న శంకతో వెనుకాడనక్కరలేదు. గ్రామీణ పలుకుబడులు, తెలుగులో కలిసిపోయిన అన్ని పదాలు వ్రాయవచ్చు నన్న భరోసా యిస్తుంది ఈ పుస్తకం.

జమీందారీ వారసత్వపు తగాదాలు దత్త స్వీకారాల కోర్టులు, ప్రీవీ కౌన్సిళ్ళు, జమీందారీ దర్పాలు నిలుపుకోవటం కోసం ఆర్థిక అవసరాలు - అయితే, వీటన్నింటి బరువు మోసే బక్క జీవులు జమీందారీ ప్రజలు. అయినా ప్రభువులకు వారిపై నిర్లక్ష్యం. ఏమీ చేయలేని ప్రజల దౌర్భాగ్యం...ఇవన్నీ కళ్లకు కట్టినట్లు వ్రాశారు. గుర్రపు బగ్గీలో అయ్యగారు ప్రయాణం చేస్తుంటే మోతుబరీ రైతు అయుండి గూడ వెనకాల పరుగెత్తుతూ విన్నపాలు చేసుకోవటం, ఆయన బండి ఆపకుండానే వినీ వినకుండా వినటం చదివితే వారి అహంకారానికి వెగటు పుడుతుంది. చెరువు నిర్మించుకొని మట్టిపని చేసిన వడ్డెర్లకు కూలి యివ్వని కర్కోటకత్వం - ఇవన్నీ ఒక ముఖమ యితే - ఉన్నవ లక్ష్మీనారాయణగారి శారదా నికేతన్‌కు - చేతిలో డబ్బులేని సమయంలో గూడ గుంటూరు పట్టణ నడిబొడ్డున ఐదు ఎకరాల భూమి ఉదారంగా దానం చెయ్యడం మరొక ముఖం - ఇవన్నీ చూస్తే వారి ఘనకీర్తిలోని డొల్లతనం తెలిసి పోతుంది.

ఇట్లాంటి ప్రభువు ప్రీవీ కౌన్సిల్ కేసుగెలిస్తే ఆ గెలుపు తమదే నన్నట్లు సంబరాలు చేసుకొనే పిచ్చి ప్రజలు, ముక్కుపచ్చలారని బాల జమీందారు పల్లకీలో వస్తే విరగబడి చూచే అమాయకులు - కాని వారిపై కనికరం లేని ప్రభువు. వీరి ఔదార్యాన్ని సాహిత్య పోషణను మాత్రమే గుర్తించిన విశ్వవిద్యాలయాలు 'కళా ప్రపూర్ణ' బిరుదులతో అలంకరిస్తాయి. కీర్తిని తెచ్చే ఉన్నతుల పట్ల వీరు ఉదారులు. ఆశ్రితుల యిన బడుగువారిపట్ల వీరే ఉద్ధతులు. ఈ రెండు ముఖాలను

చిత్రించి రచయిత వీరిలో 'జెకిల్ అండ్ హైడ్' అన్నాడని సరిగానే అన్నారు.

తాను స్వయంగా నాలుగైదు భాషలు నేర్చిన పండితుడు, పండిత సాంగత్యం సన్నిహితంగా ఉన్నవాడూ. అయినా ఇవ్వేమి అతని సహజ స్వభావాన్ని మార్చలేక పోయినాయి వారి దానాల్లో, సాహిత్య పోషణలో నిజమయిన సంస్కారమెంత? ఆధునికమయిన, శాస్త్ర ప్రోత్సాహకమయిన ఆలోచనలు చేసినవాడే. శాస్త్రజ్ఞులను, ఇంజ నీర్లను సంప్రదించేవాడు, కె.ఎల్.రావుగారిని ఆదరించి చదివించాడు. వివేకానందుని అమెరికా ప్రయాణానికి కొంత చేయూత యిచ్చాడు. ఆధునిక భావాలు వేరు...అభ్యుదయ భావాలు వేరు.

మనకు అంతగ తెలియని కొన్ని వర్గాల జీవితాలను ఆసక్తి కరంగా వివరించారు; జింకలోళ్లు, కొండలపై రాళ్ళుకొట్టేవాళ్ళు. వారి వృత్తి పద్ధతులు కళ్లముందు నిలిపారు. మానవీయ శాస్త్రం (ఆంథ్రోపాలజీ)ను పరిశోధకులు అధ్యయనం చేసి రికార్డు చేయ వలసిన విషయాలున్నాయి. కరువు కాలంలో ఊరు మొత్తం వలస పోయి 'బేచిరాగ్' అయిన (దీపం వెలగని) ఊళ్ళ గాథలు – భూస్వామి సింగయ్యగారి గుమస్తా వరదయ్య నిజాయితీ – 1995లో వచ్చిన కరువు బాధలు – కస్తూరి రంగయ్య పాడిన మనసు కరిగించే పాట – గాథమయిన సందర్భాలలో పద్య కవులు విలపించిన స్వరాలను దాచి పెట్టిన వారెవ్వరు? కస్తూరి రంగయ్య పాడిన పాటను జ్ఞాపకం ఉంచుకున్న ఈ రచయిత వంటివారు ఒకరో యిద్దరో! 1949 – 50ల్లో కృష్ణానదికి వరదలు వచ్చినపుడు జానపదులు పాటలు కట్టి పాడారు. "వింతగ గొంతులు కోసితివే వంతలమారి కృష్ణమ్మ – నా బొందన పెట్టుకు పోతివే వంతలమారి కృష్ణమ్మ" – అన్న రెండు పాదాలు ఇప్పటికీ గుర్తుకు వచ్చినపుడల్లా కళ్లు చెమ్మగిల్లుతాయి.

'రేపాల తిరునాళ్లు' 'పీసుమగ్రి' గురించి వచనంలో వ్రాసిన పేజీలు వంచనంలో వ్రాసిన 'ఎలిజీ' కవితలతో సాటి. పరగణాల తరతరాల జీవితమంతా పరిశీలించి వారి నైతిక జీవన కారణాలను సిద్ధాంతీకరించారు. "ఆనాడు గ్రామసీమలు ప్రశాంతంగా ఉండటానికి, ఉన్నదానితో తృప్తిపడి జీవించటానికి ముఖ్యకారణం వారు పాటించిన విలువల వల్లనే. అంతేగాని ప్రభుత్వాలు, చట్టాలు కాదు" అన్నారు 276వ పేజీలో. ప్రభుత్వ భయంలేని నీతి, ప్రేమ, స్నేహాలే సమాజ శాంతికి పునాదులు. ఇపుడు ఆ పునాదులు నెర్రెలువిచ్చాయి. కదలి కూలుతున్నాయి. ఆర్థిక సౌభాగ్యం వచ్చినా నైతిక విషాదం అలము కొంటున్నది.

సమాజ పరిణామాలను అర్థం చేసుకొనదలచిన సహృదయులు తప్పక చదువవలసిన గ్రంథం యిది. రచనలో కొన్ని ఘట్టాలు తర చుగా పునరావృతమయినాయి. ధారావాహికగా వ్రాసారేమో! కొంత ఎడిట్ చేసి ఉంటే బాగుండేది. భావితరాలకు పనికి వచ్చే రికార్డులాంటి గ్రంథం.



# వరకవి భూమగౌడు

ఎమ్.వి.శాస్త్రి
9441342999




రచయిత:
వేముల ప్రభాకర్
వెల:200/-
ప్రతులకు :
వేముల ప్రభాకర్ అడ్వకేట్,
ఫ్లాట్ నెం. 103, మనస్విని
హోమ్, రోడ్‌నెం.6, ఆల్వాల్
హిల్స్,సికింద్రాబాద్ – 10,
సెల్ : 7893819376

ఇప్పటి జగిత్యాల జిల్లా (పూర్వం కరీంనగర్ జిల్లా)లోని రావికల్లు ప్రాంతంలో పుట్టి పెరిగిన కైరం భూమగౌడు ఒక సామాన్య గీత కార్మికుడు. కేశవపట్నం శేష మఠవాసి పురుషోత్త మాచార్యుడు గురూపదేశం చేసి, చక్రాంకితం జరిపి వైష్ణవునిగా మార్చి రామానుజాచార్యుల మార్గం చూపుతాడు. వైష్ణవ మత ప్రచారం చేస్తూ భూమదాసుగా మారాడు. గురువుపేరు మీద పురుషోత్తమ దాసు అయ్యాడు. ఈ వైష్ణవ భక్తుని జీవిత కథను, చరిత్రను నవలీకరించి రామానుజ ప్రాభవ సహస్రాబ్ది కానుకగా (1017 – 2017) రామానుజాచార్యులకు సలక్షణమైన అక్షరాంజలిని సమర్పించారు వేముల ప్రభాకర్.

డెబ్బయ్ ఐదేళ్ళ (1875 నుండి 1950 వరకు) తెలంగాణా సమాజానికి – ఆనాటి చరిత్ర, నిజాం రాజు నియంతృత్వ పాలన, జాగీర్దార్లు, జమీందార్లు, దొరల దోపిడీ, సామాన్యుల బాధలు గాథలు, ప్రజాపోరాటాలు, రజాకార్ల రాక్షస కృత్యాలు – వీటన్నిటికీ అద్దం పట్టిన ఈ నవలలో భూమగౌడు జీవిత విశేషాలతో అవి అను సంధానం చేయబడ్డాయి. అతడు నిజాం రాజ్యంలో గడీల పాలనలో దొరల దౌర్జన్యాలను ఎదుర్కొని ప్రజాకవిగా మారతాడు. ఎన్నికష్టాలు ఎదురైనా ప్రజాపక్షం వదలకుండా, అట్టడుగు వర్గాలకు అండగా నిలుస్తాడు. పన్నెండేళ్ళు కుటుంబానికి, స్వగ్రామానికి దూరమై దేశాటన చేస్తూ, అనువంశిక ఆయుర్వేద వైద్యుడు లక్ష్మీనరసింహం పంతులు వద్ద ప్రకృతి వైద్యం నేర్చుకుని వైద్యం చేస్తూ, తన కవితల ద్వారా సమాజంలోని చెడును కడిగేస్తూ ఎందరికో జ్ఞాన భిక్ష పెట్టాడు. రామానుజుని సిద్ధాంతం అయిన మానవసేవయే మాధవసేవను ఆచరణలో చూపిన వ్యక్తి భూమగౌడు. "కడుపాతకుడైన లక్మారెడ్డి' దొర బూడిద అవ్వాలని కవిగా వానిని శపించి, నువ్వు "సత్య నాశనం అయ్యేంత వరకు రావికల్‌లోఅడుగుపెట్టనని" భీషణ ప్రతిజ్ఞ చేసి దేశాటనం చేసి పుష్కర కాలం తర్వాత ఆ దొర కుష్ఠు వ్యాధిగ్రస్తుడయి గ్రామాంతరం వెళ్లిపోయిన తర్వాత, భూమదాసు తిరిగి స్వగ్రామం చేరుకుంటాడు.

దేశ సంచారంలో భాగంగా ఎన్నో సామాజిక సమస్యలను – పేదరికం, అజ్ఞానం, మూఢ విశ్వాసాలు, కుల వివక్ష, లింగ వివక్ష, అంటరానితనం అగ్రవర్ణాల వారి, పాలకుల దౌర్జన్యాలు అతనికి తటస్థ పడతాయి. అటువంటి సందర్భాలలో బడుగు బలహీన వర్గాల ప్రజలు పడుతున్న బాధలు చూసి, ఆ నిర్భాగ్యులను ఆదుకోవటమే తన జీవితాశయంగా భూమదాసు తన వైద్యం ద్వారా, తన బోధల ద్వారా, కవితల ద్వారా జీవితం సార్థకం చేసుకుంటాడు.

ఈ నవలలో ముఖ్యంగా ఆకర్షించేవి ఇందులోని పద్యాలు, పాటలు, మంగళ గీతాలు, చాటువులు, శ్లోకాలు యింకా ముఖ్యంగా తెలంగాణా సామెతలు, ఉర్దూ సామెతలు. సందర్భాన్ని అనుసరించి భూమగౌడు రచించిన 'రామశతకం' లోని సుమారు 75 సీస పద్యాలను అమర్చారు. "గజమునకు మోక్షమిచ్చిన ఖగపతీంద్ర! రాజ రాజేంద్ర రావికల్ రామచంద్ర" అన్న మకుటంతో వైష్ణవభక్తి, రామానుజ నుతి, ఆనాటి సామాజిక పరిస్థితులను యాత్రా స్మృతులను తెలియచేస్తూ సాగిన ఈ శతకంలో పద్యాలు చాల ఆసక్తికరంగా ఉన్నాయి. వీటితోపాటు భూమదాసు రచనలయిన కృష్ణ చెలియలు, ఆధ్యాత్ములు, తిర్నామాలు, మంగళహారతులు, నిత్య తనయులు వెు॥ వాటిని సందర్భాను సారంగా ఉపయోగించటం జరిగింది. అక్కడక్కడ ఈ రచనలలో భాషా దోషాలు, ఛందో భంగాలు ఉన్నప్పటికీ వాటిని మామూలు పాఠకులు ఆస్వాదిస్తారు. పూర్వకవుల పద్యాలలోని కొన్ని చరణాలను కూడా ఇందులో ఉప యోగించుకున్న వైనం కన్పడుతుంది. ఈ నవలలో పాత్రలు, సంభాషణలు, సంఘటనలు, అన్నీ చాల సులభమైన సరళమైన భాషలో వ్రాసి, రామానుజాచార్యుని అంతరంగాన్ని, విశిష్టాద్వైతాన్ని అర్థం చేసుకోవటానికి దోహదం చేస్తారు రచయిత.

వరకవి అయిన భూమదాసుని జీవిత చరిత్ర – సామాజిక, తెలంగాణా చారిత్రక దృష్టి కోణాలతో చూసినట్లయితే చాలా విలువగల నవలగా నిలిచిపోతుంది. ఒక వైష్ణవ భక్తుని జీవిత కథ – రామానుజ సహస్రాబ్దిన వెలువరించబడటం చాల సందర్భో చితం. మంచి నవలగా నిలబడుతుంది. అ

# మన అమ్మ భాషతో ఒకరోజు గడుపుదాం...

## అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం సందర్భంగా తెలుగు పలుకు బాపట్ల వారి కార్యక్రమం...




1913లో ప్రథమాంధ్ర మహాసభ వేదికయైన బాపట్ల టౌన్‌హాల్‌లో (కోన ప్రభాకరరావు కళాక్షేత్రం) అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవ వేడుకలు ఫిబ్రవరి 21వ తేదీ ఉదయం 9 గం. నుండి రాత్రి పొద్దుపోయేంతవరకూ ‘తెలుగు పలుకు’ ఆధ్వర్యంలో జరిగాయి.

ఈ వేడుకలో భాగంగా చిన్నపిల్లల్లో అమ్మభాష పట్ల ఆసక్తి, అనురక్తి కలగడానికి వీలుగా ఉదయం 9 గం. నుండి కార్యక్రమాలు రూపొందించారు. అందులో భాగంగా తెలుగు మాట్లాడడం’ తెలుగు వ్రాయడం’ తెలుగు చదవడం ప్రధాన అంశాలుగా 10వ తరగతి లోపు పిల్లలకు పోటీను నిర్వహించారు. తెలుగు మాట్లాడడం అనే పోటీలో రెండు నిమిషా పాటు పరభాషా పదాలను లేకుండా తెలుగులో మాట్లాడడం అనే కార్యక్రమంలో చిన్న పిల్లలు ఉత్సాహంగా పాల్గొనడమే కాకుండా, మాట్లాడడంలో అప్రయత్నంగా వచ్చే ఇతర భాషా పదాలను నియంత్రించుకుంటూ వాటిని తెలుగులో మాట్లాడడానికి ప్రయత్నం చేస్తూ ఎంతో ఉత్తేజంగా పోటీలో పాల్గొన్నారు. పట్టణంలోని, చుట్టు పక్క గ్రామాలోని అనేక పాఠశాలలకు చెందిన సుమారు 123 మంది చిన్న పిల్లలు ఈ పోటీలో పాల్గొన్నారు.

రెండవ కార్యక్రమంగా దాశరథీ శతకంలోని పద్యాలను చదవడం అన్న పోటీ నిర్వహించారు. ఆశ్చర్యకరంగా ఇంగ్లీషు మాధ్యమంలో బోధన చేసే పాఠశాల నుండి వచ్చిన పిల్లలు కూడా స్పష్టంగా రాగయుక్తంగా పద్యాలను చదివారు. పోటీలో 53 మంది పిల్లలు పాల్గొన్నారు.

మూడవది తెలుగు వ్రాయడం అన్న పోటీలో 150 మంది పిల్లలు పానుగంటి లక్ష్మీనరసింహంగారి ‘సాక్షి’ వ్యాసాల నుండి చదవబడిన వాక్యాలను తప్పు లేకుండా వ్రాయడానికి పోటీ పడ్డారు.

**ఈ కార్యక్రమాల నిర్వహణలోని ప్రధాన లక్ష్యమైన “తెలుగు మాట్లాడండి, చదవండి, వ్రాయండి” అన్న అంశాన్ని ఈ పిల్లలు చాలా చక్కగా అర్థం చేసుకోవడమే కాకుండా వాటిని నినాదాలుగా గొంతెత్తి పెద్ద స్వరంతో నినదించడం చాలా ఆనందదాయకమైన విషయం. పిల్లల స్వరాల నుండి సంగీతంలా వినిపించిన ఈ నినాదాలతో మార్మోగిన ఆ ప్రాంగణం ఆనాడు ప్రథమాంధ్ర మహాసభను నిర్వహించిన పెద్దల ఆకాంక్షకు ఈనాటి ఈ తరం వారి మద్దత్తులా అనిపించింది.**

మధ్యాహ్నం 3 గం. నుండి “మన చదువులు – మనభాషలో సాధ్యాసాధ్యాలు” అన్న అంశంపై ఇంజనీరింగ్, ఆర్ట్స్, వ్యవసాయ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు నిర్వహించిన సదస్సు చర్చాగోష్ఠిగా మారి కొనసాగింది. ఈ చర్చాగోష్ఠిలో ప్రధానంగా విద్య అమ్మభాషలో ఉంటే జ్ఞాన సముపార్జన తేలికగా జరుగుతుందనే అభిప్రాయంతో పాటు, ఉపాధి అవకాశాలు సన్నగిల్లిపోతాయనే అభద్రతా భావాన్ని విద్యార్థులు వ్యక్తం చేయడం గమనార్హం.

షేక్ రహమానుద్దీన్ “కంప్యూటర్‌లో తెలుగు వినియోగం”పైన ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ సభలోని వారికి తెలుగును కంప్యూటర్‌లో వినియోగించే విషయంపై ఉన్న అపోహను తొలగించే



ప్రయత్నం చేసింది.

సాయంత్రం 6.30 గం.లకు బహిరంగ సభ వివేక సర్వీస్ సొసైటీ అధ్యక్షులు ఎన్.వి.వి. నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్ బాబు తెలుగు భాష పరిరక్షణ అనే లక్ష్యం నెరవేరాలంటే ప్రధానంగా పాలకుల్లో సాచివేత ధోరణి పోవాలి మార్పు రావాలి అని నిర్ద్వందంగా ప్రకటించారు. తెలుగు మనుగడకు ప్రధానమైన అంశం పరిపాలనలో తెలుగు వినియోగం అన్న విషయాన్ని సాధికారికంగా, సాక్ష్యాలతో నిరూపిస్తూ ప్రసంగించిన రమేష్ బాబు, తెలుగు భాషా వినియోగాన్ని ప్రోత్సహించడంలో పాలకుల నిర్లిప్తతను, నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. పరిపాలనలో తెలుగు భాషా వినియోగంపై అనేక మార్లు పాలకులతో ప్రత్యక్షంగానూ, న్యాయస్థానాలలోనూ పోరాడవలసి వచ్చిన సందర్భాలను వివరిస్తూ సాగిన ప్రసంగంలో రమేష్ బాబు తెలుగు పరిరక్షణకు ప్రజల పాత్రను గుర్తుచేస్తూ వారి బాధ్యతను కూడా వివరించారు. మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆం.ప్ర. నాటక అకాడమీ ఉపాధ్యక్షుడు డా॥ కందిమళ్ళ సాంబశివరావు వ్యక్తిత్వ వికాసానికి తెలుగు భాషా సాహిత్యంలో అద్భుతమైన శతక సాహిత్య వనయున్నాయని వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవసిన అవసరం తెలుగు సమాజంపై ఉన్నదనీ గుర్తుచేశారు. అధ్యక్షుడు ఎన్.వి.వి. నాగరాజు యునెస్కో సందేశాన్ని అనువదించి అందించారు. కళ్ళం హరినాథరెడ్డి జీతం కోసం పరభాష జీవితం కోసం మన భాష అంటూ భాషా ప్రాధాన్యాన్ని వివరించారు. మరో అతిథి సంగమేశ్వర శాస్త్రి తెలుగు పుస్తకాల ప్రాధాన్యాన్ని ప్రతి యింటిలో ఉండవసిన తెలుగు పుస్తకాలను గురించి గుర్తు చేశారు. తెలుగు పలుకు ట్రస్టీ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ తెలుగు మాట్లాడడం, చదవడం, వ్రాయడం ఎంత ముఖ్యమైన విషయాలో భాషా పరిరక్షణలో మొదటి మెట్లుగా వాటికి ప్రాధాన్యతను ఇవ్వవసిన అవసరాన్ని గుర్తుచేస్తూ ప్రసంగించారు. ఉదయం 9 గం. నుండి రాత్రి 9గం. ల వరకూ సాగిన ఈ "మన అమ్మ భాషతో ఒకరోజు గడుపుదాం" అన్న కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో తెలుగు పలుకు సభ్యుడు కవి నందిరాజు విజయ్‌కుమార్, కార్యదర్శి ప్రముఖ రచయిత తిమ్మన శ్యామ్ సుందర్, వివేక సర్వీస్ సొసైటి సిబ్బంది మరియు పలు సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు, రామకృష్ణ సేవా సమితికి చెందిన అమిరపు నటరాజన్ పోటీలకు సామర్థ్య పరిశీలకునిగా వ్యవహరించారు.



## మైదుకూరులో (కడపజిల్లా) ఘనంగా మాతృభాషా దినోత్సవం

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప జిల్లా మైదుకూరులో "తెలుగు సమాజం" సంస్థ నిర్వహించిన కవితల పోటీ, కథలపోటీ విజేతలకు 21న బహుమతి ప్రదానోత్సవం తెలుగు సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, రచయిత తవ్వా ఓబుల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి, సోషలిస్ట్ అభియాన్ కన్వీనర్ లెక్కల వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలుగుభాష వికాసానికి కొత్త తరం రచయితలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. రచయితలు డాక్టర్ పొదిలి నాగరాజు, డివిఎస్ నాయుడు, జి.వీరగురు మూర్తి, కే.ప్రతాపరెడ్డి, తెలుగు అధ్యాపకులు రాము, కళాకారులు ఎ.వీరాస్వామి, ధర్మిసెట్టి రమణ, గురువారెడ్డి సాహిత్య విశ్లేషకుడు ఎస్.సాదక్ తదితరులు పాల్గొన్నారు. కవితల, కథ పోటీలో బహుమతులు పొందిన వారికి 12 నగదు బహుమతులతోపాటు జ్ఞాపికలను, ప్రశంసా పత్రా లను, పోటీలో పాల్గొన్న మరో 60 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రం, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మిసెట్టి రమణ ఆధ్వర్యంలో మాధవరాయ మహిళా కళా బృందం ప్రదర్శించిన కోలాటం సభికులను, విద్యార్థులను ఆకట్టుకుంది.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# తెలుగు భాషోద్యమ సమాఖ్య, తెనాలి (21-2-18)
# అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవ సభలు గుంటూరు జిల్లాలో...



ఉదయం గం.10లకు **చిలుమూరు** శ్రీరామా గ్రామీణ విద్యాసంస్థల ప్రాంగణంలో ప్రసంగిస్తున్న రెహమానుద్దీన్
వేదికపై ప్రిన్సిపాల్ కొలసాని తులసీవిష్ణుప్రసాద్, డా॥ సామల రమేష్‌బాబు, సామల లక్ష్మణబాబు, చందునాగేశ్వరరావు






12 గం.లకు తెనాలి- మహిళా ఇంజనీరింగ్ కళాశాల : ప్రసంగిస్తున్న తెలుగుభాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు సామల రమేష్‌బాబు,
వేదికపై కళాశాల ప్రిన్సిపాల్ ఘట్టమనేని నాగేశ్వరరావు, రెహమానుద్దీన్ షేక్, డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ కొలసాని రామ్‌చంద్.






6గం. లకు:బాపట్లలో'అమ్మపలుకుట్రస్టు'వారి బహిరంగసభ:ప్రసంగిస్తున్న ఆం.ప్ర.నాటకఅకాడమీ ఉపాధ్యక్షుడు కందిమళ్ళసాంబశివరావు
తె.భా.సమాఖ్యఅధ్యక్షుడు సామలరమేష్‌బాబు, వేదికపై అంబటిమురళీకృష్ణ,ఎన్.వి.వి.నాగరాజు,కళ్ళం హరనాథరెడ్డి,బి.సంగమేశ్వరశాస్త్రి

అమ్మనుడి (తెలుగుజాతి పత్రిక)
AMMANUDI (Telugu Monthly)
March 2018 Vol. 4, Issue 1

Date of publication : 1st of every month
Date of posting : 3rd&6th of every month

RNI-APTEL/2015/62362
Postal Reg. NO.TEN\13\2018-20

Bommidala
International

# తెలుగు ఉగాది శుభాకాంక్షలు







## బొమ్మిడాల ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్

భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎగుమతి సంస్థ

బి.టి.సి.హౌస్, ఐదవ వీధి
చంద్రమౌళినగర్, గుంటూరు-522 007

Tel :91-863-2357615, 2357616
Fax : 91-863-2351343
E mail : murtybsk@bommidalainternational.com
bskmurty@yahoo.co.in
Website : www.bommidalainternational.com

If not delivered, please return to : 'The publisher, AMMANUDI monthly,
8-386, Jivaka bhavanam, ANGALAKUDURU (po), TENALI- 522 211, Guntur (dt) A.P. Cell: 9440 448244